PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 195 | విజయవాడ, మంగళవారం 20 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 20 February 2024 | Rs

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 20, 21, 22, 23 తేదీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. క్యాంపుల్లో ఆధార్ డాక్యుమెంట్స్ అప్‌డేట్‌తోపాటు అన్ని ఆధార్ సేవలు అందించనున్నట్లు పేర్కొంది. వీటితోపాటు ఇతర ముఖ్య సేవలు కూడా ప్రజలకు అందించనున్నట్లు తెలిపింది.

మిలాన్ రిహార్సల్స్ ప్రారంభం

2

ఎన్‌డిఎ ఎంపిల నియోజకవర్గాల్లో రేపు నిరసనలు

సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

ఐదు పంటలు, ఐదేళ్ల కాంట్రాక్టు ఎంఎస్‌పికి తిరస్కరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రేపు (21వ తేది - బుధవారం) దేశవ్యాప్తంగా బిజెపి, ఎన్‌డిఎ ఎంపిల నియోజకవర్గాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. బహిరంగ సభలు, కాగడాల ప్రదర్శనలతోపాటు ఇతర నిరసన కార్యక్రమాలను శాంతియుతంగా నిర్వహించాలని సూచించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేసింది. అంతకుముందు ఆదివారం రాత్రి పొద్దుపోయేంతవరకు రైతు సంఘాల ప్రతినిధులతో జరిపిన చర్చల్లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఐదు సంవత్సరాలకు, ఐదు పంటలకు మాత్రమే ఉద్దేశించిన కాంట్రాక్టు ఎంఎస్‌పి ప్రతిపాదనను ఎస్‌కెఎం తిరస్కరించింది. అన్ని పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర ప్రకటించాలన్న రైతాంగ డిమాండ్‌ను పక్కదోవ పట్టించేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చిందని విమర్శించింది. దేశ ప్రజల ముందు మోడీ ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరించాలని పేర్కొంది. మోడీ ప్రభుత్వ ఈ వైఖరికి నిరసనగా ఆందోళనలను కొనసాగించాలని పిలుపునిచ్చింది.

చర్చల్లో కేంద్రం ఇలా...

చండీగఢ్‌లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం రాత్రి 8 గంటలకు ప్రారంభమైన చర్చలు సోమవారం తెల్లవారుజామున 1:30 వరకు జరిగాయి. ఈ సమావేశంలో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పియూష్ గోయల్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ పాల్గొన్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, పంజాబ్ వ్యవసాయశాఖ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుడియాన్ కూడా చర్చల్లో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా సాగులో వైవిధ్యీకరణను ప్రోత్సహించే పేరిట ఐదు సంవత్సరాల పాటు, ఐదు పంటలకు కనీస మద్దతు ధర ఇస్తామని కేంద్రం ప్రతిపాదించింది. కేంద్రం చెప్పిన పంటల జాబితాలో మూడు పప్పు ధాన్యాలు (మినుములు, మైసూర్ పప్పు, కందులు) ఉన్నాయి. అవికాకుండా మొక్కజొన్న, పత్తికి ఐదు సంవత్సరాల పాటు కనీస మద్దతు ధర ఇస్తామని కేంద్రం పేర్కొంది. ఒప్పందం అమలుకోసం రైతు సంఘాలతో ప్రభుత్వం తరపున నేషనల్ కో ఆపరేటివ్ కన్స్యూమర్స్ మిగతా 2లో

ఢిల్లీ - శంభు సరిహద్దు వద్ద రైతుల ఆందోళన, పెల్లెట్ల దాడిలో గాయపడిన, చూపు కోల్పోయిన రైతులు (ఇన్‌సెట్‌లో)

యుపిలో ఎస్మా ప్రయోగం

- ఆరు నెలల పాటు సమ్మెలు, నిరసనలపై నిషేధం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కార్మిక, ఉద్యోగ సంఘాలు

7

బ్యాలెట్లను దిద్దాను

- చండీగఢ్ మేయర్ ఎన్నిక ప్రిసైడింగ్ అధికారి అంగీకారం
- ప్రాసిక్యూట్ చేయాలన్న సుప్రీం
- నేడు మళ్లీ విచారణ

చండీగఢ్ : బిజెపి మేయర్ మనోజ్ సోన్‌కర్ విజయం సాధించేందుకు మార్గం సుగమం చేసేలా బ్యాలట్ పత్రాలపై క్రాస్ మార్క్ పెట్టినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి అనీల్ మసీహ్ అంగీకరించారు. గత నెల్లో జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టు సోమవారం విచారణ పునఃప్రారంభించింది. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారి ఎనిమిది బ్యాలెట్ పత్రాలపై క్రాస్ మార్క్ వేసి, అనంతరం వాటిని చెల్లని ఓట్లుగా ప్రకటించారు. ఓటింగ్ ప్రక్రియ సందర్భంగా కౌన్సిలర్లు దిద్దిన బ్యాలట్ పత్రాలపైనే తాను క్రాస్ మార్క్ పెట్టినట్లు చెబుతూ ఆ అధికారి తన చర్యను సమర్థించుకున్నారు. ఆ పత్రాలు మిగిలిన వాటితో కలిసి పోకుండా చూసేందుకే తాను అలా గుర్తు పెట్టినట్లు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ స్పందిస్తూ, బ్యాలెట్ పత్రాలపై మీరు కేవలం సంతకం మాత్రమే చేయాల్సివుంటుంది. మీరు ఇతరత్రా మార్కులు కూడా పెట్టవచ్చని నిబంధనల్లో ఎక్కడైనా వుందా? అని ప్రశ్నించారు. అనంతరం సొలిసిటర్ జనరల్‌నుద్దేశించి మాట్లాడుతూ, 'ఎన్నికల క్రమంలో జోక్యం చేసుకున్నందున ఆయనను ప్రాసిక్యూట్ చేయాల్సి వుంది' అని పేర్కొన్నారు. ఆ బ్యాలెట్లను మంగళవారం బెంచ్ పరిశీలిస్తుందని చంద్రచూడ్ చెప్పారు. పంజాబ్, హర్యానా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కస్టడీలో వుంచిన అన్ని బ్యాలెట్ పత్రాలను, వీడియో రికార్డింగ్‌లను మంగళవారం మధ్యాహ్నం 2గంటల కల్లా సుప్రీంకోర్టు ముందు హాజరుపరచాల్సిందిగా మిగతా 2లో

మహిళా సంఘాల ఐక్యవేదిక చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి

మహిళా సాధికారతే లక్ష్యంగా మేనిఫెస్టోలు ఉండాలి

- బడ్జెట్‌లో 3 శాతం కేటాయించాలి
- మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళల సమస్యలు పరిష్కరించేలా మహిళా సాధికారతే లక్ష్యంగా రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలను రూపొందించాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఎన్నికల మేనిఫెస్టోలో మహిళా సమస్యలు చేర్చాలని కోరుతూ మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం చర్చా కార్యక్రమం జరిగింది. మహిళా సంక్షేమానికి, ఉపాధి కల్పనకు బడ్జెట్‌లో మూడో వంతు కేటాయించాలనే తీర్మానాన్ని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి ప్రవేశపెట్టారు. విస్తారమైన శక్తిగా ఉన్న పొదుపు మహిళలకు ప్రభుత్వ సహకారం పెరగాలని తీర్మానించారు. పురుషులతోపాటు ఉపాధి, సమాన వేతనం కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. మద్యనిషేధ వాగ్దానానికి కట్టుబడి ఉండాలని, రాజ్యాంగ స్ఫూర్తిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల నాయకత్వంలో అభివృద్ధి సాధించాలనే జి20 పిలుపును అమలు చేసేందుకు సమూల మార్పులు అవసరమని, దీనికి రాజకీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు. మహిళల దుస్థితి మారాలని, సాధికారత రావాలని తెలిపారు. మహిళా సమస్యలను ఆయా పార్టీలు తమ ప్రణాళికలో చేర్చాలని, వాటిపై ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు తమ ప్రణాళికలో ఈ అంశాలను చేర్చి అమలుకు హామీ ఇవ్వాలని కోరారు. ఆయా రాజకీయ పార్టీ నాయకులను కలిసి తీర్మానం కాపీలను అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల ఉపాధి దారుణంగా పడిపోయిందని విమర్శించారు. 2018-19లో మహిళలు ఉపాధిలో 21.9 శాతం మంది ఉంటే 2022-23లో 15.9 శాతానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. 90 శాతం మంది మహిళల అసంఘటిత రంగంలో ఉంటూ హీనమైన వేతనంతో పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ.. ఒంటరి మహిళల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. చిన్న వయసులోనే భర్తలను కోల్పోతున్న మహిళలకు ఆలంబనంగా ఉండే విధంగా 20 ఏళ్ల నుంచే వారికి సంక్షేమ చర్యలు అమలు చేయాలని కోరారు. పుట్టింటి పేరు కొనసాగించడం, మిగతా 7లో

పాడేరు ఐటిడిఎ వద్ద బైఠాయించిన సిహెచ్‌డబ్ల్యులు

కదంతొక్కిన సిహెచ్‌డబ్ల్యులు

- ఆశాలుగా మార్పు చేయాలంటూ ఐటిడిఎల వద్ద ఆందోళన
- పాడేరులో సిఐటియు నాయకుడు అరెస్టు, ఉద్రిక్తత

ప్రజాశక్తి- యంత్రాంగం

తమను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని కోరుతూ గిరిజన ప్రాంతాల్లోని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు(సిహెచ్‌డబ్ల్యులు) సోమవారం కదంతొక్కారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎను ముట్టడించారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల వద్ద మహాధర్నా నిర్వహించారు. తమను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని, రూ.పది వేలు వేతనం ఇవ్వాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఎపి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 14 నుంచి 16 వరకూ నిరాహార దీక్షలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఐటిడిఎల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సిహెచ్‌డబ్ల్యుల నినాదాలతో పాడేరు ఐటిడిఎ ప్రాంగణం మార్మోగింది. కార్యాలయంలోకి వెళ్లనీయకుండా అప్పటికే అక్కడ భారీగా మిగతా 2లో

ఏజెన్సీ నిరుద్యోగులకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో న్యాయం చేయండి

- సిఎంకు వి.శ్రీనివాసరావు లేఖ

లోపలి పేజీలో..

కేసు ఉపసంహరించుకుంటేనే అప్పు!

- కేంద్రం షరతులకు కేరళ తిరస్కరణ
- వెనక్కి తీసుకునేది లేదన్న కేరళ

కౌలు రైతులకు రుణాలివ్వండి

- ఎస్‌ఎల్‌బిసి బ్యాంకర్లకు బుగ్గన విజ్ఞప్తి
- పాడి పరిశ్రమకూ సహకరించాలని సూచన
- ప్రభుత్వ పథకాలకు ప్రైవేటు బ్యాంకులూ సహకరించాలి

ఎస్‌ఎల్‌బిసి సమావేశంలో మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కౌలు రైతులకు పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో 226వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న బుగ్గన మాట్లాడుతూ కౌలు రైతులతోపాటు పాడి పరిశ్రమాభివృద్ధికి కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ రంగానికి కూడా బ్యాంకులు రుణాలు అందించాలన్నారు. మూడు, నాలుగు జిల్లాల్లో డెయిరీ రంగం అభివృద్ధికి ఎక్కువ అవకాశాలున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణ ప్రణాళిక అమలులో 108 శాతం లక్ష్యాన్ని సాధించడం పట్ల మంత్రి బుగ్గన వివిధ బ్యాంకులను అభినందించారు. ప్రభుత్వ పథకాలకు ప్రైవేటు బ్యాంకులు కూడా తోడ్పాటు అందించాలన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజరు రాజీవ్ మిశ్రా మాట్లాడుతూ.. రాష్ట్రంలో మెరుగైన ఇ-క్రాపింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. గుడ్ గవర్నెన్స్‌లో రాష్ట్రం ఉత్తమ రాష్ట్రంగా నిలిచిందన్నారు. వార్షిక రుణప్రణాళిక అమలులో వివిధ బ్యాంకులు సాధించిన ప్రగతిని ఆయన వివరించారు. ఎస్‌ఎల్‌బిసి కన్వీనరు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజరు ఎం రవీంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 23-24 వార్షిక రుణ ప్రణాళిక అమలుకు సంబంధించి డిసెంబరు నెలాఖరు వరకు వివిధ బ్యాంకులు సాధించిన ప్రగతిని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 2023-24 వార్షిక రుణ ప్రణాళిక కింద రాష్ట్రంలోని వివిధ బ్యాంకుల ద్వారా 4 లక్షల 77 వేల 234 కోట్లు రుణాలందించి 108 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. యుబిఐ జిఎం, ఎస్‌ఎల్‌బిసి కన్వీనరు రవీంద్రబాబు మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద 35 వేల సంఘాలకు రుణాలందించాల్సి ఉండగా, ఇప్పటికే 31,699 సంఘాలకు సహాయం అందించి 91 శాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు.

నాబార్డు చీఫ్ జనరల్ మేనేజరు ఎంఆర్‌గోపాల్ మాట్లాడుతూ.. వార్షిక రుణ ప్రణాళిక అమల్లో డిసెంబరు చివరి నాటికే మంచి ప్రగతి సాధించారని బ్యాంకు అధికారులను అభినందించారు. కిసాన్ క్రెడిట్ కార్డుదారులకు రుణాలందించడంలో మంచి ప్రగతిసాధించారన్నారు. ఈ సమావేశంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎపి ఇన్‌ఛార్జి రాజేష్ కె మహానా, యుబిఐ జిఎం గుణనాథ్‌గమి, ఆర్థికశాఖ కార్యదర్శి కెవి సత్యనారాయణ, చేనేతజౌళిశాఖ ముఖ్యకార్యదర్శి సునీత, వ్యవసాయశాఖ ఇన్‌ఛార్జి కమిషనరు శేఖర్‌బాబు, టిడ్కో ఎమ్‌డి శ్రీధర్, మెప్మా ఎమ్‌డి విజయలక్ష్మి, వివిధ బ్యాంకుల రాష్ట్ర స్థాయి కో-ఆర్డినేటర్లు, లీడ్, డిస్ట్రిక్ట్ మేనేజర్లు పాల్గొన్నారు.

'స్థానికత'పై కమిటీ

రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజన అనంతరం ఇచ్చిన స్థానికత ఉత్తర్వుల గడువు ఈ ఏడాది జూన్ రెండోతేదీతో ముగియనుండటంతో విద్యా సంస్థల్లో రిజర్వేషన్ల కొనసాగింపు తదితర అంశాలపై పరిశీలించి ఉత్తర్వులు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. స్థానికత అధారంగా విద్యా సంస్థల్లో రిజర్వేషన్ల కోటా సవరణ లేదా కొత్తగా ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ఎనిమిది మంది ఉన్నతాధికారులు సభ్యులుగా ఈ కమిటీని ఏర్పాటు చేసింది. రెండు నెలల్లో ఈ కమిటీ నివేదికను ఇవ్వాల్సి ఉంటుంది. స్థానికత కోటా అంశంపై విద్యార్థులు, అసోసియేషన్లు, యూనియన్లు, నిపుణులు ప్రజల నుండి అభ్యంతరాలను స్వీకరించాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో వైద్యఆరోగ్యశాఖ, వ్యవసాయ, సహకారశాఖ, పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. మానవ వనరులు, సర్వీసులశాఖ కార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అలాగే అడ్మిషన్ల రంగంలో నిపుణులు ఒకరు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఎపి ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ ఆర్డర్ 1974, ఉన్నత విద్యలో రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు అమలవుతున్న రిజర్వేషన్లు తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను సమర్పించాల్సి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ రాజపత్రము

THE ANDHRA PRADESH GAZETTE

PUBLISHED BY AUTHORITY

విభజన సమయంలో ఆలస్యంగా స్థానికత పొందిన వారికి సంబంధించిన అంశాలను పరిశీలించనున్నారు. అడ్మిషన్ల చట్టం 1974 ప్రకారం అడ్మిషన్లలో స్థానికులకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. విభజన చట్టం 2014 పారా 95లో . పేర్కొన్న విధంగా అన్ని విద్యా సంస్థల్లో అడ్మిషన్ల అంశంలో ఎటువంటి ఇబ్బందీ లేకుండా స్థానికత అడ్మిషన్లు కొనసాగింపుపై ఈ కమిటీ విధివిధానాలు రూపొందించనుంది. అలాగే 371-డి ప్రకారం విభజనకు ముందున్న ఉమ్మడి ఎపిలోని విద్యార్థులకు విభజన అనంతరం ఏర్పాటైన ఎపిలోని విద్యా సంస్థల్లో అడ్మిషన్లకు 15 శాతం రిజర్వేషను అమలు చేయాల్సి ఉంటుంది. దీనిపై కమిటీ పరిశీలించి నివేదిక ఇవ్వనుంది. ఉత్తర్వులిచ్చి 10 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో విభజన చట్టం ప్రకారం పేర్కొన్న స్థానికత అనే అంశాన్ని నిలిపివేయాలా లేదా కొనసాగించాలా అనే అంశంపైనా చర్చించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శిస్తున్న న్యాయమూర్తి లీలావతి

ఆరుగురు ఉద్యోగుల సస్పెన్షన్

- వాల్ ఆపరేటర్ విధుల నుంచి తొలగింపు
- డయేరియా ప్రబలడంతో గుంటూరు కమిషనర్ చర్యలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో తాగునీరు కలుషితం కావడానికి కారకులుగా పేర్కొంటూ ఆరుగురు ఉద్యోగులను నగర పాలక సంస్థ కమిషనర్ చేకూరి కీర్తి సోమవారం సస్పెండ్ చేశారు. డయేరియాపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై చర్యలకు కమిషనర్ ఉపక్రమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో అలసత్వం చూపడంతో ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయం కార్యదర్శులను విధుల నుండి సస్పెండ్ చేశామని చెప్పారు. గుంటూరులోని శారద కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో డ్రెయిన్‌లు, రోడ్ల నిర్మాణం సమయంలో నీటి కుళాయిలను షిఫ్ట్ చేయకపోవడం, డమ్మీలను క్లోజ్ చేయకపోవడం, వాల్ పిట్స్ శుభ్రం మిగతా 7లో

ఊపిరితిత్తులను దెబ్బతీసిన కోవిడ్

ముంబయి : కోవిడ్ బారినపడిన యూరోపియన్లు, చైనీయులతో పోలిస్తే భారతీయుల్లోనే ఊపిరితిత్తులు ఎక్కువగా దెబ్బతిన్నాయని వెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజి అధ్యయనంలో తేలింది. వారు తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడానికి సంవత్సర కాలానికి పైగా పట్టింది. కొందరిలో జీవితాంతం ఈ సమస్య కొనసాగవచ్చు. అధ్యయనంలో భాగంగా 207 మందిని పరీక్షించారు. దేశంపై కోవిడ్ మహమ్మారి తొలిసారి విరుచుకుపడినప్పుడు నిర్వహించిన ఈ అధ్యయనం వివరాలను పిఎల్‌ఒఎస్ గ్లోబల్ పబ్లిక్ హెల్త్ జర్నల్‌లో ఇటీవల ప్రచురించారు. ఊపిరితిత్తుల పనితీరుకు (ఎల్‌ఎఫ్‌టి)కు సంబంధించిన పరీక్షలో 44% మంది ఊపిరితిత్తులపై కోవిడ్ ప్రభావం పడిందని, ఇది చాలా ఆందోళన కలిగించే విషయమని వైద్యులు తెలిపారు. 35% మందిలో పరిమిత స్థాయిలో లోపాలు కన్పించాయని వెల్లూరు కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ డిజె క్రిస్టోఫర్ చెప్పారు. ఏ విధంగా చూసినా భారతీయ రోగులపై ప్రభావం దారుణంగా పడిందని తెలిపారు. నాలుగు నుంచి ఐదు శాతం మందిలో మాత్రం జీవితకాలం ఈ సమస్య ఉంటుందని నానావతి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ సలిల్ బెంద్రే చెప్పారు.

ఎన్నికల షెడ్యూల్‌పై తప్పుడు ప్రచారం

- సిఇఒ కార్యాలయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల తేదీలు, షెడ్యూల్ తాము ప్రకటించలేదని, సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తేదీలతో ఇసికి ఎటువంటి సంబంధం లేదని సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఖండిస్తూ.. సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

శాప్‌నెట్ చైర్మన్‌గా వెంకటేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాప్‌నెట్ చైర్మన్‌గా కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన మాచాని వెంకటేష్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖకు సంబంధించి సొసైటీ ఫర్ ఆంధ్రప్రదేశ్ నెట్‌వర్క్‌కు మాచాని వెంకటేష్ ఏడాదిపాటు చైర్మన్‌గా వుంటారని జిఓలో పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

1/2019 సర్క్యులర్ అమలు చేయాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో ఉద్యోగుల భద్రతకు సంబంధించి 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్‌టిసి ఆదేశాలివ్వాలని కోరింది. సోమవారం ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆన్‌లైన్ సభ జరిగింది. ఈ సభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ఆర్‌టిసి డిపోల నుండి ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ఎస్‌కె జిలాని బాషా, సిహెచ్ సుందరయ్య, అయ్యపురెడ్డి మాట్లాడారు. ఆర్‌టిసిలో సర్క్యులర్ ప్రమాణాలు ఉల్లంఘించి రాష్ట్ర వ్యాప్తంగా 152 మంది డ్రైవర్, కండక్టర్లను అక్రమంగా విధుల్లోంచి సస్పెండ్ చేశారని తెలిపారు. అప్పిలేట్‌లో అందరికీ న్యాయం జరగలేదని అన్నారు. సస్పెన్షన్‌లో వున్న ఉద్యోగులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఆర్‌టిసి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని మేనిఫెస్టోలో పెట్టేలా ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె దివాకర్, కట్టా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సవాల్‌పై ఎందుకు స్పందించలేదు?

- టిడిపి నేత బొండా ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాయతీపరుడైతే, రాప్తాడు సభలో చెప్పినవి నిజాలైతే తమ పార్టీ అధినేత చంద్రబాబు సవాల్‌పై ఎందుకు స్పందించలేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదా, మద్యపాన నిషేధం, సిపిఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్, రైతులకు గిట్టుబాటు ధర, బిసిలకు చట్టబద్ధమైన సబ్‌ప్లాన్, కాపు కార్పొరేషన్‌కు ఎక్కువ నిధులు సహా అనేక హామీలపై ప్రజల ముందే జగన్ నోరు విప్పేలా చేస్తామన్నారు. ఐబి విద్యా విధానంతో రాష్ట్ర విద్యారంగాన్ని ఐపి (దివాళా) పెట్టించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమా? అని టిడిపి అధికార ప్రతినిధి విజయ్‌కుమార్ ప్రశ్నించారు. జనవరి 22న ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తర్వాత శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైసిపి నాయకులు 5 వేలకు పైగా ఫామ్-7 దరఖాస్తులు పెట్టారని ఆరోపిస్తూ శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్ ఎన్నికల సంఘానికి ఒక లేఖ రాశారు. దరఖాస్తులు పెట్టిన వారికి ఓటర్ల సమాచారం తెలియదని పేర్కొన్నారు.

యుగ తులసి పార్టీకి రోడ్ రోలర్ గుర్తు కేటాయింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యుగ తులసి పార్టీకి రోడ్‌రోలర్ గుర్తును కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించింది. రానున్న రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎన్నికల కమిషన్ దేశవ్యాప్తంగా తమ పార్టీకి రోడ్ రోలర్ గుర్తును కేటాయించిందని ఆపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కె శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న ఎన్నికల్లో యుగ తులసి పార్టీ రాష్ట్రంలోని 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. తమ పార్టీకి కామన్ గుర్తుగా రోడ్‌రోలర్ రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

గంగవరం పోర్టుకు చేరిన ఐఎన్ఎస్ విక్రమాదిత్య

మిలాన్ రిహార్సల్స్ ప్రారంభం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ వేదికగా సోమవారం నుంచి మిలన్ 2024 వేడుకను తూర్పు నౌకదళం నిర్వహిస్తోంది. ఇవి ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగనున్నాయి. విశాఖ బీచ్ రోడ్డులో నౌకలు ఫుల్ డ్రెస్ పెరేడ్ మెయిన్ ఈవెంట్స్‌లో భాగంగా మంగళవారం కూడా రిహార్సల్స్ జరగనున్నాయి. ఈ నెల 21న నావికా విన్యాసాలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నెల 22న ఆర్‌కె బీచ్‌లో జరగనున్న సిటీ పరేడ్‌కు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హాజరు కానున్నారు. ఆ రోజు బీచ్ రోడ్డులోకి వాహనాలను అనుమతించరు. సుమారు 3,550 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. మిలాన్ 2024కు భారత ఉపరాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్ హాజరవుతున్నారు. విన్యాసాలు చూడడానికి వచ్చే సామాన్య ప్రజలకు ఎంజిఎం గ్రౌండ్, అంకోసా గ్రౌండ్, జూబ్లీ గ్రౌండ్, జిల్లా పరిషత్ ఆవరణలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. బీచ్ రోడ్డులో నివసించే వారు అత్యవసరమైతే బీచ్ రోడ్డులో ప్రయాణించాలి. వారికి పాస్‌లు ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు.

2030లోగా 8 లక్షల కాంక్రీట్ గృహాల నిర్మాణం

తమిళనాడు ఆర్థిక మంత్రి

చెన్నై : 'హట్ ఫ్రీ తమిళనాడు' పథకం కింద 2030 లోగా రాష్ట్రంలో ఎనిమిది లక్షల కాంక్రీట్ గృహాలను నిర్మిస్తామని ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రకటించారు. సోమవారం అసెంబ్లీలో 2024-25 బడ్జెట్‌ను మంత్రి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.3,500 కోట్లతో గ్రామీణ ప్రాంతంలో 'హట్ ఫ్రీ తమిళనాడు' పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేద ప్రజలు కలలు కనే సొంతి ఇంటి కలను ఈ పథకంతో నిజం చేస్తామని చెప్పారు. 'వచ్చే ఏడాదిలోగా తొలి దశ కింద ఒక్కొక్క ఇంటికి రూ.3.50 లక్షల వ్యయంతో లక్ష ఇళ్లను నిర్మిస్తాం' అని తెలిపారు. శాస్త్రీయ సర్వే ద్వారా ఈ పథకం లబ్ధిదారుల్ని ఎంపిక చేస్తామని చెప్పారు. ముధల్వరిన్ గ్రామ సలైగల్ మెంబట్టు తిట్టం పథకాన్ని కూడా ఈ బడ్జెట్‌లో ప్రారంభించారు.

నూతక్కి గ్రామంలో వైద్య శిబిరం

- ప్రజాశక్తి కథనంతో వైద్యాధికారుల్లో కదలిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

విష జ్వరాలతో అల్లాడుతున్న గ్రామస్తులపై ప్రజాశక్తి పత్రికలో కథనం రావడంతో వైద్యాధికారులు స్పందించారు. నెల్లూరు జిల్లా చేజర్ల మండలం, నూతక్కి వారి కండ్రిగ గ్రామంలో చేజర్ల మండలం, చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పరిశరాలు పరిశుభ్రంగా లేకపోవడ వల్ల దోమలు అధిక మవుతాయని వీటి వల్లే ఈ విష జ్వరాలు ప్రబలుతున్నాయని నవీన్ తెలిపారు. గ్రామం లో పారిశుధ్యం మెరుగుపరచాలని గ్రామస్తుల కు తెలిపామన్నారు. 15 రోజులుగా జ్వరాలు విజంభిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. జ్వరాలకు తోడు ఒళ్లు నొప్పులతో అల్లాడిపో తున్నామని వాపోయారు. మందులు వాడిన తగ్గడం లేదని వారు చెప్పారు.

ఏజెన్సీ నిరుద్యోగులకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో న్యాయం చేయండి

సిఎంకు వి. శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో రాష్ట్రంలోని ఏజెన్సీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం 6,100 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసిందని, ఇందులో ఎస్‌టిలకు 1.025 పోస్టులు, 5వ షెడ్యూలు ఏరియాలో 500 పోస్టులు భర్తీచేస్తామని జనరల్ డిఎస్‌సి నిబంధనల్లో పేర్కొన్నారని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడం వల్ల ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో 175 పోస్టులకుగాను ఏడు పోస్టులు, రంపచోడవరంలో, చింతూరు ఏజెన్సీకి 205 పోస్టులకుగాను 10 పోస్టులు ఎస్‌టిలకు, సీతంపేట ఏజెన్సీలో 35 పోస్టులకు ఆరుపోస్టులు మాత్రమే ఎస్‌టిలకు కేటాయించారని పేర్కొన్నారు. అలాగే కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలో 70 పోస్టులకు ఎనిమిది పోస్టులు మాత్రమే ఆదివాసీలకు కేటాయించారని తెలిపారు. . ఏజెన్సీ ప్రాంతానికి 500 టీచర్ పోస్టులు భర్తీ చేస్తామంటూ చివరికి ఆదివాసీ నిరుద్యోగులకు కేవలం 38 పోస్టులు కేటాయించడం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం దీనిని పున:పరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు. నాన్ షెడ్యూలు ఏరియాలో ఎస్‌టిలకు 300 పోస్టులకు కేటాయించిందని, గిరిజన గురుకులం నిబంధనలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం జనరల్ డిఎస్‌సిలో గురుకులం పోస్టులను విలీనం చేసిందని తెలిపారు. గిరిజన గురుకులానికి ఉన్న స్వయం ప్రతిపత్తిని కూడా లెక్కచేయకుండా ఏకపక్షంగా ప్రభుత్వం పిజిటి 58 పోస్టులు, టిజిటి 446 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయడం దారుణమన్నారు. గిరిజన గురుకులంలో జోనల్ వ్యవస్థ ద్వారా ఉద్యోగాలు భర్తీచేస్తారని, కానీ జనరల్ డిఎస్‌సి మాత్రం జిల్లా యూనిట్‌గా నోటిఫికేషన్ జారీచేశారని తెలి పారు. గత 20 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నా రెగ్యులర్ చేయకుండా జనరల్ డిఎస్‌సి ద్వారా స్కూల్ ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులైన ఆదివాసీలను గెంటి వేయొద్దని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తున్న జిఒ నెంబరు మూడును సుప్రీం కోర్టు రద్దు చేయడంపై 2020లో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుండి 17 రివ్యూ పిటీషన్లు దాఖలయ్యా యని తెలిపారు. మరోవైపు ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు ఉద్యోగ రిజర్వేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 5వ షెడ్యూలు క్లాజ్(2) ప్రకారం చట్టబద్ధత కల్పిస్తామని ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్(టిఎసి)లో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజన సంక్షేమశాఖ సిఫార్సు చేసిందని పేర్కొన్నారు. టిఎసి తీర్మానాన్ని కూడా కనీసం గౌరవించలేదని పేర్కొన్నారు., మరోపక్క జనరల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అభద్రతాభావం, ఆందోళన కలిగిస్తోందని తెలిపారు జిఒ నెంబరు మూడు రద్దు చేసిన తరువాత అనేకమార్లు ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిందని, ఏనాడూ 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్‌కు చట్టబద్ధత అంశంపై ప్రస్తావన చేయలేదని తెలిపారు. పునరు ద్ధరణకు కనీసం ఎటువంటి చర్యలకూ ఉపక్రమించక పోవడంతో ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగు తోందని వివరించారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూలు ఏరియాలో ఆదివాసలుకు భద్రత, రక్షణ, పరిపాలన బాధ్యత గూర్చి స్పష్టంగా పేర్కొందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే ఏ ఉత్తర్వులైనా ఐదో షెడ్యూలు క్లాస్(1)(2) ప్రకారం గవర్నర్, టిఎసి అనుమతి తప్పకుండా తీసుకోవాలని, కానీ జనరల్ డిఎస్‌సి నోటిఫికేషన్ జారీపై ఇటువంటి ప్రక్రియను దిక్కరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఆదివాసులకు ప్రత్యేక భాష, సంస్కృతి ఉందని, గిరిజన భాష రాని ఉపాధ్యాయులను ఏజెన్సీలో నియమించడం వల్ల ఆర్టికల్ 29, 32 ఉల్లంఘించినట్లు అవుతుందని, ఇటీవల కాలంలో 1998, 2008లో సుమారు 400 లో 280 ఎస్‌జిటి పోస్టులను పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో మినిమం టైమ్‌స్కేల్ ప్రాతిపాదికన స్థానికేతరులతో ప్రభుత్వం భర్తీ చేయడం వల్ల ఆదివాసీలు ఉద్యోగం పొందుతామనే ఆశ, నమ్మకం కోల్పోయి అసాంఘిక కార్యకలాపాలవైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు.

ప్రభుత్వ చర్యవల్ల ఇప్పటి వరకూ ఉపాధి పొందుతున్న గిరిజన గురుకులంలో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు 504 మంది, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సిఆర్‌టి ఉద్యోగం నిర్వహిస్తున్న 521 మంది ఉద్యోగం కోల్పోయి వారి స్థానంలో గిరిజనేతరులతో ప్రభుత్వం భర్తీ చేస్తోందని తెలిపారు. 1/70 చట్టం ప్రకారం స్థిర నివాసానికి అనుమతులు లేని వారు రెండుశాతం మాత్రమే ఉన్న గిరిజనేతరులకు 95 శాతం పోస్టులు భర్తీ చేయడం, 98 శాతం ఉన్న ఆదివాసుల కోసం ఐదుశాతం పోస్టులు మాత్రమే కేటాయించి భర్తీ చేయడం తగదని తెలిపారు. దీనిపై వెంటనే జనరల్ డిఎస్‌సి నోటిఫికేషన్‌ను పున:పరిశీలించి ఏజెన్సీ ప్రాంతం ఆదివాసీ నిరుద్యోగులకు భద్రత, భరోసా కల్పించి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన నిరుద్యోగులకు న్యాయం చేయడానికి వెంటనే ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని, అందుకు ఆర్డినెన్స్ జారీచేయాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబుతో చర్చకు సిద్ధం: సజ్జల

- సిపిఎస్, మద్యపాన నిషేధం తప్ప అన్నీ చేశాం
- 14 ఏళ్ల అధికారంతో ప్రజలకు ఏమి చేశారో చంద్రబాబు చెప్పాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని చూపి ఓటు అడిగే జగన్‌కు 14 ఏళ్లపాటు అధికారంలో వుండి ప్రజలకు ఏమీ చేయని చంద్రబాబుకు మధ్య తేడా చాలా వుందని, చర్చకు రావాలనే చంద్రబాబు డిమాండ్‌కు తాము సిద్ధమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలు చూసి ఓటు వేయాలని అడుగుతున్నామని తెలిపారు. జగన్‌ను తిట్టడం తప్ప చంద్రబాబుకు, లోకేష్‌కు వేరే అజెండా లేదని విమర్శించారు. సిపిఎస్, మద్యంపై ఇచ్చిన హామీలను తప్ప అన్నీ అమలు చేశామని తెలిపారు. వైసిపి నిర్వహించే సిద్ధం సభలకు జనస్పందన చూస్తే ప్రజల్లో సిఎంపై వున్న ప్రజాధరణ అర్థమవుతుందని తెలిపారు. తమ ప్రభుత్వం రూ.2.55 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు వాస్తవం కాదా? అని నిలదీశారు. చంద్రబాబుది చెత్త పాలన అని పవన్‌కల్యాణ్ గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి వుంటే వలంటీర్ల వ్యవస్థ మంచిది కాదు, మళ్లీ జన్మభూమి కమిటీలు తెస్తానని చెప్పగలరా? అని ప్రశ్నించారు. సిఎం ఆస్తులు ప్రజలకు పంచాలన్న లోకేష్ ప్రకటన హాస్యాస్పదమన్నారు.

విశాఖ ఉత్తర నియోజకవర్గ శంఖారావ సభలో మాట్లాడుతున్న లోకేష్

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై స్పందించరేం?

- నవరత్నాల పేరుతో నవమోసాలు చేశారు
- శంఖారావం సభల్లో నారా లోకేష్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, గాజువాక, సీతమ్మధార, బుచ్చయ్యపేట విలేకరులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విషయంలో సిఎం జగన్ స్పందించడం లేదని, ఉమ్మడి విశాఖలోని ఇతర సమస్యలూ రాష్ట్ర ప్రభుత్వానికి పట్టడం లేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. టిడిపి శంఖారావం సభలు సోమవారం విశాఖ ఉత్తరం, గాజువాక, అనకాపల్లి, చోడవరం నియోజక వర్గాల్లో జరిగాయి. ఆయా చోట్ల పార్టీ కార్యకర్తలనుద్దేశించి లోకేష్ మాట్లాడారు. నవరత్నాల పేరుతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవమోసాలు చేశారని మండిపడ్డారు. వైసిపి పాలనలో అన్ని తరగతుల వారు ఉపాధి కోల్పోయారన్నారు. రాబోయే ఎన్నికల్లో రెక్కలు లేని ఫ్యాన్‌ను చెత్తబుట్టలో వేయాలని ప్రజలను కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన తొమ్మిది హామీల్లో మద్యపాన నిషేధం ఎక్కడైనా అమలైందా? అని ప్రశ్నించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టకుండా పిల్లలను చదివించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొత్తగా ఎకరం భూమికి కూడా వైసిపి ప్రభుత్వం సాగునీరందించలేదని విమర్శించారు. పరిపాలనా రాజధాని పేర విశాఖలో భూ దందాలు చేస్తున్నారని, ఆంధ్ర యూనివర్సిటీలో పిహెచ్‌డి పోస్టులు అమ్ముకుంటున్న విసి ప్రసాదరెడ్డి పేరు రెడ్‌బుక్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చాక విసిపై విచారణ జరిపిస్తామని హెచ్చరించారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ రైతులకు న్యాయం చేస్తామని, ప్రతి ఇంటికీ ఉచితంగా తాగునీటిని కుళాయి ద్వారా సరఫరా చేస్తామని, అనకాపల్లి నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా బాధ్యత తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ ఆంధ్రప్రదేశ్ పరువు తీశారని వ్యాఖ్యానించారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నాయకులు పల్లా శ్రీనివాసరావు, శ్రీభరత్, బుద్ధ నాగజగదీశ్వరరావు, పీలా గోవింద సత్యనారాయణ, దాడి వీరభద్రరావు, జనసేన పార్టీ నాయకులు పంచకర్ల రమేష్‌బాబు, కోన తాతారావు, ఉషాకిరణ్ పాల్గొన్నారు.

నేడు త్రిపుల్‌ఐటి డిఎంను ప్రారంభించనున్న ప్రధాని

- డైరెక్టర్ సోమయాజులు వెల్లడి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (త్రిపుల్‌ఐట డిఎం) విద్యాసంస్థను మంగళవారం భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించనున్నట్లు ఆ విద్యాసంస్థ డైరెక్టర్ సోమయాజులు వెల్లడించారు. సోమవారం త్రిపుల్‌ఐటి డిఎం కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు జగన్నాథ గట్టుపై దాదాపు 151 ఎకరాల్లో నిర్మించిన త్రిపుల్‌ఐటి డిఎం విద్యాసంస్థను ప్రధానమంత్రి ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. రూ.296.12 కోట్ల కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో 16 తరగతి గదులు, 22 ప్రయోగశాలలు, లైబ్రరీ, కంప్యూటర్ సెంటర్, మూడు సెమినార్ హాళ్లు, నాలుగు హాస్టళ్లు, రెండు మెస్ బ్లాక్‌లు, డైరెక్టర్ బంగ్లా, 20 ఫ్యాకల్టీ క్వార్టర్లు, రెండు సబ్‌స్టేషన్లు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మించామన్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లో మొత్తం 907 మంది విద్యార్థులు నాలుగు అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు, ఆరుపోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు, పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లు అభ్యసిస్తున్నారని తెలిపారు. డొమైన్‌ల సవాళ్లను పరిష్కరించడానికి ఫైవ్ జి యూజ్-కేస్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్, డ్రోన్‌లు, రోబోటిక్‌ల ల్యాబ్‌లను కూడా ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసిందన్నారు.

స్థానికురాలి నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్యులు

బర్డ్‌ఫ్లూ నిర్ధారణపై నమూనాల సేకరణ

- కోవూరు, పొదలకూరులో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-పొదలకూరు/కోవూరు

నెల్లూరు జిల్లా కోవూరు, పొదలకూరు మండలాల్లో బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్ధారణ కోసం కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ బృందం సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టింది. పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. పలు నమూనాలను సేకరించింది. స్థానికుల నుంచి సమాచారం సేకరించి, వారి నుంచి రక్త నమూనాలు తీసుకుంది. కేంద్ర బృందంలో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజెస్ కంట్రోల్ నుంచి డాక్టర్ సుస్మిత సింగల్, లేడీ హార్డింగ్ ఆస్పత్రి నుంచి డాక్టర్ గురుమిత్ కౌర్, మౌలానా అజాద్ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ శ్రేయ శర్మ ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశ్వరి, జిల్లా సర్వలెన్స్ వైద్యాధికారి భాస్కర్, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ నరసింహారావు, కిరణ్ రిషిత, శ్రీకావ్య, ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ముస్తాఫా పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జర్నలిస్టుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసిపి కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విలేకరులు నిరసన తెలిపారు. తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఎపిబిజెఎ) ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు వినతిపత్రం అందజేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు షేక్ ఖాజావలి, ఎపిబిజెఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.వి.రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి విశాఖ, అనంతపురం, కడప, ప్రకాశం, కర్నూలు, గుంటూరు, నెల్లూరులో నిరసన తెలిపారు. తిరుపతి, చిత్తూరుల్లో గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమానికి సిపిఎం, సిపిఐ నేతలు సంఘీభావం ప్రకటించారు. పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డి మద్దతు తెలిపారు. ఏలూరులో జిల్లా పోలీస్ కార్యాలయంలోని అదనపు ఎస్‌పి స్వరూపరాణిని కలిసి వినతిపత్రం అందించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో అంబేద్కర్ కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ వినతిపత్రం అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నాలు నిర్వహించారు.

కదంతొక్కిన సిహెచ్‌డబ్ల్యులు

(మొదటిపేజీ తరువాయి)

మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో, కార్యాలయం ఎదుట రోడ్డుపై సిహెచ్‌డబ్ల్యులు బైఠాయించారు. వారి పోరాటానికి మద్దతు తెలిపేందుకు వచ్చిన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావును పోలీసులు అరెస్టు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల చర్యను సిహెచ్‌డబ్ల్యులు తీవ్రంగా నిరసించారు. అధికారులు వచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదంటూ ఆందోళన కొనసాగించారు. చాలాసేపు బైఠాయింపు కొనసాగడంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా వారి వద్దకు వచ్చారు. ఆయనను సిహెచ్ డబ్ల్యులు నిలదీశారు. ఏళ్ల తరబడి తాము పనిచేస్తున్నామని, ఆశాలు చేసే పనులే చేస్తున్నామని, అయినా, తమను ఆశాలుగా ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. పోరాటాలు చేసినప్పుడు అధికారులు హామీలు ఇస్తున్నారు తప్ప, ఆశాలుగా మార్పు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పార్వతి మాట్లాడుతూ ఆశాలతో సమానంగా అన్ని పనులూ చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులను ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదన్నారు. యూనిఫారాలు, మెడికల్ కిట్లు, సెల్‌ఫోన్లు ఇవ్వాలని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి పోరాటానికి ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ మద్దతు తెలిపాయి. పార్వతీ పురం ఐటిడిఎ వద్ద సిహెచ్‌డబ్ల్యులను ఉద్దేశించి శ్రామిక మహిళా సంఘం నాయ కులు వి.ఇందిర, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, సీతం పేటలో ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మనాయుడు మాట్లాడారు. సిహెచ్‌డబ్ల్యు లకు పాత బకాయిలు రూ.81,81,600 తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్‌ఒలకు, ఎపిఒలకు సిహెచ్‌డబ్ల్యులు వినతిపత్రాలు అందజేశారు.

ఎన్‌డిఎ ఎంపిల నియోజకవర్గాల్లో రేపు నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సిసిఎఫ్), నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్)లు రైతు సంఘాలతో ఒప్పందం చేసుకుంటాయని మంత్రులు ప్రతిపాదించారు. పంట సేకరణకు ఎటువంటి పరిమితి విధించేది లేదని, దీని కోసం ఒక పోర్టల్ కూడా అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ చెప్పారు. చర్చల అనంతరం రైతు నేతలు దల్లేవాల్, సర్వన్ సింగ్ పంధేర్ విలేకరులతో మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల్లో తుది ఫలితం రాకపోతే ఈ నెల 21 నుండి 'ఢిల్లీ చలో' కొనసాగుతుందని తెలిపారు. ఎంఎస్‌పితో పాటు ఇతర డిమాండ్లను కూడా ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉందని చెప్పారు.

పారదర్శకత లేదు : ఎస్‌కెఎం

నాలుగో విడతగా ప్రభుత్వం జరిపిన చర్చల్లో ఏమాత్రం పారదర్శకత లేదని ఎస్‌కెఎం విమర్శించింది. కనీస మద్దతు ధరతోపాటు రుణమాఫీ, విద్యుత్ ప్రైవేటీకరణ, సమగ్ర ప్రభుత్వ రంగ పంటల బీమా పథకం, 60 ఏళ్లు పైబడిన రైతులకు నెలవారీ రూ.10 వేల పెన్షన్, లఖింపూర్ ఖేరీ మారణకాండకు ప్రధాన కుట్రదారు కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రాను తొలగించి, ప్రాసిక్యూట్ చేయాలనే డిమాండ్లపై మోడీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో స్పష్టం చేయాలని ఎస్‌కెఎం కేంద్ర మంత్రులను డిమాండ్ చేసింది. ఫిబ్రవరి 21, 22 తేదీల్లో జరగనున్న ఎస్‌కెఎం జనరల్ బాడీ సమావేశం పరిస్థితిని సమీక్షిస్తుందని, అన్ని డిమాండ్లను నెరవేర్చే వరకు పోరాటాన్ని ఉధృతం చేసేందుకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తుందని తెలిపింది.

పెల్లెట్ గన్‌లపై జోక్యం చేసుకోండి : 'సుప్రీం'కు మానవ హక్కుల సంఘాల లేఖ

హర్యానా పోలీసులు, కేంద్ర బలగాలు ఢిల్లీకి మార్చ్ చేస్తున్న రైతులపై పెల్లెట్ గన్‌లను ప్రయోగించకుండా ఆపేలా జోక్యం చేసుకోవాలని మానవ హక్కుల సంఘాలు కోరాయి. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌కు లేఖ రాశాయి. పంజాబ్‌కు చెందిన మానవ హక్కుల సంఘాలు ఖల్రా మిషన్ ఆర్గనైజేషన్ (కెఎంఒ), పంజాబ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (పిహెచ్‌ఆర్‌ఒ), హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్‌లు ఈ లేఖను రాశాయి. పెల్లెట్ గన్‌ల కారణంగా ముగ్గురు రైతులకు చూపు పోయిందని, వారిలో పలువురు పంజాబ్, చండీగఢ్‌లోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని సంఘాల నేతలు తెలిపారు.

బ్యాలెట్లను దిద్దాను

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. జ్యుడీషియల్ అధికారిని నియమించాల్సిందిగా పంజాబ్, హర్యానా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను కోర్టు కోరింది. ఆయనకు భద్రత కల్పించాల్సిందిగా ఆదేశించింది. నామినేట్ చేసిన జ్యుడీషియల్ అధికారిని సురక్షితంగా తీసుకువెళ్లేలా, అలాగే బ్యాలెట్ పత్రాలను భద్రంగా వుంచేలా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాల్సిందిగా బెంచ్ ఆదేశించింది. మంగళవారం నాటి విచారణకు రావాల్సిందిగా ప్రిసైడింగ్ అధికారిని బెంచ్ ఆదేశించింది. ఇలాంటి బేరసారాలు చోటు చేసుకోవడంపై తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు బెంచ్ పేర్కొంది. రిగ్గింగ్ ఆరోపణల నేపథ్యంలో ఆదివారం బిజెపి మేయర్ రాజీనామా చేశారు. కాగా ఒకవేళ రీపోలింగ్‌కు ఆదేశించిన పక్షంలో ఆ అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ముగ్గురు ఆప్ కౌన్సిలర్లు పార్టీలో చేరారు. దీనిపై ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ, సోన్‌కర్ రాజీనామాతో ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని రుజువైందన్నారు.

మా కౌన్సిలర్లను కొనుగోలు చేసి, చీలుస్తున్నారు : కేజ్రీవాల్

బిజెపి ఎన్నికల్లో గెలవలేనప్పుడు, మా కౌన్సిలర్లను కొనుగోలు చేసి, చీలుస్తున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. అంతకుముందు ఆప్ పంజాబ్ ప్రతినిధి మల్విందర్ సింగ్ కాంగ్ మాట్లాడుతూ, బిజెపి చేసిన తప్పులు కెమెరాలో పట్టుబడ్డాయని, సుప్రీంకోర్టు వాటిని గమనించిందని చెప్పారు. ఇప్పుడు ఆప్ కౌన్సిలర్లకు రాత్రికి రాత్రే గాలం వేసిన బిజెపి ఆపరేషన్ లోటస్‌ను అమలు చేసిందని విమర్శించారు. భారత ప్రజాస్వామ్యానికి ఇంతకన్నా పెద్ద అపహాస్యం వుండదని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం పట్ల బిజెపికి గల దాహాన్ని, ఆశను యావత్ ప్రపంచం చూస్తోందని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ అన్నారు.

విఆర్‌ఎలకు సిఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అధికారంలోకి రాగానే విఆర్‌ఎలకు రూ.15 వేలు వేతనం ఇస్తామన్న హామీని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. విఆర్‌ఎల న్యాయమైన పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఎపి విఆర్‌ఎ సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు రెండోరోజు సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. విఆర్‌ఎలకు తెలంగాణలో అమలవుతున్న విధంగా పే స్కేలు వేతనాలు చెల్లించాలని, నామినీలను విఆర్‌ఎలుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి పాలనలో ప్రజలకిచ్చిన వాగ్దానాలు 99 శాతం అమలు చేశామని సిఎం జగన్ రాప్తాడులో జరిగిన 'సిద్ధం సభలో' ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విఆర్‌ఎలకు వేతనం పెంపు, రికవరీ చేసిన డిఎ నగదును తిరిగి చెల్లించడం హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

దేశంలో నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు మూడు, నాలుగు రెట్లు పెరిగాయని, చాలీచాలని వేతనాలతో బతుకుతున్న విఆర్‌ఎలు ఇతర పేదల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సంఘటితంగా పోరాడాలని లక్ష్మణరావు పిలుపునిచ్చారు.

విఆర్‌ఎల రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతూ మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

విఆర్‌ఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. 2024 సాధారణ ఎన్నికల్లోపు విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించకుంటే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవరు పోస్టుల్లో అర్హులైన విఆర్‌ఎలను నియమించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి అంజి మాట్లాడుతూ.. గత నాలుగున్నరేళ్లుగా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించిందన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవరు పోస్టుల్లో అర్హులైన విఆర్‌ఎలను నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందిగి సాహెబ్ మాట్లాడుతూ ప్రమోషన్ సౌకర్యాలను 30 నుంచి 70 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రీ సర్వేల పేరుతో విఆర్‌ఎలపై మోపుతున్న అదనపు భారాన్ని తొలగించాలని టిఎ, డిఎలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. విఆర్‌ఎల డిమాండ్లను ఈ నెల 20వ తేదీలోపు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 7న అధికారులకు, ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. దీక్షలకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి ముత్యాలరావు మద్దతు ప్రకటించారు. దీక్షలో సంఘం నాయకులు రమేష్, అంజిబాబు, ప్రసాద్, మొగలాబి, నాగేంద్ర, నరేష్, రహిమాన్, త్రినాథరావు, రవిబాబు, వెంకట్రాములు, సాంబశివరావు, లక్ష్మణ్, శ్రీనివాసులు, నాగేషు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సాయి శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి

- మరో 30 మందితో కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం

ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులుగా ఎల్.సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎం.రఘునాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. 30 మంది సభ్యులతో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో ఈ నెల 17 ,18న రెండు రోజులపాటు ఎస్‌టియు 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యవర్గ ఎన్నికకు హెచ్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

సాయి శ్రీనివాస్

రఘునాథ్ రెడ్డి

కౌంటర్ దాఖలు చేయండి

- టెట్, టిఆర్‌టి నోటిఫికేషన్లపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

ఎపి టెట్, ఎపి టిఆర్‌ఆర్‌టి నోటిఫికేషన్లను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలపై ప్రభుత్వ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8న ఇచ్చిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఎపి టెట్), 12న ఇచ్చిన టీచర్ రిక్రూట్ టెస్ట్ (ఎపి టిఆర్‌టి) నోటిఫికేషన్‌ను రద్దు చేసి, ఆ రెండు పరీక్షల నిర్వహణకు తాజాగా నోటిఫికేషన్ జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం పెద్దిరాజు సహా ఐదుగురు దాఖలు చేసిన వ్యాజ్యాలను సోమవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ప్రభుత్వం కౌంటర్ వేసేందుకు సమయం కావాలని కోరడంతో న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ అనుమతినిచ్చి విచారణను ఈ నెల 21కి వాయిదా వేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయ అర్హత పరీక్ష, నియామక పరీక్ష నిర్వహణకు ఒకేసారి షెడ్యూల్ ప్రకటించడాన్ని అడ్డుకోవాలని పిటిషనర్ల తరఫున సీనియర్ అడ్వకేట్ బి ఆదినారాయణరావు కోరారు. టెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మాత్రమే టీచర్ రిక్రూట్‌మెంటు టెస్టులో పాల్గొనేందుకు అర్హులన్నారు. టెట్ ఫలితాలను మార్చి 14న ప్రకటిస్తుండగా, ఆ తరువాత రోజే టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ నిర్వహించనున్నారని అన్నారు. టిఆర్‌టికి అభ్యర్థులు సిద్ధమయ్యేందుకు తగిన సమయం లేదన్నారు. ఈ నెల 27న పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించారన్నారు. పరీక్షకు సిద్ధమయ్యేందుకు అభ్యర్థులకు కేవలం 19 రోజుల సమయం మాత్రమే ఉందని, హడావుడిగా ప్రక్రియ పూర్తి చేయడం వల్ల అభ్యర్థులు నష్టపోతారని చెప్పారు.

తిరుమల శ్రీవారి 'మే' నెల టికెట్లు విడుదల

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల మే నెల కోటాను సోమవారం టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. బుధవారం పది గంటల వరకు సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చునని టిటిడి అధికారులు తెలిపారు. లక్కీడిప్ పొందినవారు అదే రోజు మధ్యాహ్నం 12 గంటలలోపు రుసుము చెల్లించి టికెట్లు ఖరారు చేసుకోవాలని వెల్లడించారు. ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, వర్చువల్ సేవా టికెట్ల కోటాను 22వ తేదీ ఉదయం పది గంటలకు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లు మధ్యాహ్నం మూడు గంటలకు, అంగప్రదక్షిణ టోకెన్ల కోటా 23న ఉదయం పది గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్‌లైన్ కోటాను ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపారు. మే నెల ప్రత్యేక ప్రవేశ దర్శన రూ.300 టికెట్లు కోటాను 24న విడుదల చేయనున్నారు.

శ్రీవారిసేవలో నటి శ్రీలీల

తిరుమల శ్రీవారిని నటి శ్రీలీల కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సందర్శించారు. ఆలయం వద్దకు చేరుకున్న శ్రీలీలకు టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీలీలతో సెల్ఫీలు తీసుకునేందుకు సందర్శకులు గుమిగూడారు.

ఎపిఐఐసి చైర్మన్‌గా 'జంకె' బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

ఎపిఐఐసి చైర్మన్‌గా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. మార్కాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే సీటు అవకాశం లేకపోవడంతో ఆయనకు ఈ పదవి ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది. బాధ్యతలు చేపట్టిన వెంకటరెడ్డికి గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు, మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, డాక్టర్ షేక్ మక్బుల్‌బాష, పిఎల్‌పి యాదవ్, మందటి మహేశ్వరరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ఆహారం కలుషితం

- 42 మంది విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి (ఏలూరు)

కలుషిత ఆహారం తిని 42 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లిలో సోమవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహంలో మొత్తం 314 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 42 మంది విద్యార్థులకు సోమవారం తెల్లవారుజాము నుంచి రెండు నుంచి మూడు సార్లు విరేచనాలు, వాంతులు కావడంతో వార్డెన్ నవీన్ అప్రమత్తమై స్థానిక పిహెచ్‌సికి సమాచారం అందించారు. పిహెచ్‌సి వైద్యాధికారి గాయత్రి అధ్వర్యంలో వసతి గృహంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఇద్దరు విద్యార్థులు గౌతమ్, హరికృష్ణలను మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జంగారెడ్డి గూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు విద్యార్థులు రామ్‌కుమార్, విష్ణు జ్వరంతో బాధపడుతుండడంతో వారిని జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించి చికిత్స అందించారు. మిగిలిన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్య సిబ్బంది తెలిపారు. కలుషిత ఆహారం తినడం కారణంగానే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఐటిడిఎ ఎపిఒ పివిఎస్ నాయుడు, డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను, తాగునీటిని పరిశీలించారు. వారి వెంట తహశీల్దార్ ఆర్‌వి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ కెఎం మంగతాయారు, ఎంఇఒలు కె శ్రీనివాస్, బుచ్చయ్య, ఎటిడబ్ల్యుఒ కృష్ణమోహన్, సిహెచ్ఒ శ్రీనివాసరాజు ఉన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ ఎపిఒ, డిప్యూటీ డిఎంహెచ్ఒ

ఫ్యాన్‌ను విసిరేసేందుకు జనం సిద్ధం

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రెక్కలు ఊడిపోయిన ఫ్యాన్‌ను విసిరిపారేయడానికి జనం సిద్ధంగా ఉన్నారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ప్రతిపక్షనేతగా ఇచ్చిన హామీల వీడియో విడుదల చేసి, వీటిపై చర్చకు సిద్ధమా అంటూ సోమవారం ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొన్నారు. జగన్‌కు, ఆయన ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఇంకా 50 రోజులే ఉందని తెలిపారు. 'సామాజిక న్యాయానికి నిలువునా శిలువ వేసి, బాదుడు పాలనతో ప్రజల రక్తం పీల్చేసి, విధ్వంస పోకడలతో రాష్ట్ర భవిష్యత్తును కూల్చేసి, ఇప్పుడు ర్యాంప్ వాక్ చేసి అబద్ధాలు చెబితే ప్రజలెలా నమ్ముతారు' అని జగన్‌ను ప్రశ్నించారు. బూటకపు ప్రసంగాలు కాదని, అభివృద్ధి పాలన ఎవరిదో, విధ్వంసం ఎవరిదో జనం ముందు చర్చిద్దామని పేర్కొన్నారు. దమ్ముంటే తనతో బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాల్ విసిరారు. ప్రాంతం, సమయం చెబితే ఎక్కడికైనా వస్తానని, దేనిమీదైనా చర్చించేందుకు సిద్ధమా? అని జగన్‌ను ప్రశ్నించారు.

వైద్యంపై అధిక ఖర్చు

- ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఆరోగ్యం కోసం దేశ ప్రజలు తమ జేబులో నుంచి 48.8 శాతం ఖర్చు చేస్తుండగా ఎపిలో ఇది 67.2గా ఉందని, ఇది దేశ సగటు కన్నా అధికమని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు తెలిపారు. సోమవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఆరోగ్య వేదిక, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్రంలో పలుచోట్ల ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించామని, దానికి సంబంధించిన నివేదికను విడుదల చేస్తున్నామని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన తరుణంలో ఆరోగ్యంపై అధిక ఖర్చు చేయాల్సి రావడంతో ప్రజలపై మరింత భారమవుతోంని చెప్పారు. పౌష్టికాహారం తీసుకోవడానికి ఈ ఖర్చు అడ్డుగా మారుతోందని, తద్వారా రోగుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అధిగమించాలి అంటే ఆరోగ్యాన్ని ఒక హక్కుగా పరిగణించాలని, ప్రభుత్వ వైద్యాన్ని మరింత బలోపేతం చేయాలని, ఇందుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేసి, ఆరోగ్య కేంద్రాల్లో పర్మినెంట్ ప్రాతిపదికగా ఉద్యోగ నియామకాలు జరపాలని కోరారు ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ నాయకులు కెవిపి.చంద్రమౌళి మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ మందుల కంపెనీలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. పౌష్టికాహారంపై అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజా ఆరోగ్య వేదిక సభ్యులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి రాజకీయ పార్టీ ప్రజల ఆరోగ్య అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టాలని కోరారు.

సర్వే వివరాలు వెల్లడిస్తున్న కామేశ్వరరావు

వలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత ఏదీ?

- 1,04,836 మంది డేటా అప్‌లోడ్ కాలేదు : నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

వలంటీర్ వ్యవస్థకు చట్టబద్దతే లేదని, ఆ వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేస్తోందని జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. తెనాలి బోస్ రోడ్డులోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి తిరిగి ప్రజల వ్యక్తిగత డేటా సేకరిస్తున్న వలంటీర్‌ను ప్రభుత్వ పరంగా ఎవరు అనుమతించారు? వారు సేకరిస్తున్న డేటాను ఎక్కడ భద్రపరుస్తున్నారు? వలంటీర్ వ్యవస్థను పర్యవేక్షించే అధికారం ఎవరిదని ప్రశ్నించారు. దీనిపై ప్రశ్నించినందుకే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై కేసులు నమోదు చేశారని, ఆ కేసులకు భయపడేది లేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ అవినీతిపై కచ్చితంగా దర్యాప్తు చేయిస్తామని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, బండారు రవికాంత్, ఇస్మాయిల్ భేగ్, దివ్వెల మధుబాబు, జాకీర్ పాల్గొన్నారు.

సిబిఐ అధికార దుర్వినియోగం

- కొచ్చర్ దంపతుల అరెస్ట్‌పై బాంబే హైకోర్టు

ముంబయి : ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌లను సిబిఐ అరెస్ట్ చేసిన తీరును బాంబే హైకోర్టు తప్పుబట్టింది. 2022 డిసెంబర్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) వారిద్దరినీ అరెస్టు చేయడం అధికార దుర్వినియోగంగా అభివర్ణించింది. ఇది బుద్ధిలేని చర్యగా పేర్కొంది. కొచ్చర్ దంపతుల అరెస్టు చట్ట విరుద్ధమని జస్టిస్ అనుజా ప్రభుదేశాయ్, జస్టిస్ ఎన్ఆర్ బోర్కర్ డివిజన్ బెంచ్ 2024 ఫిబ్రవరి 6న పేర్కొంది. జనవరి 2023లో మరొక బెంచ్ వారికి బెయిల్ మంజూరు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. సోమవారం అందుబాటులోకి వచ్చిన ఈ ఉత్తర్వుల ప్రకారం.. అరెస్టు నిర్ణయం తీసుకున్న దాని ఆధారంగా సిబిఐ పరిస్థితులు లేదా ఆధారాల ఉనికిని చూపించ లేకపోయాయని కోర్టు తెలిపింది. చట్టం పట్ల సరైన గౌరవం లేకుండా, చర్చ లేకుండా ఇటువంటి సాధారణ అరెస్టులు అధికార దుర్వినియోగమని న్యాయమూర్తులు అన్నారు. కొచ్చర్ దర్యాప్తులో సహకరించనందున అరెస్టులు చేయాల్సి వచ్చిందని సిబిఐ చేసిన విజ్ఞప్తిని అంగీకరించడానికి కోర్టు నిరాకరించింది. విచారణ సమయంలో మౌనంగా ఉండే హక్కు నిందితులకు ఉందని అన్నారు. వీడియోకాన్-ఐసిఐసిఐ బ్యాంక్ మోసం కేసులో 2022 డిసెంబర్ 23న కొచ్చర్ దంపతులను సిబిఐ అరెస్ట్ చేసింది. అరెస్టును సవాలు చేస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు. 2023 జనవరి 9న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ కొచ్చర్ దంపతులకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాగా.. 2009-2018 కాలంలో ఐసిఐసిఐ బ్యాంక్ ఎండిగా ఉన్న చందా కొచ్చర్ తన అధికారాన్ని ఉపయోగించి నిబంధనలకు విరుద్ధంగా వీడియోకాన్ అధిపతి వేణుగోపాల్ దూత్‌కు రూ.3,250 కోట్ల రుణాలు ఇచ్చారాని ప్రధాన అరోపణ. దూత్‌కు అప్పు ఇప్పించినందుకు గాను భర్త దీపక్ కొచ్చర్‌కు చెందిన నుపూర్ రెన్యూవెబుల్ లిమిటెడ్‌లో దూత్ పెట్టుబడులు పెట్టారు. ఇది బయటికి రావడంతో సిబిఐ రంగంలోకి దిగి కొచ్చర్ దంపతులను అరెస్ట్ చేశారు. ఆ వెంటనే చందా కొచ్చర్ ఉద్యోగం ఊడటం, బ్యాంక్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. క్విడ్‌ప్రోకోకు పాల్పడిన వారికి శిక్ష పడకపోగా.. తాజా కోర్టు ఉత్తర్వులు విమర్శలకు దారి తీస్తుంది.

ఆస్ట్రేలియా లిథియం గనులపై కోల్ ఇండియా దృష్టి

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాలోని లిథియం గనులపై దృష్టి పెట్టామని ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పిఎం ప్రసాద్ తెలిపారు. ఇందుకోసం ఆ దేశంతో ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తాము 780 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరనున్నామన్నారు. ఈ నెల చివరి వారంలో భారత గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించనున్నట్లు పలు మినరల్ గనుల వేలంలో కోల్ ఇండియా మూడు బిడ్డింగ్‌లు వేయనుందన్నారు. ఆస్ట్రేలియాలోని లిథియం, నికెల్ మైన్లను పొందడానికి ఫిబ్రవరి 26న జరగనున్న బిడ్డింగ్‌లో పాల్గొననున్నట్లు సమాచారం.

డివిపితో ఎల్గీ ఎక్విప్‌మెంట్ ఒప్పందం

న్యూఢిల్లీ : ప్రపంచంలోని ప్రముఖ ఎయిర్ కంప్రెసర్ తయారీదారులలో ఒకటైన ఇటలీకి చెందిన డివిపి వాక్యూమ్ టెక్నాలజీ ఎస్‌పిఎతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎల్గీ ఈక్విప్‌మెంట్ తెలిపింది. ఇందులో భాగంగా భారత్‌లో డివిపికి చెందిన యాజమాన్య వాక్యూమ్ ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు పేర్కొంది. అదే విధంగా ఆ సంస్థ ఉత్పత్తులను పరీక్షించడం, విక్రయించడం కూడా చేయనున్నట్లు ఎల్గీ పేర్కొంది.

మ్యాక్స్ 500 స్టోర్లకు చేరిక

పూణె : ప్రముఖ ఫ్యాషన్ ఉత్పత్తుల రిటైలర్ మ్యాక్స్ భారత్‌లో 500 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. ఈ స్టోర్‌ను పూణెలో తెరవడంతో నూతన మైలురాయికి చేరినట్లు పేర్కొంది. భారత్‌లో తాము 2006లో ప్రస్థానాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. నాలుగు కోట్ల కుటుంబాలను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మ్యాక్స్ ఫ్యాషన్ ప్రెసిడెంట్, డిప్యూటీ సిఇఒ సుమిత్ చంద్నా పేర్కొన్నారు. ఈ ఏడాది కొత్తగా 50 పైగా స్టోర్లను తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

పాక్ జిడిపిని మించిన టాటా గ్రూపు

- రూ.30 లక్షల కోట్లకు మార్కెట్ విలువ

న్యూఢిల్లీ : ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ రంగాల్లో రారాజుగా ఉన్న టాటా గ్రూప్ కంపెనీల మార్కెట్ విలువ పాకిస్తాన్ జిడిపిని మించిపోయింది. గడిచిన ఏడాది కాలంలో టాటా గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో భారీగా రాబడిని ఆర్జించాయి. దాంతో టాటా గ్రూప్ ఉమ్మడి మార్కెట్ విలువ 365 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.30లక్షల కోట్లు)గా నమోదయ్యింది. ఇది పాక్ ఆర్థిక వ్యవస్థ కంటే ఎక్కువ. పాక్‌లో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ అస్థిరత, రుణ సంక్షోభం, ద్రవ్యోల్బణంతో ఒత్తిడిలో ఉంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనాల ప్రకారం.. పాక్ జిడిపి 341 బిలియన్ డాలర్లుగా ఉంది. టాటా గ్రూప్‌నకు చెందిన అన్ని లిస్టెడ్ కంపెనీల్లో ఒక్క టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) మార్కెట్ విలువనే 170 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.15 లక్షల కోట్లు)గా ఉంది. టాటా గ్రూప్ కంపెనీలన్నీ మొత్తం గ్రూప్ మార్కెట్ విలువ పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. టాటా మోటార్స్ షేర్లు కేవలం ఏడాది సమయంలోనే 110శాతం పెరిగాయి. టాటా టెక్నాలజీస్, టిఆర్‌ఎఫ్, బెనారస్ హోటల్స్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, టాటా మోటార్స్, ఆటోమొబైల్ కార్పొరేషన్ ఆఫ్ గోవా, ఆర్ట్‌సన్ ఇంజినీరింగ్ తదితర షేర్లు మంచి వృద్ధిని నమోదు చేశాయి. టాటా గ్రూపులోని 25 కంపెనీలు స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌లో ఉన్నాయి.

వైసిపికి మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి గుడ్‌బై

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తనకు, తన సోదరుడు తాడిశెట్టి మురళికి వైసిపిలో తగిన గుర్తింపులేనందున ఆ పార్టీ నుంచి తప్పుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు తెలిపారు. సోమవారం స్థానిక శుభం కల్యాణ మండపంలో తమ అనుచరులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీతో సంబంధం లేనివారికి, కొంతమంది పార్టీ నాయకుల అనుచరులకు నామినేటెడ్ పదవులు ఇచ్చారని, పార్టీ కోసం పనిచేస్తున్న వారికి గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటి వరకు తమను ఏ రాజకీయపార్టీ సంప్రదించలేదని, తాము ఏ పార్టీలో చేరేది పది రోజుల్లో వెల్లడిస్తామని తెలిపారు. కొన్ని కారణాల వల్ల ప్రత్యక్ష రాజకీయాలకు కొంతకాలంగా దూరంగా ఉన్నానని, తన సోదరుడు మురళీ వైసిపిలో చురుగ్గా పనిచేసినా అధిష్టానం పట్టించుకోలేదని అన్నారు. తాను మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని, గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వ్యవ'సాయం' చేయని కేంద్రం

- రాష్ట్రానికి రావాల్సింది రూ.400 కోట్లకుపైనే
- పశు సంవర్ధకశాఖకు మరో రూ.100 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధులపై కోతలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా అత్యంత కీలకమైన వ్యవసాయం, పశుసంవర్ధకశాఖలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు భారీగా పెండింగులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నిధులను రాబట్టుకునేందుకు గానూ ఆయా శాఖల అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఈ నిధులను త్వరగా సాధించుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. దాదాపు రూ.500 కోట్ల వరకు కేంద్రం నుంచి రావాల్సి ఉంటుందని చెబుతున్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ సబ్‌మిషన్ కింద రూ.69 కోట్ల వరకు రావాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే ఆయిల్‌పామ్ జాతీయ మిషన్, ఉద్యానవన మిషన్ కింద రూ.130 కోట్ల వరకు, ప్రతిచుక్కకూ మరింత పంట పథకం కింద రూ.124 కోట్లు వరకు రావాల్సి ఉంటుందని లెక్కలు తేల్చారు. ఈ నిధులు రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం, కృషి ఉన్నతి యోజన కింద రాష్ట్రానికి రావాల్సి ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే పశు సంవర్ధకశాఖ, మత్స్యశాఖల్లో అమలు చేయాల్సిన పథకాల కోసం మరో రూ.109 కోట్లు రావాల్సి ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పశువుల ఆస్పత్రుల అభివృద్ధి వంటి అంశాలకు రూ.30 కోట్ల వరకు రావాల్సి ఉండగా, జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ కింద వంద కోట్ల వరకు రావాల్సి ఉంది. ఈ నిధులను తక్షణమే సాధించుకోకపోతే అవి మురిగిపోయే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ నిధులపై పలు దఫాలుగా కేంద్రానికి రాష్ట్ర అధికారులు లేఖలు రాసినట్లు సమాచారం. అయినప్పటికీ కేంద్రం నుంచి నిధుల విడుదల లేకపోవడం, వార్షికాంతం దగ్గర పడుతుండటంతో రాష్ట్ర అధికారులు మరోసారి కేంద్రానికి లేఖ రాయాలని, అవసరమైతే ఢిల్లీకి వెళ్లాలని యోచిస్తున్నారు. ఇదే సమయంలో గతంలో కేంద్రం నుంచి వచ్చిన నిధులను ఆయా పథకాలకు సంబంధించిన సింగిల్ నోడల్ ఏజెన్సీ ఖాతాలకు బదలాయించడంలో రాష్ట్ర అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల సమస్యలు పెరుగుతున్నట్లు తెలిసింది.

SRIKAKULAM MUNICIPAL CORPORATION

1. One Work under 15th FC Grants -Esst.Amount. Rs.58.00 Lakhs
2. One Work under NCAP Funds -Esst.Amount. Rs.44.00 Lakhs

Download Start Date & time	17-02-2024 02.00 PM
Download end Date & time	24-02-2024 02.00 PM
Bid Submission closing Date & time	24-02-2024 04.30 PM

visit :
www.tender.apeprocurement.gov.in
Contact No.9849906968

Sd/- Commissioner.,
Srikakulam Municipal corporation

సంపాదకీయం

మోడీ ప్రభుత్వ వంచన

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బిజెపి ఏలుబడిలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా వెలువడ్డ లక్నో ఐఐఎం నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. జాతీయ శాంపిల్ సర్వే, ఉద్యోగ - నిరుద్యోగ సర్వే, పీరియాడిక్ లేబర్ నివేదికల గణాంకాలను మథించి, ఉద్యోగ కల్పనలో మోడీ ప్రభుత్వం చేతులెత్తేసిన వైనాన్ని ఈ పరిశోధన తేటతెల్లం చేసింది. దేశంలో 1987 నుంచి 2005 వరకూ ఎంతోకొంత ఉద్యోగ కల్పన ఉందని, ఆ తరువాత తిరోగమనం మొదలైందని ఈ నివేదిక పేర్కొంది. ఈ రిపోర్టు లెక్కల ప్రకారం... 2021 నాటికి దేశంలో 55.61 కోట్ల మంది ఉద్యోగులు ఉండగా, అందులో 30 కోట్ల 52 లక్షల మంది (54.9 శాతం) - అంటే సగానికి పైగా తమకు తాము సొంతంగా బతుకు తెరువు వెతుక్కున్న వారే! వ్యాపారం చేస్తున్నవారు, చిన్నదో పెద్దదో స్వయం ఉపాధి ఉన్నవారూ ఈ ఉద్యోగ లెక్కల్లో ఉన్నారు. మిగతా వారిలో 12. 67 కోట్ల (22.8 శాతం) మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. మిగతా 12.5 కోట్ల మందీ (22.3 శాతం) ఏ భద్రతా లేని క్యాజువల్ ఉద్యోగులు! దేశంలో ప్రతిఏటా పట్టభద్రులు పెరుగుతున్నా అందుకు తగ్గట్టు ఉద్యోగ కల్పన జరగలేదని, పైగా అది నానాటికీ తీసికట్టుగా తయారవుతుందని ఈ నివేదిక పేర్కొంది.

ఈ తాజా అధ్యయనం ఒక్కటే కాదు; గత కొన్నేళ్లుగా దేశంలో ఏ గణాంక సంస్థ సర్వే చూసినా పాలకుల 'అభివృద్ధి' కబుర్లలోని డొల్లతనం బట్టబయలు అవుతుంది. ఉద్యోగం అంటే ఒక కుటుంబానికి శాశ్వతమైన భరోసా. పౌరుల యొక్క, తద్వారా దేశం యొక్క స్థిరమైన భవిష్యత్తుకు బాసట. కానీ, ఉదార ఆర్థిక విధానాలు ముమ్మరంగా అమలవ్వటం మొదలయ్యాక ఈ నమ్మకానికి గండి పడింది. కార్పొరేట్లకు మాత్రమే సూపర్ లాభాలను గ్యారంటీ చేసి, కోట్లాది మంది సామాన్యులూ అరకొర వేతనాలతో, భద్రత లేని కొలువులతో దినదిన గండంగా బతుకునీడ్చే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వరంగంలోనూ, ప్రయివేటురంగంలోనూ తీవ్రమైన ఉద్యోగ అభద్రత నెలకొంది. పాలకులు పెద్ద పెద్ద కార్పొరేట్ల కంపెనీలకు వేల కోట్ల రాయితీలను కట్టబెట్టి, స్థానికంగా ఎక్కువ ఉపాధిని కల్పించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఎండగట్టారు. పేరుకు మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా అంటూ అట్టహాసం చేసినప్పటికీ- గత నలభై ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగింది. 20 - 34 ఏళ్ల వయసు గల యువతలో నిరుద్యోగిత పెరగటంపై నెల క్రితం వెల్లడైన సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) నివేదిక కూడా ఆందోళన వ్యక్తం చేసింది.

2019తో పోలిస్తే మన జిడిపి 2023 నాటికి 16 శాతం పెరిగింది. కానీ, ఆ మేరకు ఉద్యోగ కల్పన పెరగలేదు. సంపద కొంతమంది దగ్గరే పోగు పడుతూ ఉండడం వల్ల, అన్ని రంగాల్లోనూ గుత్తాధిపత్యం చోటు చేసుకుంటూ ఉండడం వల్లా- దేశం ఎదుర్కొంటున్న వైపరీత్యం ఇది. ఒకపక్క ఆర్థిక వృద్ధి కనపడుతున్నా, మరోపక్క అది ఉద్యోగ సృష్టికి దోహదపడకపోవడం ఈ ఉదార ఆర్థిక విధానాల తాత్పర్యం. ఉద్యోగ కల్పన పేరుతో బడా పెట్టుబడిదారులకు బిజెపి ప్రభుత్వం అనేక రాయితీలూ, ప్రోత్సాహకాలూ కల్పిస్తోంది. కానీ, ఆ మేరకు వారు ఉపాధి అవకాశాలను సృష్టించటం లేదు. ప్రభుత్వం వివిధ రంగాల్లో ఖాళీగా ఉన్న లక్షలాది పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, ఆ పనికి ఎప్పుడో తిలోదకాలు ఇచ్చేసింది. పైగా వేలాదిమందికి ఉద్యోగ భద్రతను కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను నీరుగార్చటం, కార్పొరేట్లకు కట్టబెట్టటం వంటి దుర్మార్గ చర్యలకు పాల్పడుతోంది. ఉన్న ఉద్యోగాలకు దారుణంగా కోత పెడుతోంది. ఈ వాస్తవాలను ప్రజలూ, నిరుద్యోగ యువతీ యువకులూ గ్రహించకుండా అయోధ్య, ఎన్ఆర్సి, ఉమ్మడి పౌరస్మృతి అంటూ మతతత్వ ఉద్వేగ రాజకీయాలను నడుపుతోంది. గ్రామీణ భారతంలో పనిదినాలను కల్పించే ఉపాధి హామీ చట్టాన్ని కూడా నానాటికీ నిర్వీర్యం చేస్తోంది. ప్రజలకు స్థిరమైన ఉద్యోగ ఉపాధులు సమకూరినప్పుడే కొనుగోలు శక్తి పెరుగుతుంది. కానీ, మోడీ ప్రభుత్వం ఆ దిశగా ఒక్క అడుగూ వేయకుండానే యువతను వంచిస్తోంది. ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని ప్రజలు ఎంత త్వరగా వదిలించుకుంటే దేశానికి అంత మంచిది.

మహనీయుల మాట



రైతు పంటకు ఎరువు వేసి, నీరు పెట్టి ఊరుకోడు. ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు తీసేస్తాడు. కలుపు తీయని యెడల మంచి పంట రాదని అతనికి తెలుసు. అలాగే మానవ సమాజంలో మంచిని ప్రోత్సహించినంత మాత్రాన చాలదు. చెడు నిరోధించాలి.

- గాంధీజీ

mkgandhi

ఆటవిక దశ వైపుగా పతనం

ఫాసిస్టు ప్రమాదం గురించి 1915లో రోజా లక్సెంబర్గ్ హెచ్చరించినప్పుడు ఏవిధంగా సోషల్ డెమోక్రాట్లు పట్టించుకోకుండా తమ దేశాల పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు సహకరించాయో, ఇప్పుడూ అదే చేస్తున్నారు. ఒకపక్క ఆ పెట్టుబడిదారీ దేశాలతో సహా ప్రపంచవ్యాప్తంగా సామాన్య ప్రజానీకం రోడ్లమీదకు వచ్చి ఇజ్రాయిల్ దురాగతాలను ఖండిస్తున్నాయి. కాని ఆ పెట్టుబడిదారీ దేశాల్లో వివిధ రాజకీయ పార్టీలు-అటు పచ్చి మితవాద పార్టీల నుండి ఇటు సోషల్ డెమోక్రాట్ల వరకూ, గ్రీన్స్ పార్టీతో సహా, సోషల్ డెమోక్రాట్లలోని వామపక్షవాద పార్టీలతో సహా (ఉదా: జర్మనీలోని డై లింక్ పార్టీ) సామ్రాజ్యవాదం వెనుక బారులు తీరాయి. ఇజ్రాయిల్‌ని, దాని సెట్లర్ వలసవాదాన్ని సమర్థిస్తున్నాయి.

ప్రభాత్ పట్నాయక్

రోజా లక్సెంబర్గ్ 1915లో జైలు నుండి 'ది జునియస్ పాంప్లెట్' అన్న రచన చేశారు. అందులో మానవాళి ముందు ఎంచుకోడానికి రెండే రెండు దారులు ఉన్నాయని, ఒకటి సోషలిజం వైపుకు, రెండవది ఆటవిక దశ వైపుకు తీసుకుపోతుందని అన్నారు. దీనిని ఉదారవాద బూర్జువాలు అంగీకరించరు. ఆటవిక దశ రెండు ప్రపంచ యుద్ధాలలో వ్యక్తమైందని, ఆ రెండు యుద్ధాలకు, పెట్టుబడిదారీ విధానానికి సంబంధం లేదని వారంటూరు. ఆ కాలంలో బూర్జువా ఉదారవాదమే బలంగా ముందుకొచ్చి ఆ కాలపు ఆటవికతను ఎదిరించి పోరాడిందని అంటారు. మానవ విలువలను అంతకు మునుపెన్నడూ చేరుకోనంత అత్యున్నత విలువలకు చేర్చింది పెట్టుబడిదారీ విధానమేనని వారు బలంగా చెప్తారు. దానికి యుద్ధానంతర కాలపు పరిణామాలే ఉదాహరణలు అని అంటారు.

పెట్టుబడిదారీ విధానంలో మానవత్వ విలువలు ముందుండడం అని చెప్పడం అంటే, అది మన ముందు దర్శనమిచ్చే సామ్రాజ్యవాదం అన్నదానిని గుర్తించకపోవడమే. భారతదేశంలో బ్రిటిష్ పాలనలో రుద్దిన కరువుల గురించి అందరికీ తెలిసినదే. బ్రిటిష్ వలస పాలన 1770లో బెంగాల్‌లో తలెత్తిన కరువుతో మొదలైంది. అందులో ఒక కోటి మంది మరణించారు. ఆనాటికి బెంగాల్ ప్రావిన్స్‌లో ఉన్న మొత్తం జనాభా 3 కోట్లు. వారిలో మూడవ వంతు మరణించారు. భూములపై బ్రిటిష్ వారు వసూలు చేసిన పన్నుల భారం అంత ఎక్కువగా ఉండింది. ఈ బ్రిటిష్ పాలన ముగుస్తుంద నగా 1943లో మళ్ళీ కరువు వచ్చింది. ఈ కరువుకు కారణం యుద్ధ ఖర్చుల నిమిత్తం బ్రిటిష్ ప్రభుత్వం మన మీద మోపిన అదనపు భారాలు. ఈ కరువులో ఇంకో 30 లక్షల మంది మరణించారు. ప్రస్తుతం నమీబియాగా పిలువబడుతున్న ఆఫ్రికన్ ప్రాంతంలో ఆనాటి జర్మన్ల పాలన సాగింది. పెద్ద సంఖ్యలో స్థానిక గిరిజన తెగల ప్రజలను నిర్బంధించి అంతం చేయడానికి అక్కడ డెత్ క్యాంప్‌లు నిర్మించారు. ఆ నమూనాయే తర్వాత 1930 దశకంలో హిట్లర్‌కు కాన్‌సెంట్రేషన్ క్యాంప్‌లు నిర్మించడానికి ప్రేరణ అయింది. కాంగోలో బెల్జియన్ ప్రభుత్వం లియోపాల్డ్ నేతృత్వంలో మానవులను ముక్కలు ముక్కలుగా నరికి చంపిన క్రూరాతి క్రూరమైన ఉదంతాలు ప్రపంచానికంతటికీ తెలిసినవే. యూరోపియన్ దేశాల నుండి ఉష్ణ మండల దేశాలకు వలసలు వచ్చినవారు అక్కడ ఉండే స్థానిక ప్రజానీకాన్ని మూకుమ్మడిగా భారీ స్థాయిలో నిర్మూలించడం, తక్కినవారిని కొద్దిపాటి భూభాగాలకు పరిమితం చేయడం, వారి భూములను, నివాసాలను స్వాధీనం చేసుకోవడం కూడా అందరికీ తెలుసు. ఈ మాదిరి క్రూర సంఘటనలు ఇంకా చాలా చెప్పుకోవచ్చు. ఇక్కడ ముఖ్యమైనది ఏమిటంటే, ఆ క్రూరత్వానికి ప్రేరణ కేవలం సంపదను చేజిక్కించుకోవాలన్న ఆకాంక్ష మాత్రమే. ఇది పెట్టుబడిదారీ విధానపు ముఖ్య స్వభావం.

యుద్ధాలు, ఆక్రమణలు, కొల్లగొట్టడాలు పెట్టుబడిదారీ విధానం రాకముందు నుంచీ ఉన్నవే కదా, కాబట్టి వాటిని పెట్టుబడిదారీ విధానంతో ముడిపెట్టడం ఎందుకు? అని కొందరు వాదిస్తారు. అంతకు మునుపు జరిగిన కొల్లగొట్టడాలలో, దాడులలో, బాధితుల వద్ద ఇంకా ఎంతో కొంత మిగిల్చారు. లేదా, ఆ బాధితులు మళ్ళీ కోలుకునేందుకు అవకాశాలు ఉండేవి (అలా కోలుకున్న తర్వాత మళ్ళీ దాడులు జరిగేవి). కాని పెట్టుబడిదారీ విధానంలో దోపిడీకి గురైనవారి నుండి సమస్తమూ శాశ్వతంగా లాక్కున్నారు.

రెండు ప్రపంచ యుద్ధాల తర్వాత కాలంలో పెట్టుబడిదారీ విధానం తానెంతో మానవత్వం కలిగిన వ్యవస్థగా చూపించుకొనేందుకు ప్రయత్నించింది. ఆటవికతను ఎదిరించి పోరాడేది తానేనని చెప్పుకోడానికి పూనుకుంది. తమ హాలీవుడ్ చిత్రాల ద్వారా రెండో ప్రపంచ యుద్ధం పశ్చిమ దేశాల ప్రజాస్వామ్యానికి, ఫాసిజానికి మధ్య జరిగినట్టు చిత్రించింది. ఫాసిజాన్ని ఓడించడంలో, ఆ యుద్ధాన్ని ముగించడంలో సోవియట్ యూనియన్ నిర్వహించిన కీలక పాత్రను తక్కువచేసి చూపింది. యుద్ధం ముగిసిన తొలి సంవత్సరాలలో సోవియట్ యూనియన్ పట్ల ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన సంఘీభావం, సానుభూతి క్రమంగా కరిగిపోయేలా ఈ ప్రచారం చేసింది. ప్రజలు అంతకు ముందెన్నడూ చూడని గొప్ప మానవత్వ ప్రపంచంలో జీవిస్తున్నట్టు భ్రమలు కల్పించింది. రోజా లక్సెంబర్గ్ వ్యాఖ్య ఇప్పుడు ప్రపంచానికి ఏ మాత్రమూ వర్తించదని నిరూపించే ప్రయత్నం చేసింది. ఆ తర్వాత కాలంలో జరిగిన వియత్నాం యుద్ధం గాని, సిఐఎ ద్వారా ప్రపంచంలోని వివిధ దేశాలలో ప్రభుత్వాలను కూలదోయడం, నియంతలను గద్దెనెక్కించడం వంటి కుట్రలు గాని ప్రజానీకం విస్మరించేలా ప్రచారం నిర్వహించింది. వాటన్నింటినీ ఉగ్రవాదుల కార్యకలాపాలుగా కొట్టిపారేసింది. ఐతే ఇప్పుడు పెట్టుబడిదారీ విధానం మానవీయమైనదన్న భ్రమ తొలగిపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ క్రూరత్వం, ఆటవిక స్వభావం మునుపెన్నడూ లేనంతగా బైటపడుతోంది. గుండెలవిసిపోయేలాంటి తన క్రూరత్వం పాలస్తీనా ప్రజలపై సాగుతున్న మారణహోమంలో మనకు కనిపిస్తోంది. ఇప్పటికి సుమారు 28,000 మంది ప్రజలు హతులయ్యారు. వారిలో 70 శాతం మహిళలు, చిన్న పిల్లలు. లక్ష మందికి పైగా ప్రజలు కనిపించడం లేదు. వారిలో చాలామంది మరణించి వుంటారని భావిస్తున్నారు. అంటే ఈ మారణహోమంలో మృతుల సంఖ్య 28,000 కన్నా చాలా ఎక్కువే. చాలామందిని బాంబులు కురిపించి ఇళ్ళు వదిలి పోయేలా చేశారు. బాధితులకు ఐరాస ద్వారా చేపట్టిన సహాయక చర్యలను పెట్టుబడిదారీ ప్రభుత్వాలు అడ్డుకు న్నాయి. ఇప్పుడు పశ్చిమ ఆసియాలో సాగుతున్నది 21వ శతాబ్దంలోకెల్లా అత్యంత దారుణమైన దమనకాండ అని ఐరాసకు చెందిన ఆర్థిక సామాజిక కమిషన్ పేర్కొంది. ఇజ్రాయిల్ లోని జియోనిస్టుల ద్వారా అత్యంత అమానవీయమైన మానవ హననం ఇప్పుడు పశ్చిమ ఆసియాలో సాగుతోంది. దానికి పెట్టుబడిదారీ ప్రభుత్వాలు ఊతం ఇస్తున్నాయి.

ఇజ్రాయిల్ ప్రభుత్వ దురహంకారం ఎంత ముదిరిపోయిందంటే అది తమపై అంతర్జాతీయ కోర్టులో ఫిర్యాదు చేసిన దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రిని, ఆమె కుటుంబ సభ్యులను "తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందంటూ" బహిరంగంగా హెచ్చరించింది. అంతర్జాతీయ కోర్టు దక్షిణాఫ్రికా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ వాదనలు సహేతుకమని తీర్పునిచ్చింది. ఎటువంటి జాతి నిర్మూలనకూ పాల్పడరాదంటూ ఇజ్రాయిల్‌ను ఆ కోర్టు ఆదేశించింది. గాజాలో సాగుతున్న యుద్ధాన్ని వెంటనే నిలుపు చేయాలన్న ఒక్క మాట తప్ప తక్కినదంతా చెప్పింది. ఇంత జరిగాక కూడా పెట్టుబడిదారీ దేశాల ప్రభుత్వాలు ఇజ్రాయిల్‌నే బలపరుస్తున్నాయి. అంతర్జాతీయ కోర్టు తీర్పు అర్థం లేనిదంటూ అమెరికా కొట్టిపారేసింది. ఇజ్రాయిల్ జాతి నిర్మూలనకు పాల్పడుతోందని ఆరోపణ చేయడం అంటే నైతికంగా హద్దులు దాటి వ్యవహరించడమేనని ఫ్రాన్స్, జర్మనీ వాదిస్తున్నాయి. ఇక్కడ ప్రత్యేకంగా చెప్పవలసినది ఒకటుంది. ఫాసిస్టు ప్రమాదం గురించి 1915లో రోజా లక్సెంబర్గ్ హెచ్చరించినప్పుడు ఏవిధంగా సోషల్ డెమోక్రాట్లు పట్టించుకోకుండా తమ దేశాల పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు సహకరించాయో, ఇప్పుడూ అదే చేస్తున్నారు. ఒకపక్క ఆ పెట్టుబడిదారీ దేశాలతో సహ ప్రపంచవ్యాప్తంగా సామాన్య ప్రజానీకం రోడ్లమీదకు వచ్చి ఇజ్రాయిల్ దురాగతాలను ఖండిస్తున్నాయి. కాని ఆ పెట్టుబడిదారీ దేశాల్లో వివిధ రాజకీయ పార్టీలు-అటు పచ్చి మితవాద పార్టీల నుండి ఇటు సోషల్ డెమోక్రాట్ల వరకూ, గ్రీన్స్ పార్టీతో సహా, సోషల్ డెమోక్రాట్లలోని వామపక్షవాద పార్టీలతో సహా (ఉదా: జర్మనీలోని డై లింక్ పార్టీ) సామ్రాజ్యవాదం వెనుక బారులు తీరాయి. ఇజ్రాయిల్‌ని, దాని సెట్లర్ వలసవాదాన్ని సమర్థిస్తున్నాయి.

ప్రపంచ ప్రజానీకం అంతా ఈ ఆటవికతను అసహ్యించుకుంటున్నారు. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో మరీ ఎక్కువగా ఇజ్రాయిల్ ఆటవికతను ఖండిస్తున్నారు. ఐనప్పటికీ, సామ్రాజ్యవాదం ఇంత బాహాటంగా అదే ఆటవికతను సమర్థించే ధైర్యాన్ని ఎలా ప్రదర్శిస్తోంది? అన్నది ఇక్కడ తక్షణం తలెత్తే ప్రశ్న. తన ఆటవిక స్వరూపాన్ని ఇంత అత్యవసరంగా వెల్లడి చేయవలసిన అగత్యం ఏమొచ్చింది? ఇది రెండవది. మొదటి ప్రశ్నకు సమాధానం సోవియట్ యూనియన్ పతనంలో, దానితోబాటు సోషలిస్టు శక్తులనుండి ఎదురయ్యే సవాలు ముగిసిపోవడంలో ఉంది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిశాక, సోవియట్ యూనియన్ కొనసాగినంత కాలమూ సామ్రాజ్యవాదుల ఆటవికతను నిరోధించే శక్తిగా అది వ్యవహరించింది. తక్కిన దేశాల్లో కూడా సోషలిజం వచ్చేస్తుందేమోనన్న భయంసామ్రాజ్యవాదుల ఆటవికత బైటపడకుండా నిలుపు చేసింది. అంటే పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణమైన ఆటవికతను అడ్డుకున్నది సోషలిజమే. రోజా లక్సెంబర్గ్ ఆనాడు చెప్పినది సత్యం అన్నది దీనిని బట్టే రుజువు అయింది. ఒకసారి ఆ సోషలిజం అనేది లేకుండా పోయాక ఇప్పుడు పెట్టుబడిదారీ శక్తులకు అడ్డు లేకుండా పోయింది.

ఇక రెండవ ప్రశ్నకు సమాధానం ఇది: గతంలో సామ్రాజ్యవాదం ఆధిపత్యం వలస విధానం అంతం కావడంతో అస్థిరతకు లోనైంది. వలసల స్వాతంత్ర్యాన్ని అంగీకరించవలసి వచ్చింది. ఆ దేశాల్లో ప్రభుత్వాల ప్రత్యక్ష జోక్యంతో ఆర్థిక వ్యవస్థలు కొంతమేరకైనా సామ్రాజ్యవాద ఉచ్చు నుండి బైట పడగలిగాయి. ఆ తర్వాత నయా ఉదారవాద వ్యవస్థను ప్రపంచవ్యాప్తంగా తిరిగి నెలకొల్పడం ద్వారా సామ్రాజ్యవాదం మళ్ళీ ప్రపంచం మీద తన ఆధిపత్యాన్ని బలోపేతం చేసుకోగలిగింది. ఐతే గతంలో వలస విధానం నాటి పరిస్థితికి, ప్రస్తుత నయా ఉదారవాద వ్యవస్థ కాలానికి ఒక కీలకమైన తేడా ఉంది. గతంలో సామ్రాజ్యవాద దేశాల నడుమ పరస్పర వైరుధ్యాలు ఉండేవి. ఇప్పుడు ఆ వైరుధ్యాలు మూగబోయాయి. గతంలో ఎన్నడూ లేనంత ఐక్యంగా ఇప్పుడు సామ్రాజ్యవాద దేశాలు వ్యవహరిస్తున్నాయి. దీనికి కారణం ఆ దేశాలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నడిపిస్తోంది. దానికి ఈ ప్రపంచం ముక్కలు కావడం ఇష్టం లేదు. అందుచేత ప్రపంచ పెట్టుబడి అంతా ఏకమైంది. అది ప్రపంచం మొత్తం మీద ఉన్న శ్రామిక ప్రజానీకాన్ని-అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల కార్మికులనేగాక మూడవ ప్రపంచ దేశాలలోని కార్మికులను, రైతాంగాన్ని కూడా-తన దోపిడీకి బలి చేస్తోంది.

ఐతే, ఈ విధంగా జరుగుతున్న దోపిడీ కారణంగానే ఇప్పుడు ఆ సామ్రాజ్యవాద పెత్తనం సంక్షోభంలో పడింది. తాను సాగిస్తున్న దోపిడీ కారణంగా శ్రామిక ప్రజల వినిమయ శక్తి పడిపోయింది. దాని ఫలితంగా మార్కెట్‌లు పెరుగుదల లేకుండా నిలిచిపోయాయి. ఇప్పుడున్న ఉత్పత్తి కూడా చెల్లుబాటు అవని పరిస్థితులు వస్తున్నాయి. ఈ సమస్యకు నయా ఉదారవాద చట్రం పరిధిలో పరిష్కారం లేదు. ప్రభుత్వాలు చురుకుగా మార్కెట్‌లో జోక్యం చేసుకుంటేనే పరిష్కారం దొరుకుతుంది. ఆవిధమైన జోక్యాన్ని నయా ఉదారవాదం సహించదు. ఈ విధంగా మార్కెట్‌లు పెరుగుదల లేకుండా పోయి ఉత్పత్తిలో చెల్లుబాటు కాకుండో పోతున్న కారణంగా ఉన్న ఉద్యోగాలు పోతున్నాయి. నిరుద్యోగం పెరుగుతోంది. అది మరింతగా మార్కెట్ ముడుచుకుపోడానికే దారి తీస్తుంది. నయా ఉదారవాద వ్యవస్థ మనుగడకు ఉన్న ముప్పు మరింత తీవ్రతరమౌతోంది.

ఈ సంక్షోభమే ఫాసిస్టు ప్రభుత్వాల ఏర్పాటుకు దోహదం చేసింది. అంతేగాక పెట్టుబడిదారీ ప్రభుత్వాలు-అవి ఫాసిస్టు స్వభావం కలిగినవైనా, వాటికి ఫాసిస్టు స్వభావం లేకపోయి నా, అన్నీ ఉమ్మడిగా శ్రామిక ప్రజలను అణచి వేస్తున్నాయి. ఇతర దేశాల్లోని అణచివేతలను సమర్థిస్తున్నాయి. ఈ అణచివేతకు ఎటువంటి నీతి, నియమం లేవు. ఆటవికత తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తోంది. ఆ ఆటవికత ఎక్కడ ఏ విధంగా వ్యక్తం అయినా, దానిని పెట్టుబడిదారీ శక్తులన్నీ కట్టగట్టుకుని బలపరుస్తున్నాయి.

(స్వేచ్ఛానుసరణ)

సమస్య

మద్య నిషేధంపై ఎందుకిన్ని డొంక తిరుగుళ్ళు?

కోవిడ్ కాలంలో మద్యం షాపులు లేవు. నూటికి 90 శాతం జనం తాగడం మానేశారు. మందు లేకుండా జరగలేదా? జైలులో మందు దొరకదు కదా? తాగకుండానే ఉన్నారు. అయితే ఈ మందు అవసరం ఎవరికి? లాభాలు ఆశించే వారికి. అందుకే మోడీ ప్రభుత్వం కోవిడ్ సమయంలో పాఠశాలలు తెరవడానికి అనుమతి ఇవ్వలేదు. కానీ మందు షాపులను తెరవడానికి అనుమతించింది. జగన్ ప్రభుత్వం జీ హుజూర్ అంటూ మద్దెల వాయించింది. మహమ్మారిగా మారిన మద్యాన్ని నియంత్రిస్తేనే జనానికి ఆరోగ్యం. నేరాలు తగ్గించేందుకు వీలవుతుంది. పేదరికాన్ని ఎదిరించే శక్తి వస్తుంది.

డి. రమాదేవి

తాము అధికారంలోకి వస్తే మద్యం నిషేధిస్తామని 2018 పాదయాత్ర సందర్భంగా జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. 2019లో అధికారంలోకి రాగానే మద్య నిషేధం (ఏడాదికి 20 శాతం చొప్పున) చేస్తూ చట్టం చేశారు. 2024 ఎన్నికలకు మద్యం అమ్మకాలు లేకుండా నిషేధాన్ని అమలు చేసి ఓట్లు అడగడానికి వస్తానని శపథం చేశారు. మద్యం వలన కుటుంబ సంబంధాలు దెబ్బతింటాయని, మానవ సంబంధాలు నాశనం అవుతాయని పేర్కొంటూ జి.ఓ ఇచ్చారు.

ఇచ్చిన హామీ మేరకు చేసిన చట్ట ప్రకారం 20 శాతం షాపులు మొదటి సంవత్సరం తగ్గించారు. రెండో సంవత్సరం కోవిడ్ కారణంగా మూసిన షాపులు తెరిచే సందర్భంలో మరో 13 శాతం షాపులు తగ్గించారు. కానీ ఆ తర్వాత పిల్లిమొగ్గలు వేశారు. నిషేధం కాస్త నియంత్రణలోకి వచ్చింది. మద్యం రేట్లు పెంచడం ద్వారా తాగడాన్ని తగ్గిస్తామని భారీగా రేట్లు పెంచారు. ఆ తర్వాత అక్రమ మద్యం పేరుతో రేట్లు తగ్గించారు. కానీ ఈ లోపు చల్లగా అస్మదీయులతో అక్రమ వ్యాపారానికి లాకులు ఎత్తారు. మూసివేసిన బెల్ట్ షాపులు ఊరూరా తిరిగి తెరుచుకున్నాయి. ప్రభుత్వమే నడిపించే మద్యం షాపుల్లో అమ్మకాల లెక్కలు లేకుండా పోయాయి. అధికారిక లెక్కల్లో మద్యం తాగడం తగ్గినట్లు చూపిస్తున్నారు. కానీ ఆచరణలో మద్యం అమ్మడం, తాగడం, ప్రభుత్వ ఆదాయాలన్నీ పైపైకి ఎగబకాయి. దాంతో మద్యంపై ఆదాయం 2018 నాటికి రూ.17,000 కోట్లు ఉండగా 2024 నాటికి రూ.25 వేల కోట్లకి పెరిగింది. మద్య నిషేధం-నియంత్రణ నీరు కారాయి.

కొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. మన రాష్ట్రంలో పార్లమెంటు, శాసనసభ రెండింటికి ఎన్నికలు జరగనున్నాయి. ప్రజలను ఏడిపిస్తున్న మద్యం సమస్య మీద ఆయా రాజకీయ పార్టీల వైఖరి ఏమిటి? మద్యాన్ని నియంత్రించడానికి, తాగుడు తగ్గించడానికి, పేదరికం నుండి బయటపడేందుకు, ఆరోగ్యాన్ని కాపాడేందుకు, నేరాలు తగ్గించేందుకు, మహిళల గౌరవాన్ని కాపాడేందుకు, రాజకీయ పక్షాలు ఆలోచిస్తాయా? లేక ప్రజల్ని పీడించి మరింత లాభాలను సంపాదించుకునే ప్రయత్నం చేస్తాయా? మద్యం సమస్య మీద అనేక అధ్యయనాలు జరిగాయి, జరుగుతున్నాయి. మన దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరికి తాగుడు అలవాటు ఉందట. దీనిని కనీసం రెట్టింపు చేయడం ద్వారా తమ లాభాలను రెట్టింపు చేసుకోవచ్చని బహుళజాతి కంపెనీలు, దేశీయ కంపెనీలు ప్రయత్నం చేస్తున్నాయి. తమ మార్కెట్‌ను పెంచుకునేందుకు వివిధ రూపాల్లో దొంగ చాటుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. ఇక ప్రజల ఓట్లతో అధికారంలోకి వస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మద్యం అమ్మకాల ద్వారా తమ బహుళ ప్రయోజనాల్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రజలు నుండి ఒత్తిడి వచ్చినప్పుడు వాటిని తగ్గించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు నటిస్తున్నాయి. అక్కడో ఇక్కడో కొన్ని మినహాయింపులు తప్ప! మద్యపానం వల్ల జిడిపిలో 1.45 శాతం ఆర్థికంగా దేశం నష్టపోతుందని ఇటీవల వచ్చిన ఒక అధ్యయనం తెలియజేసింది.

మొత్తం బడ్జెట్లో ఆరోగ్యం కోసం కేటాయిస్తున్నది 1.1 శాతం మాత్రమే! అంటే ఆరోగ్య సంరక్షణకు కేటాయిస్తున్న దానికంటే మద్యం తాగడం వల్ల దేశం ఆర్థికంగా నష్టపోతున్నది ఎక్కువ. దీనితో పాటుగా ప్రజల ఆరోగ్యం క్షీణించడంలో, పేదరికం పెరగడంలో, హింస పెరగడంలో కూడా దీని ప్రభావం ఎంత ఉందో ఈ అధ్యయనాలు తెలియచేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మద్యం తాగడాన్ని తగ్గించడానికి అన్ని చర్యలు చేపట్టాలని సూచన చేసింది. ధరలు పెంచడం ద్వారా మద్యం తాగుడును నిరుత్సాహపరచాలని కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది.

ఎంత తాగిస్తున్నారు? ఎంత తాగుతున్నారు?

1990 నుండి 2017 వరకు 189 దేశాల్లో మద్యం ఎంత తాగుతున్నారు, దాని ప్రభావం ఎంత ఉంది అని ఇటీవల ఒక అధ్యయనం చేశారు. మన దేశంలో ఈ కాలంలో 38 శాతం తాగడం పెరిగిందని తేలింది. అంతే కాదు, తాగుతున్న మోతాదు కూడా పెరిగింది. మన దేశంలో గతంలో సంవత్సరానికి ఒక వ్యక్తి 4.3 లీటర్ల లిక్కర్ తాగేవాడు. ఇప్పుడు 2017 నాటికి 5.9 లీటర్ల మద్యం తాగుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలో సగటున ఒక మనిషి తొమ్మిది లీటర్లు తాగుతున్నారు.

కేరళలో ఎన్.హెచ్.ఎఫ్.ఎస్-4, 2015-16 సర్వే ప్రకారం 37 శాతం పురుషులకు 1.6 శాతం మహిళలకు మద్యం తాగే అలవాటు ఉండగా ఎన్.హెచ్. ఎఫ్ ఎస్-5, 2019- 20 సర్వే ప్రకారం 19.9 శాతం పురుషులు, 0.2 శాతం మహిళలు (సగటున 9.4 శాతం) తాగుతున్నట్లు తేలింది. అంటే గణనీయంగా తగ్గింది. పశ్చిమ బెంగాల్‌లో తాగుడు చాలా ఆందోళనకరంగా పెరిగిందని పేర్కొన్నారు. 29 శాతం మంది తాగుతుండగా చిన్నపిల్లల్లో నాలుగు శాతం తాగుతున్నారట. మన రాష్ట్రంలో 11.5 శాతం (15-49 వయస్సులో పురుషులు 31.2 శాతం) జనం తాగుతూ ఉండగా జాతీయ సగటు 9.9 శాతం (మగవాళ్ళు 22 శాతం) ఉంది. బీహార్‌లో 1.7 శాతం మంది మాత్రమే ప్రస్తుతం తాగుతున్నారు.

తాగుడును నియంత్రించలేమా?

పై వివరాలు చూసినప్పుడు దేశవ్యాప్తంగా తాగుడు అలవాటు ప్రజలందరిలో ఒకే విధంగా లేదు. ఆయా రాష్ట్రాల్లో లిక్కర్ కంపనీలు, మాఫియా, అందుకు సహకరించే ప్రభుత్వాలు లిక్కర్ పెంపుదలకు ప్రధానమైన కారణాలుగా కనిపిస్తున్నాయి. కేరళలో "విముక్తి" పేరుతో తాగుడికి వ్యతిరేకంగా కుడుంబశ్రీ, ఆరోగ్య శాఖ కలిసి ఒక విస్తృతమైన ప్రచారం చేపట్టాయి. అందులో మహిళలు, యువకులు ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు. ఆ రాష్ట్రంలో 2016లో ఒక విధానంగానే 730 బార్లను మూసివేయడం జరిగింది. బీహార్, గుజరాత్, నాగాలాండ్, లక్షద్వీప్ లలో మద్యనిషేధం ఉంది. గుజరాత్ గిఫ్ట్ సిటీలో ఇటీవల మద్యాన్ని అనుమతించారు.

ఆనాడు మహిళలు వ్యక్తం చేసిన నిరసన ఫలితంగా బీహార్‌లో 2016 ఎన్నికలవేళ నితీష్ కుమార్ మద్య నిషేధం హామీ ఇచ్చి ఎన్నికల తర్వాత కఠినంగా అమలు చేశారు. ఫలితంగా భారీగా తాగే వారి సంఖ్య తగ్గడానికి కారణమైంది. అందుకు భిన్నంగా పశ్చిమ బెంగాల్‌లో అమెజాన్, బిగ్ బాస్కెట్ కంపెనీల ద్వారా హోమ్ డెలివరీ ప్రవేశపెట్టారు. చిన్న చిన్న పాకెట్లు, చిన్న సీసాలలో ప్యాకేజీ ద్వారా చేయడం కూడా విస్తరించడానికి కారణమైంది. మన రాష్ట్ర అనుభవం కూడా అదే. 1985లో నాటి ఎన్టీఆర్ ప్రభుత్వం "వారుణీ వాహిని" పథకం ప్రవేశపెట్టి బాటిళ్ల నుంచి ప్లాస్టిక్ సాచెట్లలో మద్యం పంపిణీ చేయడంతో ఒక సంవత్సరంలోనే రూ.200 కోట్ల నుండి రూ.600 కోట్లకు ఆదాయాన్ని పెంచుకోగలిగింది. 89-90 నాటికి విస్తారంగా సారా సేవనం పెరగడం, అదే సమయంలో బియ్యం రేట్లు పెరగడం, అక్షరాస్యత ఉద్యమం వంటి కారణాలతో భారీగా చారిత్రాత్మకమైన సారా వ్యతిరేక పోరాటం జరిగింది. ఫలితంగా 95లో ఎన్టీఆర్ మద్యనిషేధం విధించినప్పుడు మద్యం వాడకం పడిపోయింది.

భారత రాజ్యాంగం ఆర్టికల్ 47లో మద్య నియంత్రణ లక్ష్యంగా ప్రకటించింది. అందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం విధి విధానాలు రూపొందించి అమలుచేయాలి. కానీ బహుళజాతి కంపెనీలతో సంబంధాలే కేంద్ర ప్రభుత్వానికి ప్రధానం అయ్యాయి. లాభాల కోసం స్వదేశీ, విదేశీ పొత్తులతో మురిసిపోతున్నారు. పాలకుల మద్దతుతో మద్యం వ్యాపారం విస్తరిస్తున్నది. మద్యం ద్వారా ఆదాయం లేకపోతే ప్రభుత్వాలు ఎలా నడుస్తాయంటూ జనాన్ని నమ్మించ చూస్తున్నారు.

కోవిడ్ కాలంలో మద్యం షాపులు లేవు. నూటికి 90 శాతం జనం తాగడం మానేశారు. మందు లేకుండా జరగలేదా? జైలులో మందు దొరకదు కదా? తాగకుండానే ఉన్నారు. అయితే ఈ మందు అవసరం ఎవరికి? లాభాలు ఆశించే వారికి. అందుకే మోడీ ప్రభుత్వం కోవిడ్ సమయంలో పాఠశాలలు తెరవడానికి అనుమతి ఇవ్వలేదు. కానీ మద్యం షాపులను తెరవడానికి అనుమతించింది. జగన్ ప్రభుత్వం జీ హుజూర్ అంటూ మద్దెల వాయించింది. మహమ్మారిగా మారిన మద్యాన్ని నియంత్రిస్తేనే జనానికి ఆరోగ్యం. నేరాలు తగ్గించేందుకు వీలవుతుంది. కుటుంబాలు, ఆ కుటుంబంలో పిల్లలు ఒకరికి మరొకరుగా బతుకు బండి నడుస్తుంది. పేదరికాన్ని ఎదిరించే శక్తి వస్తుంది. ఎన్నికల సందర్భంగా మహిళలు మరోసారి ఆవేదనతో ఆగ్రహంతో గళమెత్తుతున్నారు. మద్య నియంత్రణ చేయలేనివారికి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ఉందా అన్నది వారి ప్రశ్న!

/ వ్యాసకర్త ఐద్వా రాష్ట్ర కార్యదర్శి/

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

(గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)
రిజిష్టర్డు ఆఫీసు: టవర్ 3, వింగ్ బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్లా (వెస్ట్), ముంబయి-400070. **రీజినల్ ఆఫీసు:** 3వ & 4వ అంతస్తు, శ్రీ ప్రశాంతి సాయి టవర్స్, ప్లాట్ నెం.68, మున్సిపల్ నెం.8-2-248, నాగార్జున హిల్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, పంజగుట్ట దగ్గర, హైదరాబాద్-500082

SARFAESI చట్టం, 2002 లోని రూల్ 8(1) క్రింద స్వాధీనత ప్రకటన

ఏదైతే క్రింది సంతకందారు **నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) ఆర్డినెన్స్ 2002, (ఆర్డర్ 3 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో ఈ నోటీసు స్వీకరించిన 60 రోజులలోగా చెల్లింపు యొక్క వాస్తవ తేది వరకు ఖర్చులు, చార్జీలు మరియు వ్యయాలతో సదరు నోటీసులోని పేర్కొన్న మొత్తాన్ని సంబంధిత రుణగ్రహీతలు తిరిగిచెల్లించవలసిందిగా కోరుతూ రుణగ్రహీత/లకు డిమాండ్ నోటీసు జారీచేయబడినది. రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు తమ బాకీలను పూర్తిగా చెల్లించుటలో విఫలం చెందియున్న కారణంగా, ప్రధానంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, **నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)** యొక్క చార్జ్‌కు లోబడి ఆస్తులతో ఎలాంటి లావాదేవీలు మరియు ఆస్తులతో లావాదేవీలు జరుపకూడదని ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరించడంతో సహా తేదిలలో పేర్కొన్న సదరు రూల్స్‌లోని రూల్ 8 చదువుతూ యొక్క సెక్షన్ 13(4) క్రింద అతని సంక్రమించిన అధికారాలతో ఇక్కడ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారుడు లాంఛనప్రాయంగా స్వాధీనంలోకి తీసుకున్నారు. సంబంధిత తేదిల నుండి భవిష్యత్ వడ్డీ, ఖర్చులు మరియు చార్జీలతో పేర్కొన్న మొత్తం కొరకు. సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు, సెక్యూరిటీలు, బకాయిలు, డిమాండ్ నోటీసు యొక్క వివరాలు పంపించడమైనది మరియు అందులో క్లైయించేసిన మొత్తం మరియు స్వాధీనత తేది వివరాలు క్రింద ఇవ్వడమైనది:

1. రుణగ్రహీత, సహ రుణగ్రహీత, హామీదారుని పేరు మరియు చిరునామా, రుణ ఖాతా నెంబరు మరియు రుణ మొత్తం:
గంజికుంట కోదండ రామాంజనేయులు (రుణగ్రహీత) & గంజికుంట శ్రీనివాసరావు (సహ-రుణగ్రహీత), 3 141 బిసి కాలనీ చౌడేశ్వరమ్మ దేవాలయం దగ్గర, అల్లూరివారిపాలెం ఇక్కుర్రు గుంటూరు-522601.
LAN.NO.: LVIJSBB0000094543, రుణ ఒప్పంద తేదీ: 27.10.2022, డిమాండ్ నోటీసు తేదీ:-21.11.23
రుణ మొత్తం: రూ.35,00,000/- (రూపాయలు ముప్పై ఐదు లక్షలు మాత్రమే)
బకాయి మొత్తం: రూ.36,51,156.19/- (రూపాయలు ముప్పై ఆరు లక్షల యాభైఒక వేల నూటయాభై ఆరు & పంతొమ్మిది పైసలు మాత్రమే),
స్వాధీనతా తేదీ: 15.02.2024

సెక్యూర్డ్ అస్సెట్ వివరాలు: ఫ్లాట్ నెం.201, 1వ అంతస్తు, జిఆర్ ఎన్‌క్లేవ్, డోర్ నెం.254, గుండిమెడ గ్రామ పంచాయితీ, తాడేపల్లి మండలం, గుంటూరు 522501 వద్దగల మొత్తం భాగం. సరిహద్దులుగా: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్‌టు స్కై, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: మెట్లు, లిఫ్ట్ &ఉమ్మడి కారిడార్.

2. రుణగ్రహీత, సహ రుణగ్రహీత, హామీదారుని పేరు మరియు చిరునామా, రుణ ఖాతా నెం. మరియు రుణ మొత్తం:
రమేష్ వడ్లాని (రుణగ్రహీత) & భీమాన రమాదేవి (సహ-రుణగ్రహీత), డోర్ నెం.73-6-8, శివ శంకర్ నగర్, పటమట, విజయవాడ-కృష్ణా 520010. **LAN.NO.: LVIJSTH0000096065, రుణ ఒప్పంద తేదీ: 10.02.2023, డిమాండ్ నోటీసు తేదీ: 21.11.23**
రుణ మొత్తం: రూ.22,50,000/- (రూపాయలు ఇరవైరెండు లక్షల యాభైవేలు మాత్రమే)
బకాయి మొత్తం రూ.23,70,699.68/- (రూపాయలు ఇరవై మూడు లక్షల డెబ్బైవేల ఆరువందల తొంభై తొమ్మిది& అరవై ఎనిమిది పైసలు మాత్రమే)
స్వాధీనతా తేదీ: 15.02.2024

సెక్యూర్డ్ అస్సెట్ వివరాలు: ఫ్లాట్ నెం.ఎస్ఎఫ్2, 1వ అంతస్తు, శ్రీ సాయి దీపిక గ్రాండ్, ఆర్ఎస్ నెంజ35 6డి, హనుమాన్ నగర్, ప్రసాదంపాడు గ్రామ పంచాయితీ, విజయవాడ 521108 వద్ద మొత్తం భాగం. సరిహద్దులుగా: ఉత్తరం: ఉమ్మడి కారిడార్, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: కారిడార్, పడమర: ఫ్లాట్ నెం.ఎఫ్3.

ప్రదేశం: గుంటూరు& విజయవాడ,
తేది: 20.02.2024

సం/- అధీకృత అధికారి
నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున
(గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)

భారత ప్రభుత్వము, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్

రికవరీ ఆఫీసర్-II కార్యాలయం: 31-31-21, నారాయణ భవనం, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం - 530020. ఇ-మెయిల్ ఐడి: ro2.drtvpatnam@gmail.com. ఫోన్: 0891-2957045

ప్రొక్లమేషన్ ఆఫ్ సేల్ - కమ్ - ఇ-వేలం అమ్మకపు నోటీసు

(ఆదాయపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూలు రూల్ 52(2) చూడుము)
RP/456/2018 in OA/531/2017

(1) **కెనరా బ్యాంక్, చంద్రమౌళీ నగర్ బ్రాంచ్, గుంటూరు (ఎఆర్ఎమ్‌బి, విజయవాడ ద్వారా)** వర్సెస్ M/s. **టచ్ టెక్స్‌టైల్స్ మరియు ఇతరుల** మధ్యనున్న ఒ.ఎ. నెం.**531/2017** నకు సంబంధించి బ్యాంకులు మరియు ఫైనాన్షియల్ సంస్థలు ఋణబకాయిల వసూలు చట్టం 1993 యొక్క సెక్షన్ 19(22) పరిధిలోని **గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం** వారిచే రికవరీ సర్టిఫికెట్ **23.05.2018 తేదిన** జారీచేయబడినది & దానిని అమలు పరచు నిమిత్తం క్రింద సంతకందారునికి పంపటమైనది.
(2) రికవరీ సర్టిఫికెట్‌లో సూచించిన **రూ.1,03,41,901/- (అక్షరాల ఒక కోటి మూడు లక్షల నలభై ఒక్క వేల తొమ్మిది వందల ఒక్క రూపాయలు)** తో తేది. 27.07.2017 నుండి 13.15% చొప్పున నెలవారి తదుపరి వడ్డీ, ఖర్చులు వగైరా ఈ క్రింది సర్టిఫికెట్ డెటార్స్ నుండి వసూలు చేయుటకు **ఆర్.పి.నెం.456/2018** నందలి తీర్మానములు అమలుపరచుటకు క్రింది సంతకందారు చర్యలు చేపట్టినారు.
(CD-1) M/s **టచ్ టెక్స్‌టైల్స్,** ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్, ఆఫీస్ చిరునామా: డి.నెం.3-18-41/9, కుందుల రోడ్డు, కృష్ణా నగర్, గుంటూరు.
(CD-2) **శ్రీ జి.వి. కృష్ణ వర్మ, తండ్రి: జి. మురళీ వర్మ,** ఫ్లాట్ నెం. 413, మై హోమ్ అపార్ట్‌మెంట్స్, నవోదయ కాలనీ, గణపతి కాంప్లెక్స్ ప్రక్కన, గుంటూరు.
(CD-3) **శ్రీ కె.జె.ఎ.ఎ.ఆర్. ప్రసాద్, తండ్రి: కన్యాసర కస్వరాజు,** డి.నెం. 3-33-54, ఎన్‌జిఒ కాలనీ ఏరియా, నరసరావుపేట, గుంటూరు జిల్లా.
(CD-4) **శ్రీ చింతమళ్ల పలంకయ్య, తండ్రి: గోపయ్య,** డి.నెం. 5093-30, 6/13, బ్రాడీపేట, గుంటూరు జిల్లా.
(3) తేది 06.05.2023 నాటికి బకాయి రూ. 2,97,75,079.00 (తేది 06.05.2023 వరకు వడ్డీ లెక్కించబడినది) - రూ. 34,45,000/- తీసివేయగా (తేది 17.11.2023న జరిపిన ఇ-వేలం అమ్మకం ద్వారా షెడ్యూలు-బి లోని ఐటెం నెం.2 అమ్మకం ద్వారా రాబట్టుకోబడినది) మిగిలిన మొత్తం + భవిష్య వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు పొందుటకు రికవరీ ప్రొసీడింగ్స్ ప్రారంభించడమైనది.
(4) సర్టిఫికెట్ డెటార్స్‌కి చెందిన షెడ్యూలు ఆస్తులు, క్రింద తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ ఏర్పరచిన వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంచే రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు విక్రయించుటకు నిర్ణయించడమైనది. వేలం తేది, సమయం, బిడ్ ఫామ్ దాఖలు చేయు ఆఖరి తేది, రిజర్వు ధర, బయానా, బిడ్ పెంచు మొత్తం మొ॥నవి ప్రతి ఐటమ్ / షెడ్యూలు దిగువ సూచించడమైనది.

బిడ్లు సమర్పించుటకు చివరి తేది: 27.03.2024, సా॥ 4 గం.ల వరకు **వేలం తేది: 30.03.2024**

షెడ్యూలు & ఐటమ్ నెం.	ఆస్తి యొక్క విస్తీర్ణం	రిజర్వు ధర	ధరావత్తు సొమ్ము	బిడ్ పెంపుదల	వేలం సమయం*
షెడ్యూల్-బి ఐటమ్ నెం.1	ఎ. 0.55 సెంట్లు (2662 చ॥గ॥) ఖాళీ స్థలం	రూ. 53,35,000/-	రూ. 5,33,500/-	రూ.50,000/-	ఉ॥11.00 - మ॥ 12.00 గం.వరకు

* ఇ-వేలం సమయం - ఆటో ఎక్స్‌టెన్షన్ పద్ధతిలో ప్రతి సారి 5 నిమిషములు పొడిగించబడుతుంది అనగా ఇ-వేలం సమయం ముగిసేముందు బిడ్ వేసినచో వేలం 5 నిమిషములు పొడిగించబడుతుంది.
(5) సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** ద్వారా **ఆన్‌లైన్ ఇ-వేలం** నందు పాల్గొనవలసిందిగా ప్రజలను ఆహ్వానించడమైనది. **సర్వీస్ ప్రొవైడర్ వివరములు: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,** సంప్రదించవలసిన వ్యక్తి పేరు: **శ్రీ ధరణి కృష్ణ, ఫోన్: 9948182222,** ఇ-మెయిల్: **andhra@c1india.com**
(6) ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొన్నవారు ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నియమ నిబంధనలు, పూర్తి వివరాలు కొరకు వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** ద్వారా పరిశీలించవలసినదిగాను మరియు బిడ్‌ఫారమ్‌లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలం నందు పాల్గొనుటకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్ సహాయం, విధానం, ఆన్‌లైన్ శిక్షణ కొరకు సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవలసినదిగా సలహా సూచించడమైనది.
(7) ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొనువారు ఇ.ఎమ్.డి. సొమ్ము ఆర్.టి.జి.ఎస్. / నెఫ్ట్ / ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా **కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ వారి అకౌంట్ నెం. 209272434, IFSC Code:CNRB0006682** వారికి క్రెడిట్ చేయవలెను మరియు బిడ్ ఫారమ్‌లు పైన తెలిపిన టేబుల్ నందు గల ఆఖరితేదీలోగా సమర్పించవలెను మరియు పూర్తిచేసిన బిడ్ ఫారమ్స్‌ను, ఆధార్ కార్డు, పాన్‌కార్డు కాపీ, ఐడి ప్రూఫ్, ప్లాట్ నెంబరు, అడ్రస్ ప్రూఫ్ మరియు ఇఎమ్‌డి డిపాజిట్ ప్రూఫ్ మొదలగునవి దిగువ సంతకందారునికి రిజిష్టర్డు పోస్టు / స్పీడ్ పోస్టు / కొరియర్ ద్వారా **28.03.2024 సాయంత్రం 4 గంటల** లోపు అందేటట్లు పంపవలెను. పోస్టల్ ఆలస్యమునకు బాధ్యత వహించబడదు.
(8) వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగలవారు వేలం నియమ నిబంధనలు, విచారణలు, షెడ్యూలు ఆస్తి తనిఖీ, షెడ్యూలు ఆస్తి వివరాలు తెలుసుకొనుటకు **శ్రీ కారుమంచి కుమార్, ఛీఫ్ మేనేజర్ (మొబైల్ నెం.8331011695),** ఇ-మెయిల్ ఐడి:**armvij@canarabank.com** వారిని సంప్రదించవలసినదిగా కోరడమైనది. ఔత్సాహిక బిడ్డర్లు బిడ్ సమర్పించేముందు స్వయంగా ఆస్తి ఎన్‌కంబరెన్సు సర్టిఫికెట్‌లు మరియు ఆస్తి టైటిల్ గురించి పరీక్షించుకొని తృప్తి చెంది వేలంలో పాల్గొనవలెను. దిగువ సంతకందారు ధృవీకరించిన విజయవంతమైన బిడ్డర్‌కు ఆస్తి మరియు సంబంధిత టైటిల్ డీడ్ డాక్యుమెంట్లను బ్రాంచ్ హెడ్ గారు అందచేస్తారు.

షెడ్యూలు ఆస్తి వివరములు

షెడ్యూల్ "బి": ఐటమ్ నెం-1: పిడుగురాళ్ల ఎస్ఆర్ఒ, డాక్యుమెంట్ నెం. **2901/2011** తేది. **20.05.2011** ప్రకారం **సి.హెచ్. పలంకయ్య పేరునగల ఆస్తి:** గుంటూరు జిల్లా, పిడుగురాళ్ల ఎస్ఆర్ఒ పరిధి, నరసరావుపేట, పిడుగురాళ్ల పంచాయితీ మరియు గ్రామం, డి.నెం. 898/1C1, ఎ. 0.75 సెంట్లులో **ఎ. 0.55 సెంట్లు విస్తీర్ణం గల భూమి. హద్దులు:** తూర్పు: జి. మార్కు భూమి, దక్షిణం: ఎమ్. చంద్రయ్య భూమి, పడమర: డొంక, ఉత్తరం: జి. వెంకటేశ్వర్లు భూమి.
Location Co-ordinates: 16.462922, 79.913519

(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది.14-02-2024 న జారీచేయడమైనది)
సం/- బి.ఎన్.ఎస్.వి.ఎస్.కె. బంగార్రాజు, రికవరీ ఆఫీసర్-II

భారత ప్రభుత్వము, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్

రికవరీ ఆఫీసర్ కార్యాలయం: 31-31-21, నారాయణ భవనం, సాయిబాబా వీధి, డాబాగార్డెన్స్, విశాఖపట్నం - 530020. ఇ-మెయిల్ ఐడి: ro2.drtvpatnam@gmail.com. ఫోన్: 0891-2957045

ప్రొక్లమేషన్ ఆఫ్ సేల్ - కమ్ - ఇ-వేలం అమ్మకపు నోటీసు

(ఆదాయపన్ను చట్టం 1961 యొక్క రెండవ షెడ్యూలు రూల్ 52(2) చూడుము)
RP/798/2019 in OA/88/2018

(1) **కెనరా బ్యాంక్, మెయిన్ బ్రాంచ్, హిందూ కాలేజీ హైస్కూల్ క్యాంపస్, గుంటూరు (ఎఆర్ఎమ్‌బి, విజయవాడ ద్వారా)** వర్సెస్ **మెస్సర్స్ సింధూరఅరుణ విగ్రహం కాటన్స్ & ఇతరులు** మధ్యనున్న ఒ.ఎ. నెం.**88/2018** నకు సంబంధించి బ్యాంకులు మరియు ఫైనాన్షియల్ సంస్థలు ఋణబకాయిల వసూలు చట్టం 1993 యొక్క సెక్షన్ 19, సబ్-సెక్షన్ (22) పరిధిలోని **గౌరవనీయ ప్రిసైడింగ్ అధికారి, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం** వారిచే రికవరీ సర్టిఫికెట్ **18.01.2021 తేదిన** జారీచేయబడినది & దానిని అమలు పరచు నిమిత్తం క్రింద సంతకందారునికి పంపటమైనది.
(2) రికవరీ సర్టిఫికెట్‌లో సూచించిన **రూ.2,67,39,612/- (అక్షరాల రెండు కోట్ల అరవై ఏడు లక్షల ముప్పై తొమ్మిది వేల ఆరు వందల పన్నెండు రూపాయలు)** + తో వడ్డీ, ఖర్చులు వగైరా ఈ క్రింది సర్టిఫికెట్ డెటార్స్ నుండి వసూలు చేయుటకు **ఆర్.పి. నెం.798/2019** నందలి తీర్మానములు అమలు పరచుటకు క్రింది సంతకందారు చర్యలు చేపట్టినారు.
(CD-1) M/s **సింధూరఅరుణ విగ్రహం కాటన్స్,** డి.నెం. 13-4-41, బెస్తపాలెం వీర రాఘవపేట, చీరాల, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
(CD-2) **శ్రీ కారంపూడి మురళీ, తండ్రి: కె. హనుమయ్య,** డి.నెం. 13-4-41, బెస్తపాలెం వీర రాఘవపేట, చీరాల, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
(CD-3) **శ్రీమతి కారంపూడి పుష్పలత, భర్త: కె. మురళీ,** డి.నెం. 13-4-41, బెస్తపాలెం వీర రాఘవపేట, చీరాల, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్
(CD-4) **శ్రీ తోట శ్రీనివాసరావు, తండ్రి: టి. వెంకటేశ్వర్లు,** డి.నెం. 12-8-32, రాఘవరావుతోట, బాపట్ల, ప్రకాశం జిల్లా
(CD-5) **శ్రీమతి తోట సామ్రాజ్యం,** డి.నెం. 12-8-32, రాఘవరావుతోట, బాపట్ల, ప్రకాశం జిల్లా.
(CD-6) **శ్రీమతి బిట్ర కనకదుర్గ, భర్త: బి. గోపాలకృష్ణ,** బాలాజీరావుపేట, తెనాలి, గుంటూరు.
(3) తేది 13.07.2023 నాటికి బకాయి రూ. 6,26,60,627.41/- (తేది 13.07.2023 వరకు వడ్డీ లెక్కించబడినది) + భవిష్య వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు వగైరాలు పొందుటకు రికవరీ ప్రొసీడింగ్స్ ప్రారంభించడమైనది.
(4) సర్టిఫికెట్ డెటార్స్‌కి చెందిన షెడ్యూలు ఆస్తులు, క్రింద తెలిపిన సర్వీస్ ప్రొవైడర్ ఏర్పరచిన వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంచే రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు విక్రయించుటకు నిర్ణయించడమైనది. వేలం తేది, సమయం, బిడ్ ఫామ్ దాఖలు చేయు ఆఖరి తేది, రిజర్వు ధర, బయానా, బిడ్ పెంచు మొత్తం మొ॥నవి ప్రతి ఐటమ్ / షెడ్యూలు దిగువ సూచించడమైనది.

బిడ్లు సమర్పించుటకు చివరి తేది: 27.03.2024, సా॥ 4 గం.ల వరకు **వేలం తేది: 30.03.2024**

షెడ్యూలు	ఆస్తి విస్తీర్ణం	రిజర్వు ధర	ధరావత్తు సొమ్ము	బిడ్ పెంపుదల	వేలం సమయం*
షెడ్యూల్-ఎ	220 చ॥గ॥ ఖాళీ స్థలం	రూ.6,60,000	రూ.66,000/-	రూ.10,000/-	ఉ॥ 11.00 గం.ల నుండి మ॥12.00 గం.ల వరకు
షెడ్యూల్-సి లో ఐటమ్ నెం.2	ఎ.0.81 సెంట్లు వ్యవసాయ భూమి	రూ. 15,10,000	రూ. 1,51,000/-	రూ. 25,000/-	

* ఇ-వేలం సమయం - ఆటో ఎక్స్‌టెన్షన్ పద్ధతిలో ప్రతి సారి 5 నిమిషములు పొడిగించబడుతుంది అనగా ఇ-వేలం సమయం ముగిసేముందు బిడ్ వేసినచో వేలం 5 నిమిషములు పొడిగించబడుతుంది.
(5) సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** ద్వారా **ఆన్‌లైన్ ఇ-వేలం** నందు పాల్గొనవలసిందిగా ప్రజలను ఆహ్వానించడమైనది. **సర్వీస్ ప్రొవైడర్ వివరములు: మెస్సర్స్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,** సంప్రదించవలసిన వ్యక్తి పేరు: **శ్రీ ధరణి కృష్ణ, ఫోన్: 9948182222,** ఇ-మెయిల్: **andhra@c1india.com**
(6) ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొన్నవారు ఇ-వేలం అమ్మకానికి సంబంధించిన నియమ నిబంధనలు, పూర్తి వివరాలు కొరకు వెబ్‌సైట్ **https://www.bankeauctions.com** ద్వారా పరిశీలించవలసినదిగాను మరియు బిడ్‌ఫారమ్‌లు దాఖలు చేయుటకు మరియు ఇ-వేలం నందు పాల్గొనుటకు అవసరమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, యూజర్ ఐడి, పాస్‌వర్డ్ సహాయం, విధానం, ఆన్‌లైన్ శిక్షణ కొరకు సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవలసినదిగా సలహా సూచించడమైనది.
(7) ఆసక్తి గల బిడ్డర్లు / పాల్గొనువారు ఇ.ఎమ్.డి. సొమ్ము ఆర్.టి.జి.ఎస్. / నెఫ్ట్ / ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా **కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ వారి అకౌంట్ నెం. 209272434, IFSC Code:CNRB0006682** వారికి క్రెడిట్ చేయవలెను మరియు బిడ్ ఫారమ్‌లు పైన తెలిపిన టేబుల్ నందు గల ఆఖరితేదీలోగా సమర్పించవలెను మరియు పూర్తిచేసిన బిడ్ ఫారమ్స్‌ను, ఆధార్ కార్డు, పాన్‌కార్డు కాపీ, ఐడి ప్రూఫ్, ప్లాట్ నెంబరు, అడ్రస్ ప్రూఫ్ మరియు ఇఎమ్‌డి డిపాజిట్ ప్రూఫ్ మొదలగునవి దిగువ సంతకందారునికి రిజిష్టర్డు పోస్టు / స్పీడ్ పోస్టు / కొరియర్ ద్వారా **28.03.2024 సాయంత్రం 4 గంటల** లోపు అందేటట్లు పంపవలెను. పోస్టల్ ఆలస్యమునకు బాధ్యత వహించబడదు.
(8) వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగలవారు వేలం నియమ నిబంధనలు, విచారణలు, షెడ్యూలు ఆస్తి తనిఖీ, షెడ్యూలు ఆస్తి వివరాలు తెలుసుకొనుటకు **శ్రీ కారుమంచి కుమార్, ఛీఫ్ మేనేజర్ (మొబైల్ నెం.8331011695),** ఇ-మెయిల్ ఐడి:**armvij@canarabank.com** వారిని సంప్రదించవలసినదిగా కోరడమైనది. ఔత్సాహిక బిడ్డర్లు బిడ్ సమర్పించేముందు స్వయంగా ఆస్తి ఎన్‌కంబరెన్సు సర్టిఫికెట్‌లు మరియు ఆస్తి టైటిల్ గురించి పరీక్షించుకొని తృప్తి చెంది వేలంలో పాల్గొనవలెను. దిగువ సంతకందారు ధృవీకరించిన విజయవంతమైన బిడ్డర్‌కు ఆస్తి మరియు సంబంధిత టైటిల్ డీడ్ డాక్యుమెంట్లను బ్రాంచ్ హెడ్ గారు అందచేస్తారు.

షెడ్యూలు ఆస్తి వివరములు

షెడ్యూల్-ఎ: **(గుంటూరు ఎస్ఆర్ఒ, రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం.4867/2016 తేది.11.05.2016 ప్రకారం D2 కు చెందిన ఆస్తి):** గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు సబ్-జిల్లా, నడింపాలెం గ్రామపంచాయతీ పరిధి, నడింపాలెం గ్రామం, డి.నెం. 2/C1, 11/A1, 11/A2, 11/A3, 11/B1, 11/B2, 11/B5, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ వారిచే ఎల్‌పి నెం. 12/2011/GNT ద్వారా అమోదించబడిన ప్లాన్ ప్రకారం వేసిన **సుప్రియ ఎన్‌క్లేవ్, ఫేజ్-II, ప్లాట్ నెం. 12 లోని 220 చ॥గ॥ ఖాళీ స్థలం. హద్దులు:** తూర్పు: ఫేజ్-1 లోని ప్లాట్ నెం. 46, దక్షిణం: ప్లాట్ నెం. 11, పడమర: 33 అ॥ వెడల్పు రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.13.
Location Co-ordinates: 16.212557, 80.311116.
షెడ్యూల్-సి: **(తెనాలి వెస్ట్ ఎస్ఆర్ఒ, డాక్యుమెంట్ నెం.1428/2011 తేది.14.09.2011 ప్రకారం CD-6 కు చెందిన ఆస్తి):** గుంటూరు జిల్లా, తెనాలి సబ్ జిల్లా, చినపరిమి గ్రామం మరియు గ్రామ పంచాయితీ, డి.నెం. 265/5 & 265/6 నందు **ఎ. 0.81 సెంట్లు భూమి. హద్దులు:** తూర్పు: అవ్వుతు మోహన రెడ్డి భూమి, పడమర: డొంక, దక్షిణం: షెడ్యూల్ కాస్ట్ పీపుల్ భూమి, ఉత్తరం: గాయం వెణుగోపాల్ రెడ్డి మరియు ఇతరులు భూమి. **Location Co-ordinates: 16.186552, 80.634143.**

(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది.14-02-2024 న జారీచేయడమైనది)
సం/- బి.ఎన్.ఎస్.వి.ఎస్.కె. బంగార్రాజు, రికవరీ ఆఫీసర్-II

'లాభాల' యూనిట్లను ప్రయివేటీకరిస్తారా?

- రైల్వే బోర్డుపై పీపుల్స్ కమిషన్ ఆగ్రహం
- పరిశీలించాలంటూ కాగ్‌కు లేఖ

న్యూఢిల్లీ : లాభాలు ఆర్జిస్తున్న నాలుగు ఉత్పత్తి యూనిట్లను ప్రయివేటీకరించేందుకు రైల్వే బోర్డు చేసిన ప్రతిపాదనపై పీపుల్స్ కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని పరిశీలించాలని కాగ్‌ను కోరింది. చెన్నయ్ (తమిళనాడు)లోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, లాతూర్ (మహారాష్ట్ర)లోని మరాట్వాడా రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వారణాసి (ఉత్తరప్రదేశ్)లోని బనారస్ లోకోమోటివ్ వర్క్స్, దాహోద్ (గుజరాత్)లోని రైల్వే వర్క్‌షాపును విదేశీ ప్రయివేటు సంస్థలకు ధారాదత్తం చేయాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పీపుల్స్ కమిషన్ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ జిసి ముర్ముకు ఒక లేఖ రాసింది.

ఈ నాలుగు యూనిట్ల పనితీరుపై ముందుగానే సమగ్ర ఆడిట్ నిర్వహించాలని, లేనిపక్షంలో అవి ప్రయివేటు సంస్థల చేతుల్లోకి వెళతాయని, ఫలితంగా రైల్వే శాఖకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుందని, దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని ఆ లేఖలో పీపుల్స్ కమిషన్ వివరించింది. పీపుల్స్ కమిషన్‌లో ఈఎఎస్ శర్మ, ప్రభాత్ పట్నాయక్, అదితి మెహతా, థామస్ ఐజాక్ వంటి ప్రముఖ విద్యావేత్తలు, న్యాయకోవిదులు, మాజీ అధికారులు, కార్మిక సంఘాల నేతలు, సామాజిక కార్యకర్తలు సభ్యులుగా ఉన్నారు. బోగీలు, లోకో ఉత్పత్తిలో దేశీయ, విదేశీ బహుళజాతి సంస్థలకు ప్రవేశం కల్పించేందుకు రైల్వే బోర్డు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నదని పీపుల్స్ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టి, ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ వ్యూహాత్మక పనులను విచక్షణారహితంగా ఔట్‌సోర్సింగ్‌కు ఇస్తోంది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే పిఎస్‌యుల్లో ఖాళీలను భర్తీ చేయకుండా తాత్సారం చేస్తోంది. దీంతో ఆ సంస్థలు ప్రయివేటు కంపెనీలకు తలుపులు తెరిచి వాటిని ఆహ్వానిస్తున్నాయి. మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఆస్తులను దోచుకునేందుకు వీలు కల్పిస్తున్నాయి. ప్రయివేటు బిడ్డర్లతో పోటీ పడే శక్తిని కోల్పోయేలా చేస్తున్నాయి' అని పీపుల్స్ కమిషన్ ఆ లేఖలో తెలిపింది.

ఒకవైపు ప్రభుత్వ రంగ యూనిట్లను ప్రయివేటు పరం చేస్తూ మరోవైపు ప్రధాని నరేంద్ర మోడీ 'ఆత్మనిర్భర్ భారత్' అంటూ డొల్ల కబుర్లు చెబుతున్నారని పీపుల్స్ కమిషన్ ఎద్దేవా చేసింది. రైల్వే ఉత్పత్తి యూనిట్లు ఎంతో కాలంగా స్వావలంబన సాధిస్తున్నాయని, వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్నారని గుర్తు చేసింది. అలాంటి వాటిని ఏ బాధ్యతాయుత ప్రభుత్వమైనా మరింత బలోపేతం చేస్తుందని, కానీ మోడీ ప్రభుత్వం మాత్రం వాటిని ప్రయివేటుకు అప్పగించాలని చూస్తోందని కాగ్‌కు రాసిన లేఖలో పీపుల్స్ కమిషన్ విమర్శించింది.

సభా హక్కుల కమిటీ కార్యకలాపాలపై సుప్రీం స్టే

- బిజెపి ఎంపి ఫిర్యాదు నేపథ్యంలో ఆదేశాలు

న్యూఢిల్లీ : బిజెపి ఎంపి సుకాంత మజుందార్ ఇచ్చిన ఫిర్యాదుపై పశ్చిమ బెంగాల్ చీఫ్ సెక్రటరీ, ఇతర అధికారులను సమన్లు జారీ చేసిన లోక్‌సభ సభా హక్కుల కమిటీ కార్యకలాపాలపై సుప్రీం కోర్టు సోమవారం స్టే విధించింది. ఆ అధికారులను తన ఎదుట హాజరు కావాలని ప్రివిలేజెస్ కమిటీ సమన్లు జారీ చేసింది. తనపై అనుచితంగా ప్రవర్తించారని, ప్రాణాపాయం కలిగించేలా గాయపరిచారని బిజెపి ఎంపి వారిపై ఫిర్యాదు చేశారు. లోక్‌సభ సెక్రటేరియట్‌కు కూడా చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తృణమూల్ నేత అత్యాచారాలపై మహిళలు ఆందోళన చేస్తున్న సందేశ్‌ఖలికి మజుందార్ వెళుతున్న సమయంలో ఆపడంతో పోలీసు సిబ్బందితో తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. ఆ ఘర్షణలో మజుందార్ గాయపడ్డారు. సుప్రీం స్టేతో చీఫ్ సెక్రటరీ, ఇతర అధికారులు ఊపిరి పీల్చుకున్నట్లయింది. లేని పక్షంలో సోమవారం వారు సభా హక్కుల కమిటీ ముందు హాజరవ్వాల్సి వుంది. వారికి సమన్లు జారీ చేసిన సభా హక్కుల కమిటీకి గల పరిధిని అధికారుల తరపు న్యాయవాది కపిల్ సిబల్, ఎ.ఎం.సింఘ్వీలు ప్రశ్నించారు. నాలుగు వారాల తర్వాత దీనిపై విచారణకు కోర్టు నిర్ణయించింది.

మరోసారి ఇడి విచారణకు హాజరుకాని కేజ్రీవాల్

స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)
ఏదైతే, దిగువసంతకందారు టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలను సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరడమైనది. రుణగ్రహీత, మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువసంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ పేర్కొన్న చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది. ప్రత్యేకించి రుణగ్రహీత, మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి దిగువ పేర్కొన్న మొత్తాలను మరియు డిమాండ్ నోటీసు తేది నుండి దానిపై వడ్డీ మరియు ఫైనల్ వడ్డీ, చార్జీలు, ఖర్చులు మొ॥వాటిని చెల్లించుటకు లోబడి ఉంటుంది.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

క్ర. సం	లోన్ ఎకౌంట్ నం	అబ్లిగర్స్/చట్టబద్ద వారసులు/ చట్టబద్ద ప్రతినిధుల పేరు	మొత్తం మరియు డిమాండ్ నోటీసు తేది	సెక్షన్ 13(4) క్రింద స్వాధీనతా తేది
1	TCHHL0803000100088817	శ్రీ.తాడిబోయిన లక్ష్మీనారాయణ రుణగ్రహీత మరియు శ్రీ.తాడిబోయిన సాంబశివరావు (సహ-రుణగ్రహీత)	29.10.2023 నాటికి మొత్తం రూ॥21,79,529/- (ఇరవై ఒక్క లక్షల డెభై తొమ్మిది వేల ఐదు వందల ఇరవై తొమ్మిది రూపాయలు మాత్రమే)	16 ఫిబ్రవరి, 2024
స్థిరాస్తులు/సెక్యూర్డ్ అసెట్స్ వివరణ : ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-522019, గుంటూరు జిల్లా, చౌడవరం గ్రామం, ప్రస్తుత గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని చౌడవరం గ్రామ పంచాయతీ ఏరియా, ప్లాట్ నం.93, 94 యొక్క మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.లు.412/ఎ, 412/బి, 413/ఎ, 413/బి, 413/సి, 413/డి, 414/2, ప్లాట్ నం.93 యొక్క 1వ అంశం విస్తీర్ణం 150 చ.గ.లు. తో సరిహద్దులు : తూర్పు : ప్లాట్ నం.97 సరిహద్దు 27-0, దక్షిణం : ప్లాట్ నం.92 సరిహద్దు 50-0, పడమర : 40 అ.లు. వెడల్పు మున్సిపల్ రోడ్డు సరిహద్దు 27-0, ఉత్తరం : ప్లాట్ నం.94 సరిహద్దు 50-0. ఈ సరిహద్దుల మధ్య ఓపెన్ సైట్ పరిధి 150 చ.గ.లు. లేదా 125-41 చ.మీ.లు. ప్లాట్ నం.94 యొక్క 2వ అంశం విస్తీర్ణం 150 చ.గ.లు.తో సరిహద్దులు : తూర్పు : ప్లాట్ నం.96 సరిహద్దు 27-0, దక్షిణం : ప్లాట్ నం.93 సరిహద్దు 50-0, పడమర : 40 అ.లు. వెడల్పు మున్సిపల్ రోడ్డు సరిహద్దు 27-0, ఉత్తరం : ప్లాట్ నం.95 సరిహద్దు 50-0. ఈ సరిహద్దుల మధ్య ఓపెన్ సైట్ పరిధి 150 చ.గ.లు. లేదా 125-41 చ.మీ.లు. 1వ మరియు 2వ అంశం మొత్తం విస్తీర్ణం 300 చ.గ.లు. ఓపెన్ సైట్.				
2	TCHHL0803000100084406	శ్రీ.చెన్న్వ సాయి కృష్ణ రుణగ్రహీత మరియు శ్రీ.సిహెచ్.హనుమంతరావు (సహ రుణగ్రహీత)	17.11.2023 నాటికి మొత్తం రూ.48,08,316/- (నలభై ఎనిమిది లక్షల ఎనిమిది వేల మూడు వందల పదహారు రూపాయలు మాత్రమే)	16 ఫిబ్రవరి, 2024
స్థిరాస్తులు/సెక్యూర్డ్ అసెట్స్ వివరణ : ఎ.పి., కృష్ణాజిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రీ-521165, తోట్లవల్లూరు మండలం, పెనమలూరు గ్రామ పంచాయతీ ఏరియా, పెనమాకూరు గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ రెసిడెన్షియల్ సైట్ పరిధిలో 520 చ.గ.లు. లేదా 434.72 చ.మీ.లు. తో అన్నీ సౌలభ్య హక్కులు. 30 చ.గ.లు. కొరకు అంశం నం.1; 490 చ.గ.లు. కొరకు అంశం నం.2, శ్రీ.చెన్న్వ సాయికృష్ణ పేరు మీద ఉన్న రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.5796/2015 మొత్తం సైట్ విస్తీర్ణం 520 చ.గ.లు. మరియు క్రింది విధమైన హద్దులు : సరిహద్దులు : 1వ అంశం : తూర్పు : ప్రక్య శ్రీనివాస శర్మ మరియు ఇతరుల ఆస్తి, దక్షిణం : కోడె వెంకటేశ్వరరావు ఆస్తి, పడమర : కనకమేడల కోనరాజు ఆస్తి, ఉత్తరం : 2వ అంశం. 2వ అంశం : తూర్పు : ప్రక్య పట్టాభి రామ శర్మ మరియు ఇతరుల ఆస్తి, దక్షిణం : 1వ అంశం, కనకమేడల కోనరాజు ఆస్తి, పడమర : కనకమేడల కోనరాజు ఆస్తి, ఉత్తరం : ఎనిగళ్ల సూర్యనారాయణ ఆస్తి.				
3	10382816	శ్రీమతి. భూలక్ష్మి సంద్రు రుణగ్రహీత మరియు శ్రీ.రామాంజనేయ (సహ రుణగ్రహీత)	27.10.2023 నాటికి మొత్తం రూ.16,48,637/- (పదహారు లక్షల నలభై ఎనిమిది వేల ఆరు వందల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే)	16 ఫిబ్రవరి, 2024
స్థిరాస్తుల/సెక్యూర్డ్ అసెట్స్ వివరణ : గుంటూరు జిల్లా, ఎస్ఆర్ఓ మంగళగిరి-522503, మంగళగిరి మండలం, నవులూరు గ్రామం మరియు గ్రామ పంచాయతీ, ప్లాట్ నం.10, డో.నం.4-486 సర్వే నం.777/4 లో శ్రీమతి. సంద్రు భూలక్ష్మి పేరు మీద ఉన్న వైడ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.15596/2018 మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ పరిధి 166 చ.గ.లు. లేదా 138.7 చ.మీ.లు. బయట భాగం 332.5 చ.గ.లు. మరియు క్రింది విధమైన హద్దులు : సరిహద్దులు : తూర్పు : బి.కృష్ణారెడ్డి 67 అ.లు., దక్షిణం : డొంక రోడ్డు 22.5 అ.లు., పడమర : సరసు మదన్‌కుమార్ స్థలం 66 అ.లు., ఉత్తరం : లే అవుట్ రోడ్డు 22.5 అ.లు.				

ప్రదేశం: ముంబై
తేది: 20 ఫిబ్రవరి, 2024
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున

యుపిలో కాంగ్రెస్‌కు 15 ఎంపి స్థానాలు

- సమాజ్‌వాదీ పార్టీ

లక్నో : పొత్తులో భాగంగా ఉత్తర ప్రదేశ్‌లో 15 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్‌కు కేటాయిస్తామని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) వర్గాలు తెలిపాయి. ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తెలిపినట్లు సోమవారం పేర్కొన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో యుపిలోని అమేథీ నియోజకవర్గంలో స్మృతి ఇరానీ చేతిలో రాహుల్‌గాంధీ ఓటమి పాలవగా, రాయ్‌బరేలిలో కాంగ్రెస్ గెలుపొందింది. ఆ రెండు స్థానాల్లోనూ ఎస్‌పి అభ్యర్థులను నిలపలేదు. ఈసారి కాంగ్రెస్‌కు రాష్ట్రంలో 15 సీట్లు కేటాయిస్తామని స్పష్టం చేసినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఈ విషయమై కాంగ్రెస్ పార్టీ స్పందించాల్సి వుంది. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతోంది. ఈనెల 16న వారణాసిలో ప్రవేశించిన యాత్ర.. 21 వరకు కొనసాగనుంది. ప్రస్తుతం సీట్ల పంపకాలపై కాంగ్రెస్‌తో తమ పార్టీ చర్చలు జరుపుతోందని, సీట్ల పంపకాలు పూర్తయ్యాక భారత్ జోడో యాత్రలో పాల్గొంటానని అఖిలేష్‌యాదవ్ ఇప్పటికే ప్రకటించారు.

'ఎన్‌సిపి-శరద్‌చంద్ర పవార్' ఉపయోగించుకోవచ్చు

- సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకూ 'నేషనల్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌సిపి) - శరద్‌చంద్ర పవార్' పేరును ఉపయోగించుకోవచ్చునని శరద్ పవార్ గ్రూపునకు సుప్రీంకోర్టు సోమవారం తెలిపింది. అజిత్ పవార్ గ్రూపుదే అసలైన ఎన్‌సిపి అని ఈ నెల 7న ఎన్నికల కమిషన్ ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ శరద్ పవార్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. శరద్ పవార్ గ్రూపు పిటిషన్‌ను జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ కెవి విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ నెల 26 నుంచి మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయని, తమ గ్రూపునకు ఎలాంటి పేరు, పార్టీ గుర్తింపు లేకుండా ఉంటుందని శరద్ పవార్ తరుపు న్యాయవాదులు ధర్మాసనం ముందు తెలిపారు. పార్టీ గుర్తు కేటాయింపు కోసం ఎన్నికల కమిషన్ వద్దకు వెళ్లాలని వారికి తెలిపింది. పార్టీకి గుర్తు కేటాయింపుపై ఒక వారంలో నిర్ణయం తీసుకోవాలని ఇసిని సుప్రీంకోర్టు ఆదేశించింది. మరాఠా కోటాపై మహారాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేకంగా ఒకరోజుపాటు సమావేశం కానుంది.

నేను పార్టీ మారడం లేదు

- మధ్యప్రదేశ్ మాజీ సిఎం కమల్‌నాథ్

భోపాల్ : తాను బిజెపిలో చేరడం లేదని, కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ తెలిపారు. ఆయన కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్లు మూడు రోజులుగా జోరుగా ప్రచారం జరుగుతున్న నేపత్యంలో సోమవారం ఆయన స్పందించారు. న్యూఢిల్లీలోని నివాసంలో తన మద్దతుదారులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన ఈ మేరకు ప్రకటించారు. కమల్ నాథ్ బిజెపిలో చేరడం లేదని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితు పట్వారీ ఆదివారం తెలిపారు. కమల్‌నాథ్ చింధ్వారా నుంచి తొమ్మిది సార్లు ఎంపీగా చేశారు. ప్రస్తుతం అదే చింధ్వారా ఎమ్మెల్యేగా ఉన్నారు. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమితో కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనను పిసిసి అధ్యక్ష పదవి నుంచి తప్పించింది. ఈ నేపథ్యంలోనే కుమారుడితో కలిసి ఆయన బిజెపిలో చేరబోతున్నారంటూ ప్రచారం జరిగింది.

బిజెపిలో కాంగ్రెస్ నేత చేరిక

జైపూర్ : నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజస్థాన్ మాజీ మంత్రి మహేంద్రజిత్ సింగ్ మాలవీయ బిజెపిలో చేరారు. సోమవారం ఉదయం బిజెపి కార్యాలయానికి చేరుకున్న ఆయన రాజస్థాన్ బిజెపి ఇన్‌ఛార్జ్ అరుణ్ సింగ్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఆదివారం ఢిల్లీలో బిజెపి చీఫ్ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలతో సమావేశమైనట్లు మాలవీయ తెలిపారు.

రెండు రోజుల్లో పొత్తుపై ప్రకటన : కమల్‌హాసన్

చెన్నై : రెండు రోజుల్లో పొత్తుపై ప్రకటన చేస్తామని మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) అధ్యక్షుడు, ప్రముఖ హీరో కమల్‌హాసన్ తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల్లో శుభవార్తతో మిమ్మల్ని కలుస్తానని అన్నారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన పనులు బాగా జరుగుతున్నాయని, మంచి అవకాశాలు వస్తాయని ఆశిస్తున్నానని అన్నారు. పొత్తుకు సంబంధించి రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు. తాజా చిత్రం 'థగ్ లైఫ్' ప్రిపరేషన్ వర్క్స్ కోసం ఆమెరికా వెళ్లిన ఆయన సోమవారం ఉదయం చెన్నై చేరుకున్నారు.

నూతన ఆర్మీ వైస్ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ : నూతన ఆర్మీ వైస్ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ద్వివేది నార్తర్న్ ఆర్మీ కమాండర్‌గా విధులు నిర్వహించారు. లెఫ్టినెంట్ జనరల్ ఎంవి.సుచీంద్ర కుమార్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. ప్రస్తుతం ఎంవి సుచీంద్ర కుమార్ ఉదంపూర్ ఆధారిత నార్తర్న్ కమాండింగ్ జనరల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే మే 31న పదవీ విరమణ అనంతరం ఆయన స్థానంలో ద్వివేది నియమితులు కావాల్సి ఉంది.

కేసు ఉపసంహరించుకుంటేనే అప్పు!

- కేంద్రం షరతుకు కేరళ తిరస్కరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రుణ పరిమితిలో కోతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన ఒరిజినల్ వ్యాజ్యాన్ని ఉపసంహరించుకుంటేనే ఎక్కువ రుణాలు తీసుకునేందుకు అనుమతిస్తామన్న కేంద్ర ప్రభుత్వ షరతును కేరళ తిరస్కరించింది. కేసు ఉపసంహరించుకుంటే మరో రూ.13,600 కోట్లు అప్పు తీసుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే న్యాయమైన హక్కుల కోసమే న్యాయ పోరాటమని, దావాను ఉపసంహరించుకోబోమని రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టులో స్పష్టం చేశారు. దీనిని అనుసరించి, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం కేరళ ఒరిజినల్ పిటిషన్, మధ్యంతర ఉపశమనం కోరుతూ చేసిన పిటిషన్‌పై వివరణాత్మక విచారణను మార్చి 6, 7 తేదీల్లో నిర్వహిస్తామని ప్రకటించింది. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల్లో అక్రమంగా జోక్యం చేసుకుంటూ రుణ పరిమితిని కేంద్ర ప్రభుత్వం తగ్గించడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేరళ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. రూ.26,000 కోట్లు అత్యవసరంగా రుణం తీసుకోవడానికి అనుమతించాలని కేరళ ప్రత్యేక పిటిషన్‌ను కూడా దాఖలు చేసింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత గురువారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపింది.

అయితే.. ఎక్కువ మొత్తంలో రుణం తీసుకునేందుకు అనుమతినివ్వాలంటే.. ముందుగా సుప్రీంకోర్టులో కేరళ వేసిన కేసును ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రతికూల వైఖరిని అవలంభించిందని ఆ చర్చలోని అంశాన్ని కపిల్ సిబల్ ఎత్తిచూపారు.

కేసు ఉపసంహరించుకుంటే రూ.13,600 కోట్లు రుణం తీసుకునేందుకు వీలుంటుందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం, కేరళ మరో రూ.11,731 కోట్లు రుణం తీసుకోవచ్చు. ఎక్కువ డబ్బు తీసుకునేందుకు వీలుగా కేసు ఉపసంహరించుకోవాలని షరతు పెట్టడం ఆమోదయోగ్యం కాదు. ఇంధన రంగ అవసరాల కోసం అన్ని ఇతర రాష్ట్రాలు రూ.5,000 కోట్ల వరకు రుణం తీసుకునేందుకు అనుమతించారు. అయితే, కోర్టు కేసు కారణంగా కేరళకు మాత్రమే అనుమతి ఇవ్వలేదు' కపిల్ సిబల్ వాదించారు.

కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్ వెంకటరామన్ వాదనలు వినిపిస్తూ.. కేంద్ర ప్రభుత్వ చర్యలను చట్టపరంగా ప్రశ్నించిన తరువాత మరిన్ని రుణాలు తీసుకునేందుకు కేరళ అనుమతి కోరడం సరికాదన్నారు. మార్గదర్శకాలకు మించి రుణం తీసుకునే హక్కును కేరళ డిమాండ్ చేస్తోందన్నారు. కేసు, చర్చ పరస్పర విరుద్ధం కాదని, సుప్రీంకోర్టును ఆశ్రయించకముందే కేరళ అనుమతించిన పరిమితి కంటే ఎక్కువ రుణం తీసుకుందని వాదించారు. దానికి తోడు ఇంకా ఎక్కువ రుణాలు తీసుకునేందుకు అనుమతించాలని కోరుతుందని అన్నారు. అంతకంటే ముందు కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు తీవ్ర వాగ్వివాదానికి దిగడంతో ధర్మాసనం జోక్యం చేసుకుంది. ఈ అంశంపై కేంద్రం, రాష్ట్రానికి మధ్య రాజీలేని వాగ్వివాదం చోటుచేసుకున్న నేపథ్యంలో అవసరమైన జోక్యం చేసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది. ఇది సంక్లిష్టమైన ఆర్థిక అంశం కాబట్టి, కోర్టు జోక్యం చేసుకోవడానికి కొన్ని పరిమితులు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగం, మార్గదర్శకాల ప్రకారం తమకు దక్కాల్సిన హక్కును మాత్రమే అడుగుతున్నానని సిబల్ పునరుద్ఘాటించారు. దీంతో తదుపరి విచారణను మార్చి 6, 7 నాటికి ధర్మాసనం వాయిదా వేసింది.

'శ్రీకృష్ణుడు కూడా భ్రష్టుడై ఉండేవాడు'

- సుప్రీం కోర్టు ఎలక్టోరల్ బాండ్ల తీర్పుపై మోడీ అక్కసు

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం తన అక్కసునంతా వెళ్లగక్కారు. ఎలక్టోరల్ బాండ్లను రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుణకు వ్యతిరేకంగా మోడీ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారు. 'ఈరోజు కుచేలుడి ఆరోపణలు స్వీకరించి ఉంటే కృష్ణుడిని కూడా అవినీతిపరుడే' అని చెప్పేవారేమో అని మోడీ సుప్రీం కోర్టుపై పరోక్షంగా దాడి చేశారు. ఈ వీడియోతో ఎవరైనా ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేస్తే, అది అవినీతిగా కోర్టు తీర్పు ఇస్తుందని ప్రధాని అన్నారు. కల్కిధామ్ ఆలయానికి శంకుస్థాపన చేసిన అనంతరం ప్రధాని మాట్లాడుతూ,కోర్టు తీర్పును అపహాస్యం చేశారు. రాజకీయ పార్టీలకు విరాళాలు సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని రద్దు చేస్తూ గత వారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని, అనామక విరాళాల పద్ధతి పార్టీలకు ఎవరు డబ్బు ఇస్తున్నారో తెలుసుకునే పౌరుల హక్కును ఉల్లంఘిస్తుందని పేర్కొంది. 2016లో నోట్ల రద్దు తర్వాత కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ ద్వారా ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టింది. 2017లో ఆర్థిక చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టం, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం, రిజర్వు బ్యాంకు చట్టం, ఆదాయపు పన్ను చట్టాలను హడావుడిగా సవరించి ఇందుకు రంగం సిద్ధం చేశారు.రూ.1000, రూ.10,000, రూ.10 లక్షలు, కోటి రూపాయల బాండ్లను జారీ చేస్తారు. వీటిని స్వీకరించే రాజకీయ పార్టీలు 15 రోజుల్లోగా బాండ్లను బ్యాంకుకు సమర్పించి, నగదుగా మార్చుకోవాలని చెప్పింది. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ చట్టబద్ధతను ప్రశ్నిస్తూ సిపిఐ(ఎం), అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, సుప్రీం కోర్టు పైన పేర్కొన్న విధంగా చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది.

ఎవర్ని వంచించడానికి ఈ ఉపమానాలు.. మోడీ వ్యాఖ్యలపై ఎంఎ బేబీ విమర్శలు

ఎలక్టోరల్ బాండ్ల విషయంపై సుప్రీం కోర్టులో తగిలిన ఎదురు దెబ్బను కప్పిపుచ్చేకునేందుకే ప్రధానమంత్రి మోడీ శ్రీకృష్ణుడి ఉపమానాన్ని ఉపయోగించారని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ విమర్శించారు. నిజానికి ఈ ఉపమానంతో శ్రీకృష్ణున్ని మోడీ అవమానించారని అన్నారు. కార్పొరేట్లకు సేవకుడిగా పరిపాలన చేస్తున్న మోడీ కృష్ణుడు కూడా తనకు మాదిరిగానే అవినీతిపరుడు అని చెబుతున్నారని బేబీ పేర్కొన్నారు. అలాగే మోడీ తనకు తాను ఒక రాజుగా భావించుకుంటున్నారని విమర్శించారు. అదానీ, అంబానీ వంటి వ్యాపారవేత్తల నుంచి ఎన్నికల బాండ్లు తీసుకుని వారికి మళ్లీ తిరిగి ఎయిర్‌పోర్టులు, ఓడరేవులు, చమురు వ్యాపారం, టెలికాం సంస్థలు ఇవ్వడానికి మోడీ రాజు కాదని బేబీ స్పష్టం చేశారు.

కర్ణాటక సిఎంపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ వద్దు

- సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై క్రిమినల్ కార్యకలాపాలు చేపట్టకుండా సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. పాలక పక్షానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన సాగించడమనేది ప్రతి పౌరుని ప్రాథమిక హక్కని ఆయన వాదించిన నేపథ్యంలో సుప్రీం నిర్ణయం వెలువడింది. 2022లో నిరసన ప్రదర్శన సందర్భంగా అప్పటి బిజెపి ప్రభుత్వాన్ని భయపెట్టేందుకు, నేరపూరితంగా బలాన్ని ఉపయోగించే లక్ష్యంతోనే చట్టవిరుద్ధంగా గుమిగూడారంటూ సిద్ధరామయ్య, మరో 35 మందిపై చార్జిషీట్ దాఖలైంది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ మంత్రి ఈశ్వరప్ప రాజీనామా చేయాలని కోరుతూ అప్పట్లో ప్రదర్శన నిర్వహించారు. భావ ప్రకటనా స్వేచ్ఛ కలిగిన ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలియజేయడమనేది ప్రాథమిక హక్కు. అని, ఎలాంటి నేరపూరితమైన ఉద్దేశం లేకుండా శాంతియుతంగా ఆందోళన నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోలేరని సిద్ధరామయ్య తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ఎ.ఎం.సింఘ్వి వాదించారు. కేవలం వాహనాల రాకపోకలను అడ్డగించారన్న ఆరోపణలతో ఆందోళనకారులపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ చేపట్టలేరని సిబల్ పేర్కొన్నారు. శాంతి భద్రతల ఉల్లంఘన పేరుతో ప్రాథమిక హక్కుల ప్రక్రియపై శిక్షార్హమైన చర్యలు తీసుకుంటున్నారని వాదించారు.క్రిమినల్ కేసును కొట్టివేయడానికి కర్ణాటక హైకోర్టు ఈ నెల 2న తిరస్కరించడంతో నేతలు సుప్రీంను ఆశ్రయించారు.

యుపిలో ఎస్మా ప్రయోగం

- ఆరు నెలల పాటు సమ్మెలు, నిరసనలపై నిషేధం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కార్మిక, ఉద్యోగ సంఘాలు

లక్నో : హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో అన్నదాతల ఆందోళనల నేపథ్యంలో నిరసనలపై ఉక్కుపాదం మోపేందుకు ఉత్తరప్రదేశ్‌లోని యోగి అదిత్యనాథ్ ప్రభుత్వం ముందస్తు అణచివేత చర్యలకు దిగింది. పాత ఫించను విధానం పునరుద్ధరణ కోసం కార్మిక , ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు ఉద్యమించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో యోగి ప్రభుత్వం అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టాన్ని (ఎస్మాను) ప్రయోగించింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, కార్పొరేషన్లలోని ఉద్యోగులు, అధికారులు సమ్మెలు, నిరసనలు చేయడంపై ఆరు నెలలు పాటు నిషేధం విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి (ఎసిఎస్) దేవేశ్ చతుర్వేది సోమవారం ఒక నోటిఫికేషన్ విడుదల చేశారు. 'ఉత్తరప్రదేశ్ ఎస్మా 1966లో

సెక్షన్-3లో సబ్ సెక్షన్ 1 ప్రకారం ఈ నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి ఈ నిషేధం ఆరు నెలల పాటు అమలులో ఉంటుందన్నారు.

ఈ అప్రజాస్వామిక చర్యను తాము వ్యతిరేకిస్తామని కార్మిక, ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. సిఐటియు ప్రధాన కార్యదర్శి ప్రేమ్ నాథ్ రాయ్ మీడియాతో మాట్లాడుతూ ఇటువంటి బెదిరింపులకు తాము భయపడేది లేదన్నారు. 'నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కనీస వేతనం, రైతులకు ఎంఎస్‌పి వంటి నిజమైన సమస్యలపై దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేయాలని సిఐటియు, సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయించుకున్నాయి.

ఈ ఎస్మా నోటిఫికేషన్‌ను యుపి రాజ్య విద్యుత్ కర్మచారిస్ సంయుక్త్ సంఘర్ష్ సమితి కన్వీనర్ శైలేంద్ర దూబే అసంబద్ధంగా విమర్శించారు. 'సాధారణంగా ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను తీసుకొని వస్తుంది. అయితే ఇక్కడ ఉద్యోగులు ఎలాంటి సమ్మె నోటీసు ఇవ్వలేదు' అని అన్నారు. ఉద్యోగుల ప్రజాస్వామిక హక్కులను కాలరాసే ప్రయత్నంలో భాగంగానే ఎస్మాను తీసుకొచ్చారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఒపిఎస్ అంశంపై ఉద్యోగులు సమ్మె నోటీసు ఇస్తారనే భయంతోనే యోగి ప్రభుత్వం ఎస్మాను తీసుకొచ్చిందని తెలిపారు.

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల జాతీయ స్థాయి సంఘమైన రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఆర్‌ఎస్‌ఎం) జాతీయ అధికార ప్రతినిధి వీరేంద్ర మిశ్రా మీడియాతో మాట్లాడుతూ 'ఈ ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకి. కొన్ని ఏళ్లు నుంచి నిరసనలు చేస్తున్నా ఒపిఎస్‌ను పునరుద్దరించడంలేదు' అని విమర్శించారు. ఎస్మా లేదా సెక్షన్ 144 విధించిన మా ప్రజాస్వామ్య హక్కుల కోసం మేం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

29వేలు దాటిన పాలస్తీనా మృతులు

- పెరుగుతున్న ఆకలి కేకలు
- అత్యంత జనసాంద్రత కలిగిన ప్రాంతం రఫా : యునిసెఫ్
- ఇజ్రాయిల్ ఆక్రమణలకు ముగింపు పలకాలి
- అంతర్జాతీయ న్యాయ స్థానంలో పాలస్తీనా డిమాండ్

ది హేగ్ : పాలస్తీనా భూభాగాల ఆక్రమణకు తక్షణమే స్వస్తి చెప్పాలంటూ పాలస్తీనా ప్రతినిధులు కోరారు. ఇజ్రాయిల్ అమలు చేస్తున్న వర్ణ వివక్ష వ్యవస్థకు ముగింపు పలకాన్నారు. అంతర్జాతీయ న్యాయస్థానంలో సోమవారం ప్రారంభమైన విచారణల సందర్భంగా పాలస్తీనా విదేశాంగ మంత్రి రియాద్ అల్ మలికి, ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా దూత రియాద్ మన్సూర్‌లతోపాటు పలువురు విద్యా, న్యాయ నిపుణులు పాల్గొన్నారు. ఈ విచారణలు 26 వరకు సాగుతాయి. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికా వేసిన ఊచకోత కేసుతో సంబంధం లేకుండా జరుగుతున్న కేసు విచారణ ఇది. దశాబ్దాలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న పాలస్తీనా ప్రాంతాల ఆక్రమణకు న్యాయ, చట్టపరమైన పర్యవసానాలను నిర్ణయించేందుకు ఈ విచారణ చేపట్టారు. ఈ విచారణతో క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మారవచ్చని పాలస్తీనియన్లు ఆశాభావంతో వున్నారు.

24గంటల్లో 107మంది మృతి

గత 24గంటల్లో 107మంది పాలస్తీనియన్లు మరణించారు. దీంతో గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమంలో మృతుల సంఖ్య 29,092కి చేరుకుంది. 69,028మంది గాయపడ్డారు. మరోవైపు ఆపకుండా సాగుతున్న దాడులతో గాజాలో ఆకలి కేకలు ఉధృతమవుతున్నాయి. ఇజ్రాయిల్ బలగాలు తమపై కాల్పులు ప్రారంభించిన నేపథ్యంలో పారిపోవడానికి ముందు కూడా వందలాదిమంది పాలస్తీనియన్లు సహాయక ట్రక్కుల వైపునకు పరుగులు పెట్టకుంటూ వస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. ఖాన్ యూనిస్‌లోని నాసర్ ఆస్పత్రిలో ఎనిమిది మంది మృతి చెందినట్లు పాలస్తీనా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

అమానుషాలపై విశ్వసనీయ సమాచారం : ఐరాస

గాజాలో పాలస్తీనా మహిళలు, పిల్లలను నిర్బంధించడం, ఉరి తీయడం, లైంగిక దాడులు జరపడం వంటి అమానుష ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, వాటికి విశ్వసనీయమైన సమాచారం కూడా వుందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం తెలిపింది.

ఇజ్రాయిల్ బలగాలతో దిగ్బంధించబడిన రఫా నగరం ప్రస్తుతం ఈ భూమండలంపై గల అత్యంత జన సాంద్రత గల ప్రాంతాల్లో ఒకటిగా వుందని యునిసెఫ్ ప్రకటించింది. లక్షలాదిమంది ప్రజలు ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో ఈ నగరానికి తరలి వచ్చేశారు. ఇప్పుడు ఈ నగరాన్ని ఇజ్రాయిల్ సైన్యం లక్ష్యంగా చేసుకుంటున్న పరిస్థితుల్లో ముందుగా అక్కడి ప్రజానీకానికి రక్షణ కల్పించాల్సి వుందని, వారికి పారిపోవడానికి ఇక ఎక్కడా స్థలం లేదని యునిసెఫ్ పేర్కొంది.

ముగ్గురు సైనిక ఉన్నతాధికారులకు మరణశిక్ష

- మరో ముగ్గురికి జీవిత ఖైదు

యాన్‌గాంన్ (మయన్మార్) : మయన్మార్‌లో ముగ్గురు సైనిక ఉన్నతాధికారులకు అక్కడి జుంటా ప్రభుత్వం మరణశిక్ష విధించింది. మయన్మార్-చైనా సరిహద్దుల్లో ఉన్న లౌక్కై అనే పట్టణాన్ని తిరుగుబాటుదారులు గత నెలలో స్వాధీనం చేసుకున్నారు. లౌక్కై పట్టణాన్ని రక్షించడంలో విఫలం చెందారనే ఆరోపణలతో ఈ పట్టణ కమాండర్‌తో సహా ముగ్గురు బ్రిగేడియర్ జనరల్స్‌కు మరణశిక్ష విధించినట్లు స్థానిక మీడియా తెలిపింది.

ఇదే ఆరోపణలతో మరో ముగ్గురు బ్రిగేడియర్ జనరల్స్‌కు జీవిత ఖైదు విధించారు. ఈ విషయాన్ని కొంత మంది సైనిక అధికారులు కూడా ధ్రువీకరించారు. గత నెలలో షాన్ రాష్ట్రంలో ఉన్న లౌక్కై పట్టణాన్ని మయన్మార్ నేషనల్ డెమోక్రటిక్ అలయిన్స్ ఆర్మీ (ఎంఎన్‌డిఎఎ), అరకాన్ ఆర్మీ (ఎఎ), తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ (టిఎన్‌ఎల్‌ఎ) అనే తిరుగుబాటు కూటమి స్వాధీనం చేసుకుంది. జుంటా సైన్యం నుంచి ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకుని సైనికులను అక్కడ నుంచి వెళ్లిపోవడానికి అనుమతించింది. 2021లో మయన్మార్‌లోని ఆంగ్‌సాన్ సూకీ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని గద్దెంచి జుంటా సైన్యం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి జుంటా సైన్యానికి, తిరుగుబాటుదారులకు మధ్య పోరాటం సాగుతోంది. కీలకమైన లౌక్కై పట్టణాన్ని తిరుగుబాటుదారులు స్వాధీనం చేసుకోవడం జుంటా సైన్యానికి పెద్ద ఎదురుదెబ్బగా నిపుణులు భావిస్తున్నారు.

సుప్రీం తీర్పు ప్రకారమే 'అటవీ' నిర్వచనం

- సిజెఐ ధర్మాసనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భూమిని గుర్తించే ప్రక్రియలో 1996లో టిఎన్ గోదావర్మన్ తిరుమల్‌పాడ్ తీర్పులో పేర్కొన్న 'అటవీ' నిర్వచనం ప్రకారం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తప్పనిసరిగా వ్యవహరించాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అటవీ సంరక్షణ చట్టానికి 2023లో చేసిన సవరణలను సవాలు చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

పిటిషనరు తరపున సీనియర్ న్యాయవాదులు ప్రశాంత భూషన్, చంద్రసేన్ వాదనలు వినిపిస్తూ 2023 సవరణలోని సెక్షన్ 1ఎ గోదావర్మన్ తీర్పులో ఇచ్చిన 'అడవి' నిర్వచనం కుదించబడిందని, దీని ప్రకారం భూమిని అటవీగా నోటిఫై చేయాలని, ప్రభుత్వంలో ప్రత్యేకంగా అటవీగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ నిర్వచనాన్ని కుదించడం వల్ల దాదాపు 1.99 లక్షల చదరపు కిలోమీటర్ల అటవీ భూమి 'అటవీ' పరిధి నుండి బయటపడుతుందని అన్నారు. అడవులను అటవీయేతర వినియోగానికి మళ్లించబడుతున్న భూముల గురించి ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని సిజెఐ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. 'రూల్ 16 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పరిపాలన కసరత్తు పూర్తి చేయడానికి పెండింగ్‌లో ఉంది. గోదావర్మన్‌లోని ఈ కోర్టు తీర్పులో స్పష్టంగా వివరించబడిన సూత్రాలను తప్పనిసరిగా పాటించాలి. 16వ నిబంధనలో నిపుణుల కమిటీ గుర్తించాల్సిన అటవీ, వంటి ప్రాంతాలు, వర్గీకరించని అటవీ భూములు, కమ్యూనిటీ ఫారెస్ట్ భూములు ఉంటాయి. అందువల్ల గోదావర్మన్ తీర్పులో వివరించిన విధంగా 'అటవీ' అనే వ్యక్తీకరణ పరిధికి అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి' అని పేర్కొంది. ఈ ఆర్డర్‌కు సంబంధించి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సర్క్యులర్‌ను జారీ చేయాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది. ఈ ఉత్తర్వు తేదీ నుండి రెండు వారాల వ్యవధిలో రాష్ట్రాలు ఏర్పాటుచేసిన నిపుణుల కమిటీలతో అడవులుగా గుర్తించబడిన భూమికి సంబంధించిన సమగ్ర రికార్డును అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వం తమకు అందించాలని ధర్మాసనం ఆదేశించింది. నిపుణుల కమిటీల నివేదికలను మార్చి 31లోగా ఫార్వార్డ్ చేయడంతో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తప్పనిసరిగా ఆదేశాలను పాటించాలని, ఈ రికార్డులు ఏప్రిల్ 15 నాటికి అధికారిక వెబ్‌సైట్‌లో డిజిటలైజ్ చేయాలని, అందుబాటులో ఉంచాలని సూచించింది.

2023 రూల్స్‌లోని రూల్ 16 ప్రకారం ఏర్పాటైన నిపుణుల కమిటీలు గోదావర్మన్ తీర్పు ప్రకారం ఏర్పాటైన మునుపటి నిపుణుల కమిటీలు చేసిన పనిని దృష్టిలో ఉంచుకోవాలి. అయితే, 2023 నిబంధనల ప్రకారం ఏర్పడిన నిపుణుల కమిటీలకు రక్షణకు అర్హమైన అటవీ భూముల పరిధిని విస్తరించేందుకు స్వేచ్ఛ ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ముందస్తు అనుమతి లేకుండా అటవీ భూములను జంతుప్రదర్శనశాలలు, సఫారీలకు తెలియజేయకూడదని పేర్కొంది. తదుపరి విచారణ జులైకు వాయిదా వేసింది.

రేషన్ షాపులు పునఃప్రారంభించాలని పుదుచ్చేరిలో సిపిఎం ఆందోళన

పుదుచ్చేరి : రేషన్ షాపులను పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ పుదుచ్చేరిలో రాత్రి, పగలు మొత్తం రోజంతా సిపిఎం ఆందోళన నిర్వహించింది. ఇక్కడి కొక్కు పార్క్ వద్ద ఉన్న పౌర సరఫరాల కార్యాలయం ఎదురుగా జరిగిన నిరసనలో సిపిఎం కార్యదర్శి ఆర్ రాజంగం ప్రసంగించారు. రేషన్ షాపులను పునఃప్రారంభించాలని రెండున్నర ఏళ్లుగా తమ పార్టీ పోరాటం చేస్తుందని చెప్పారు. 'ప్రజలంతా నగదుకు బదులుగా బియ్యం కోరుకుంటున్నారు. కాబట్టి ఒక పగలు, ఒక రాత్రి ఆందోళన ద్వారా ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది' అని తెలిపారు. 2021 ఎన్నికల ప్రచారంలో రేషన్ షాపులను పునఃప్రారంభిస్తామని అఖిల భారత ఎన్‌ఆర్ కాంగ్రెస్ నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్ రంగసామి ప్రజలకు హామీ ఇచ్చినా, ఆయన నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా మేనిఫెస్టోలు ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

నైతికతను ప్రశ్నించడం వంటి అంశాల్లో మహిళలపై అసభ్యకర విమర్శలు చేస్తున్నారని తెలిపారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ నాయకులు పి దుర్గాభవాని, వనజ మాట్లాడుతూ.. మహిళలపై జరిగే అత్యాచారాలు, వేధింపులు, లైంగిక నేరాలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ఫాస్ట్‌ట్రాక్ వంటి కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు మద్యంను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. శ్రామిక మహిళలకు ఇఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రసూతి సెలవులతోపాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. సంచార జాతుల మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి ప్రత్యేకంగా సదుపాయాలను కల్పించాలని జామాయితీ మహిళా విభాగం నాయకులు ఖైతాన్ సల్మా కోరారు. వీరికి ఓటు హక్కు, రేషన్ కార్డు, ఇంటి సదుపాయం వంటి సదుపాయాలతోపాటు ప్రత్యేక సదుపాయాలు ఉండేలా పథకాలు కల్పించాలని కోరారు. మహిళలకు ఇంటి దగ్గరలో ఉపాధి కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వాసవ్య మహిళా మండలి నాయకులు కీర్తి కోరారు. మనోవర్తి కేసుల్లో మహిళలు పరిష్కారం పొందలేకపోతున్నారని, వీటిని సమూలంగా మార్చాలని న్యాయవాది దీప్తి కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె శ్రీదేవి, డి శ్రీనివాసకుమారి, హేమలత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు ఉద్యోగుల సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎఇ ఎం.అనూషను, సచివాలయ మౌలిక సదుపాయల కార్యదర్శులు వి.నాగరామ కోటయ్య, ఎం.శ్రుతి కీర్తనలను సస్పెండ్ చేశామని తెలిపారు. వాల్‌ఆపరేటర్ చెంచయ్యను విధుల నుండి తొలగించామని తెలిపారు. పర్యవేక్షణ లోపం ఉన్నందున ఇఇ కె.కోటేశ్వరరావుకు షోకాజ్ నోటీసు జారీ చేశామని చెప్పారు. ఈ ప్రాంతాల్లో డ్రెయిన్ల పూడిక తొలగింపులో నిర్లక్ష్యం, పారిశుధ్య పనుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రాము, శానిటేషన్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు ఎన్.అంజనేయులు, డి.వెంకట సురేష్‌లను సస్పెండ్ చేశామని తెలిపారు. శానిటేషన్ సూపర్‌వైజర్ ఆయుబ్ ఖాన్ పర్యవేక్షణ లోపంపై షోకాజ్ నోటీసు జారీ చేశామని చెప్పారు.

డయేరియా బాధితులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి పరామర్శ

ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను జిల్లా జడ్జి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి సోమవారం పరామర్శించారు. 'ఎలా ఉన్నారు. ఆసుపత్రికి వచ్చి ఎన్ని రోజులు అయింది. వాంతులు, విరోచనాలు తగ్గాయా? వైద్యులు చూస్తున్నారా? ఇప్పుడు ఆరోగ్యం ఎలా ఉంది? అంటూ అడిగి తెలుసుకున్నారు. రోగుల సహాయకులతో కూడా జడ్జి మాట్లాడారు. ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు, సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆషా సజని ఆమె వెంట ఉన్నారు.

కొనసాగుతున్న డయేరియా కేసులు

డయేరియా లక్షణాలతో ఇప్పటి వరకు నలుగురు మృతి చెందగా, దాదాపు 250 మంది ఆస్పత్రుల పాలయ్యారు. సోమవారం సాయంత్రానికి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో 50 మంది చికిత్స పొందుతున్నారు. వాంతులు, విరోచనాలతో మరో ఆరుగురు ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. ఆదివారం సాయంత్రం వరకు 51 మంది చికిత్స పొందుతుండగా, వారిలో ఏడుగురు డిశ్చార్జి అయ్యారు. నగరంలోని ప్రయివేటు ఆస్పత్రులకు కూడా డయేరియా బాధితులు వస్తున్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్లపై దాడులు

నగరపాలక సంస్థ అధికారులు సోమవారం సాయంత్రం నగరంలోని వాటర్ ప్లాంట్లపై దాడులు నిర్వహించారు. మినరల్ వాటర్ పేరుతో సరఫరా చేస్తున్న తాగునీటిలో బ్యాక్టీరియా ఉందని నివేదికలు రావడంతో అధికారులు ఈ చర్యలు చేపట్టారు. కొన్ని వాటర్ ప్లాంట్లను సీజ్ చేశారు. ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తూ నిర్దేశిత ప్రమాణాలు పాటించకుండా నీటి విక్రయాలు చేసే మినరల్ వాటర్ ప్లాంట్లపై కఠిన చర్యలు తప్పవని నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. అనధికారికంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లను ఆమె ఆదేశాల మేరకు ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, పోలీసులు మూయించారు. శ్రీనగర్‌లోని సాయి ఫ్లేవర్స్ వాటర్ ప్లాంట్, కాకుమానువారితోటలోని బ్లూ డ్రాప్స్, శారదా కాలనీ మెయిన్ రోడ్‌లోని శ్రీ తేజశ్రీ ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, ఐపిడి కాలనీ మెయిన్ రోడ్‌లోని లిల్లీ మినరల్ వాటర్ ప్లాంట్, అనురాధ వాటర్ ప్లాంట్, ఎన్‌జిఒ కాలలోని సప్తగిరి ఎంటర్ ప్రైజెస్‌లను సీజ్ చేశారు.

మీ కోసం

తులసి ఆకులు నీళ్లలో వేసుకొని ప్రతిరోజూ తాగుతుంటే గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.

జీవన సౌరభం

విజయం కోసం ప్రయత్నించడమే జీవితం కాకూడదు. విలువల కోసం జీవించడమే జీవిత లక్ష్యం కావాలి.

చిట్టి పాపాయి

చిన్నారి చిట్టి పాపాయి
చిట్టి గౌను వేసింది
బుట్టబొమ్మలా తయారైంది

కళ్ళకు కాటుక పెట్టింది
లలాట తిలకం దిద్దింది
రెండు పిలకలను అల్లింది

గౌనుకు తగ్గ రిబ్బను కట్టింది
చెవులకు లోలకలు పెట్టింది
చేతికి గాజులు తొడిగింది

గ్లాసుడు పాలు తాగింది
భుజానికి బ్యాగు తగిలించింది
దొడ్లో గులాబీ పువ్వు కోసింది

అమ్మా నాన్నకు బై బై చెప్పింది
చకచక అడుగులు వేసింది
బడికి గబగబా చేరింది

గురువుకి దణ్ణం పెట్టింది
గులాబీ పువ్వు ఇచ్చింది
బోసినవ్వు రువ్వింది!

– గాదిరాజు రంగరాజు,
న్యూజెర్సీ, అమెరికా.



నీడను కనిపెట్టండి

పిల్లలూ, ఇక్కడ డ్యాన్స్ చేస్తున్న అమ్మాయి బొమ్మకు చుట్టుపక్కల కొన్ని నీడలు ఇచ్చాం. వాటిలో ఆ అమ్మాయి సరైన నీడ ఏదో కాస్త చూసి పెట్టరూ?

నేను గీసిన బొమ్మ

ఎస్. ప్రణవి
ఎనిమిదో తరగతి రాయిలాపూర్, మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'ప్రత్యేక' క్రికెటర్.. కెప్టెన్ అమీర్..

వడి లేచే కెరటాన్ని చూసి జీవిత పాఠాలు నేర్చుకుంటారు చాలా మంది. అయితే వారిలో కొందరే ఆ కెరటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలకు ఎగబాకుతారు. ఇప్పుడు మనం చెప్పుకుంటున్న వ్యక్తి ఆ కోవలోకే చెందుతాడు. భారత పారా క్రికెట్‌లో జమ్మూకాశ్మీర్ టీమ్‌కి కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు అమీర్ హుస్సేన్. అమీర్ ఎనిమిదేళ్ల వయసులో జరిగిన ఓ ప్రమాదంలో రెండు చేతులూ పోగొట్టుకున్నాడు. 'చేతులు లేని పిల్లవాడు ఎలా జీవిస్తాడు. వైద్యం చేయించుకునేందుకు మీ దగ్గర డబ్బులు కూడా లేవు. ఇక నుంచి మీ అబ్బాయి అవిటివాడుగా జీవించాల్సిందే...' అంటూ ఇరుగుపొరుగు వారు, బంధువులు ఆ కుటుంబానికి భరోసా కంటే భయాన్ని కలిగించారు. అమీర్ కుటుంబం ధైర్యం కోల్పోలేదు. తమ బిడ్డ ఏదో సాధిస్తాడని అప్పుడు వారు అనుకోలేదు. కానీ ఆ బిడ్డ అందరిలా బతకగలడని మాత్రం నమ్మారు. వైకల్యంతో కుదేలవ్వకుండా అండగా నిలబడ్డారు.

'ఏడేళ్లప్పుడు గల్లీ క్రికెట్ ఆడేవాడిని. అప్పటి నుండే ఆటపై ఎంతో మక్కువ పెంచుకున్నాను. కానీ అనుకోని ప్రమాదం నా కలలను తలకిందులు చేసింది. మూడేళ్ళ ఆస్పత్రిలోనే ఉన్నాను. ఇంటికి తిరిగివస్తే ఎన్నో జాలి చూపులు నాకు ఎదురయ్యాయి. అంత సానుభూతిని నేను భరించలేకపోయాను. వైకల్యం కంటే వాళ్ల నాపై చూపించే జాలి, దయ చాలా భయంకరంగా ఉండేవి' అని తన చిన్ననాటి అనుభవాన్ని అమీర్ గుర్తుచేసుకున్నాడు.

'ఇంట్లో అందరూ నన్ను బాగా చూసుకునేవారు. నానమ్మ ఎంతో గారాబం చేసేది. నాలో ధైర్యం నింపేది. చికిత్స తరువాత స్కూలుకు వెళ్లాను. అక్కడ నుంచే వివక్ష ఎదురైంది. నన్ను దూరంగా కూర్చొబెట్టేవారు. నాతో ఎవరూ మాట్లాడేవారు కాదు. అయితే ఆ వివక్ష తరగతి గది నాలుగు గోడలకే పరిమితం కాలేదు. సమాజం మొత్తం నన్ను అలాగే చూసింది. ఆ విషయం అర్థం కావడానికి నాకు ఎక్కువ కాలం పట్టలేదు. ఇంత వేదనలో కూడా నేను నా ఆటను విడిచిపెట్టలేదు. అదే ఇప్పుడు నాకు ఇంత గౌరవం తెచ్చిపెట్టింది' అని చెబుతాడు అమీర్.

తన అభిమాన క్రికెటర్.. సచిన్ టెండుల్కర్. తన జీవితంలో ఊహించని సంఘటనగా 2016లో టెండూల్కర్ సంతకం చేసిన బ్యాట్ అమీర్‌కి బహుమతిగా అందింది. 'ఆ క్షణం నా కళ్లు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాయి. సంతోషంతో మాట పెగల్లేదు. క్రికెట్ ఆట నేర్చుకోవడం కోసం నేను పడ్డ కష్టమంతా దూదిపింజలా ఎగిరిపోయింది' అని నాటి సంగతిని జ్ఞాపకం చేసుకున్నాడు.

కాళ్లతో బౌలింగ్ చేయడం, తల, మెడకు మధ్యలో బ్యాటు ఉంచి బంతిని కొట్టడం ఆషామాషీ విషయం కాదు. కానీ అమీర్ అది సాధించాడు. ఎంతో బాధ అనుభవించాడు. ఎక్కువ సమయం తల ఒకపక్కకు ఆన్చి ఉంచడం వల్ల విపరీతమైన నొప్పి వచ్చేది. మెడ వాచిపోయి రాత్రుళ్లు నిద్రపట్టేది కాదు. అయినా వెనుకడుగు వేయలేదు. తెల్లారి మళ్లీ ప్రాక్టీస్ చేసేవాడు. ఆ కఠోర సాధనే అమీర్‌ని ఇంత పెద్ద స్థాయికి తీసుకెళ్లింది.

'2013 నుంచి జాతీయపోటీల్లో పాల్గొంటున్నాను. బంగ్లాదేశ్, నేపాల్, దుబాయ్ వంటి చోట్ల మెరుగైన ఆట కనబర్చాను. దేశంలో కూడా ఎన్నో ప్రాంతాలకు వెళ్లాను. ఎక్కడికి వెళ్లినా నా ప్రతిభకు పట్టం కట్టేవారే కనిపించారు. ఎక్కడా నా వైకల్యాన్ని గుర్తు చేసినవారు లేరు' అని గర్వంగా చెబుతున్న అమీర్ తన పనులు తానే చేసుకుంటారు. టీ కప్పుతో టీ తాగుతారు. పుస్తకాలు చదువుతారు. రాస్తారు. షేవింగ్, వాషింగ్, ఫోను వినియోగం వంటి పర్సనల్ పనులు కూడా స్వయంగా తానే చేసుకుంటారు.

'ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై కొంచెం శ్రద్ధ పెడితే మామూలు వ్యక్తుల్లాగే వాళ్లు కూడా అన్ని పనులూ చేసుకోగలుగుతారు. అద్భుతాలూ సాధిస్తారు. నిరాశతో మీ జీవితాలను నాశనం చేసుకోకండి. ఓటమిని ఎప్పుడూ అంగీకరించకండి. మీ లక్ష్యాలను నెరవేర్చుకునే వరకు అంకితభావంతో పనిచేయండి. అప్పుడే మీరు విజయం సాధిస్తారు' అంటున్న అమీర్ లాంటి స్ఫూర్తివంత వ్యక్తులు ఎంతోమందికి ఆదర్శం.

దానిమ్మతో ఆరోగ్యం పదిలం

దానిమ్మలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దానిమ్మని గింజల రూపంలోనైనా, జ్యూస్ రూపంలో తీసుకున్నా ఒకే ఫలితం ఉంటుంది.

- దానిమ్మలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిలో ప్యూనికల్గిన్, ఆంథోసైనిన్లు శక్తివంతమైనవి. ఈ సమ్మేళనాలు ఫ్రీ రాడికల్స్, అస్థిర అణువులకు వ్యతిరేకంగా పోరాడతాయి. సెల్ డ్యామేజ్‌ని నివారిస్తాయి. ప్రతి రోజూ తాగడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడి, ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- దానిమ్మ రసం తాగడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులోని అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్ రక్తపోటును తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. మొత్తం గుండె పనితీరును

మెరుగుపరుస్తుంది. దానిమ్మ రసంలోని నైట్రిక్ ఆక్సైడ్ ధమనులను తెరుస్తుంది. రక్తం సాఫీగా ప్రవహిస్తుంది. గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

- కీళ్లనొప్పులు, మధుమేహం, క్యాన్సర్‌తో సహా అనేక రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి శరీరం లోపల అవయవాల్లో దీర్ఘకాలంగా మంటగా ఉంటుంది. దానిమ్మ రసంలో శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాలు ఉండడం వల్ల, ఈ మంటను తగ్గించడంలో సహాయపడతాయి.
- అధిక స్థాయిలో యాంటీ ఆక్సిడెంట్లు ఉండడం వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించే లక్షణాలు ఉండవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆ ప్రభావాలను పూర్తిగా అర్థం చేసుకోవడానికి మరింత పరిశోధన అవసరం అవుతుంది. అయినా రోజువారీ ఆహారంలో దానిమ్మ రసాన్ని జోడించడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదాన్ని తగ్గించవచ్చు.
- దానిమ్మ రసంలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థకు ఇది చాలా అవసరం. ఇందులో ఉండే యాంటీ బాక్టీరియల్ లక్షణాలు జీర్ణవ్యవస్థలో హానికరమైన బ్యాక్టీరియాతో పోరాడటానికి సహాయపడతాయి.

రామ్ చరణ్‌కి జోడీగా జాన్వీ కపూర్



బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతున్న రామ్‌చరణ్ చిత్రం గ్రామీణ నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాగా ఉండబోతోంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. తాజాగా హీరోయిన్‌ను చిత్ర బృందం ఫిక్స్ చేసింది. బాలీవుడ్ నటి జాన్వీకపూర్ ఈ చిత్రంలో చరణ్‌కు జోడీగా నటించనుంది. ఈ విషయాన్ని ఆమె తండ్రి బోనీకపూర్ స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'మా అమ్మాయి ఇప్పటికే ఎన్టీఆర్‌తో కలిసి 'దేవర'లో నటిస్తోంది. సెట్‌లో ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తోంది. మరికొద్ది రోజుల్లో రామ్‌చరణ్ నటించబోయే మూవీ షూటింగ్‌లోనూ పాల్గొంటుంది. ఎన్టీఆర్, చరణ్ ఇద్దరూ ఇద్దరే. ఆ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద అదరగొట్టాలని ఆకాంక్షిస్తున్నా. మరిన్ని చిత్రాల్లో నటించే అవకాశం జాన్వీకి రావాలి. నా భార్య శ్రీదేవి పలు భాషల్లో నటించారు. అలాగే నా కుమార్తె కూడా నటించాలి' అని బోనీకపూర్ అన్నారు.

తెలుగు 'భ్రమయుగం' సిద్ధం

మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించిన 'భ్రమయుగం' చిత్రం తెలుగులో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా ఫిబ్రవరి 23న విడుదల కానుంది. నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ పతాకాలపై చక్రవర్తి రామచంద్ర, ఎస్. శశికాంత్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల మలయాళంలో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. సినిమాలోని వైవిధ్యమైన కథాంశానికి, మమ్ముట్టి అద్భుతమైన నటనకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి ప్రశంసలు కురిశాయి. మమ్ముట్టితో పాటు అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లిజ్ వంటి నటీనటులు నటించారు. ఈ చిత్రానికి రచయిత–దర్శకుడు రాహుల్ సదాశివన్.

కళాతపస్వి పేరుతో అవార్డు

కళాతపస్వి కాశీనాధుని విశ్వనాథ్ పేరుతో అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిలిం అండ్ మీడియా యంగ్ ఫిల్మ్ మేకర్స్‌కు అవార్డు ప్రదానం చేస్తున్నట్లు విశ్వనాథ్ కుటుంబం ప్రకటించింది. ప్రభావవంతమైన, అర్థవంతమైన సినిమాని రూపొందించడానికి స్ఫూర్తిని ఇచ్చే లక్ష్యంతో ఇద్దరు విద్యార్థులకు ఈ అవార్డును అందిస్తున్నారు. సౌండ్ డిజైన్, డైరెక్షన్ రంగాల్లో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించే ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేస్తారు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌ను సందర్శించిన విశ్వనాథ్ కుమారుడు నాగేంద్ర ఈ విషయాన్ని ప్రకటించారు. తన కుటుంబంతో నాగార్జున, అమల దంపతులను కలిశారు.

ఇవి ఉద్విగ్నభరితమైన రోజులు

బాలీవుడ్ నటి భూమి పడ్నేకర్ కీలక పాత్రలో నటించిన 'భక్షక్' చిత్రం మంచి రివ్యూస్ రాబట్టింది. భూమి నటనకి కూడా విమర్శకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. తాజాగా ఆమె ఈ చిత్ర విశేషాలపై మాట్లాడారు. 'మహిళను శక్తిమంతురాలిగా, సమాజంలో మార్పు తీసుకొచ్చే పోరాట యోధురాలిగా చూపించే.. ఏ పాత్రనూ వదులుకోను. నా కెరీర్, వృత్తి జీవితంలో ఇవి ఉద్విగ్నభరితమైన రోజులు. నేను చేసిన చిత్రాల్లో 'భక్షక్' ప్రత్యేకం. అందులో సమాజంలో మంచి మార్పునకు కారణమయ్యే ఓ మహిళా ప్రతినిధి పాత్ర పోషించాను. సమాజ మార్పు కోసం నాయకురాలిగా మారి, విజయం సాధించిన అమ్మాయిల పాత్రలతో కూడిన సినిమాలు మన దగ్గర అరుదుగా వస్తుంటాయి. నా పాత్రను హృదయాల్లో పెట్టుకున్నందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు.' అని పేర్కొన్నారు. అమ్మాయిల అక్రమ రవాణా, సెక్స్ రాకెట్ గుట్టు ఛేదించే మహిళా పాత్రికేయురాలు వైశాలి సింగ్ ప్రధాన పాత్రగా 'భక్షక్' చిత్రం తెరకెక్కింది.

'హద్దు లేదురా' టీజర్ విడుదల

ఆశిష్ గాంధీ, అశోక్ హీరోలుగా వర్ష, ప్రతిక హీరోయిన్లుగా రాజశేఖర్ రావి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'హద్దు లేదురా'. టైగర్ హిల్స్ ప్రొడక్షన్, స్వర్ణ పిక్చర్స్ బ్యానర్స్‌పై వీరేష్ గాజుల బళ్లారి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రావి మోహన్ రావు సహ నిర్మాత. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ లుక్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆశిష్ గాంధీ మాట్లాడారు. 'నేను నటించిన 'నాటకం' టీజర్ ఇక్కడే లాంచ్ అయ్యింది. అది చాలా మంచి హిట్ అయ్యింది. అలాగే ఈ సినిమా కూడా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. సినిమాలో పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు' అని కోరారు.

'రికార్డ్ బ్రేక్' అందరికీ నచ్చే సినిమా

శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలిమ్స్ బ్యానర్‌పై చదలవాడ పద్మావతి నిర్మాతగా వ్యవహరిస్తున్న చిత్రం 'రికార్డ్ బ్రేక్'. దర్శకుడు చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ 'ఈ సినిమా ఇంత చక్కగా రావడానికి దర్శకుడు అజయ్ కారణం. ఈ సినిమాలో హీరో అంటూ ఎవరూ ఉండరు. ఈ సినిమాకి మెయిన్ హీరోలు ఆర్ట్ డైరెక్టర్, ఫైట్ మాస్టర్, మ్యూజిక్ డైరెక్టర్. వేటగాడు, అడవి రాముడు, దేవదాసు లాంటి సినిమాల ఇన్స్పిరేషన్‌తో సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టాను. ఈ సినిమా ఖచ్చితంగా అన్ని భాషల్లోనూ అద్భుతాలు సృష్టిస్తుంది. ఆఖరి 45 నిమిషాలూ చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. కచ్చితంగా అందరికీ నచ్చే సినిమా అవుతుంది' అన్నారు.

ఆంధ్ర-కేరళ రంజీ మ్యాచ్ డ్రా

- క్వార్టర్స్‌లో మధ్యప్రదేశ్‌తో ఢీ
- 23నుంచి రంజీట్రోఫీ నాకౌట్ పోటీలు

అశ్విన్ హెబ్బర్ 72పరుగులు

విశాఖపట్నం: ఆంధ్ర–కేరళ జట్ల మధ్య జరిగిన గ్రూప్ ఆఖరి లీగ్ మ్యాచ్ డ్రా అయ్యింది. వికెట్ నష్టానికి 19 పరుగులతో సోమవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర జట్టు చివరిరోజైన నాల్గోరోజు ఆట ముగిసే సమయానికి 9వికెట్లు కోల్పోయి 189పరుగులు చేసింది. జనవరి 5న ప్రారంభమైన రంజీట్రోఫీ సీజన్ సోమవారం జరిగిన గ్రూప్ లీగ్ చివరి పోటీలతో ముగిసాయి. ఎలైట్ గ్రూప్–ఎ, బి, సి, డిలతో పాటు ప్లేట్ గ్రూప్‌లోనూ మ్యాచ్‌లు జరగ్గా.. ప్రతి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన జట్లు ఇతర గ్రూపుల్లో ఆయా గ్రూపుల్లో రెండో స్థానంలో నిలిచిన జట్లతో క్వార్టర్‌ఫైనల్లో తలపడనున్నాయి. ఎలైట్ గ్రూప్–ఎలో విదర్భ(33పాయింట్లు), సౌరాష్ట్ర(28) తొలి రెండు స్థానాల్లో నిలువగా.. ఎలైట్ గ్రూప్–బిలో ముంబయి(37), ఆంధ్రప్రదేశ్(28), ఎలైట్ గ్రూప్–సిలో తమిళనాడు(28), కర్ణాటక(27), ఎలైట్ గ్రూప్–డిలో మధ్యప్రదేశ్(32), బరోడా(26) ఆయా గ్రూప్‌లలో తొలి రెండు స్థానాల్లో నిలిచి క్వార్టర్స్‌కు చేరాయి. క్వార్టర్‌ఫైనల్ పోటీలు శుక్రవారం నుంచి జరగనున్నాయి. లీగ్ దశ ముగిసాయి. విదర్భ, ముంబయి, తమిళనాడు, మధ్యప్రదేశ్ ఆయా గ్రూప్‌లలో టాప్‌లో నిలిచాయి. అలాగే ప్లేట్ గ్రూప్‌లో హైదరాబాద్–మేఘాలయ జట్ల మధ్య జరిగిన ఫైనల్లో హైదరాబాద్ జట్టు టైటిల్‌కు చేరువైంది.

23న జరిగే క్వార్టర్‌ఫైనల్స్...

విదర్భ × కర్ణాటక
ఆంధ్ర × మధ్యప్రదేశ్
ముంబయి × బరోడా
తమిళనాడు × సౌరాష్ట్ర

టెస్టుల్లో దుమ్మురేపుతున్న జైస్వాల్

- ఆరు ఇన్నింగ్స్ 545 పరుగులు

ముంబయి: టీమిండియా యువ సంచలనం యశస్వి జైస్వాల్ ఇంగ్లండ్‌పై వరుసగా రెండు టెస్టులలో ద్విశతకాలు బాది రికార్డులు నెలకొల్పాడు. రాజ్‌కోట్ వేదికగా ముగిసిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (214) చేసిన జైస్వాల్.. ఈ క్రమంలో 12 భారీ సిక్సర్లు బాది ఓ టెస్టులో అత్యధిక సిక్సర్లు బాదిన తొలి భారత క్రికెటర్‌గానూ నిలిచాడు. అలాగే ఐసిసి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2023–25 సైకిల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గానూ ముందంజలో నిలిచాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజాను అధిగమించి జైస్వాల్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఐసీసీ డబ్ల్యూటిసి 2023–25 సైకిల్‌లో భాగంగా జైస్వాల్.. 13ఇన్నింగ్స్‌లలోనే 863 పరుగులు చేశాడు. ఈ క్రమంలో అతడు మూడు సెంచరీలు (రెండు డబుల్స్) చేశాడు. ఈ జాబితాలో నిన్నటిదాకా అగ్రస్థానాన ఉన్న ఆసీస్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా..20ఇన్నింగ్స్‌లలో 855 పరుగులతో రెండో స్థానానికి పడిపోయాడు. ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ క్రాలే.. 15ఇన్నింగ్స్‌లలో 706పరుగులతో మూడో స్థానంలో ఉండగా ఆసీస్ వెటరన్ బ్యాటర్ స్టీవ్ స్మిత్.. 20ఇన్నింగ్స్‌లలో 687పరుగులతో ఫోర్త్ ప్లేస్‌లో ఉన్నాడు. గతేడాది భారత జట్టు వెస్టిండీస్ పర్యటనలో భాగంగా ఎంట్రీ ఇచ్చిన జైస్వాల్.. తొలి టెస్టులోనే భారీ శతకం బాదాడు. ఆ తర్వాత సౌతాఫ్రికాలో అంతగా రాణించకపోయినా స్వదేశంలో ఇంగ్లండ్‌పై మాత్రం జూలు విదిలించాడు. హైదరాబాద్ టెస్టులో సెంచరీ మిస్ చేసుకున్న జైస్వాల్.. వైజాగ్‌లో టెస్టులో ఏకంగా డబుల్ సెంచరీ కొట్టేశాడు. తాజాగా రాజ్‌కోట్‌లో కూడా రెండో ఇన్నింగ్స్‌లో మరో ద్విశతకంతో మెరిశాడు. ఈ సిరీస్‌లో భాగంగా మూడు మ్యాచ్‌లు ఆడిన జైస్వాల్ 6 ఇన్నింగ్స్‌లలో 545 పరుగులు చేసి సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా ఉన్నాడు.

మహిళల హాకీ మరో అద్భుత విజయం

- షూటౌట్‌లో అమెరికాపై గెలుపు

రూర్కెలా: భువనేశ్వర్ వేదికగా జరుగుతున్న ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత మహిళల హాకీజట్టు మరో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మూడ్రోజులక్రితం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 3వ స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాను చిత్తుచేసిన అమ్మాయిలు.. ఆదివారం రాత్రి అమెరికాపైనా సంచలన విజయం సాధించింది. నిర్ణీత సమయం పూర్తయ్యేసరికి ఇరుజట్లు 1–1 గోల్స్‌తో సమంగా నిలిచినా.. షూటౌట్‌లో భారతజట్టు 2–1గోల్స్ తేడాతో అమెరికాపై విజయం సాధించింది. భారత్ తరఫున దీపిక కుమారి గోల్ చేయగా.. అమెరికా తరఫున ఆష్లే సీసా ఒక గోల్ కట్టింది. షూటౌట్‌లో ముంతాజ్ ఖాన్, సోనిక గోల్ చేయగా.. అమెరికా తరఫున లిహ్ క్రౌస్ మాత్రమే గోల్ నమోదు చేసింది. భారత మహిళల హాకీజట్టు ప్రదర్శన పట్ల చీఫ్ కోచ్ జన్నెకె స్కోప్‌మన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మ్యాచ్‌లో భారత్‌కు అనేక పెనాల్టీ కార్నర్లు లభించినా వాటిని గోల్‌గా మలచడంలో విఫలమయ్యారని ఆమె తెలిపింది.

నాల్గో టెస్ట్‌కు బుమ్రాకు విశ్రాంతి

పటీధర్ స్థానంలో కెఎల్ రాహుల్

రాజ్‌కోట్: రాంచీ వేదికగా జరిగే నాల్గో టెస్ట్‌కు వైస్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా విశ్రాంతి తీసుకోనున్నాడు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో పేస్ గుర్రం జస్ప్రీత్ భారత్ తరఫున అత్యధిక వికెట్లు కూల్చిన బౌలర్లలో ముందంజలో ఉన్నాడు. అలాగే మూడోటెస్ట్‌లో నిరాశపరిచిన రజత్ పటీధర్ స్థానంలో గాయం నుంచి కోలుకున్న కెఎల్ రాహుల్ చోటు దక్కించుకోనున్నాడు. బిసిసిఐ అధికారి ఒకరు మూడో టెస్ట్ ముగిసిన తర్వాత ఈ విషయాన్ని వెల్లడించాడు. మంగళవారం బుమ్రా అహ్మదాబాద్‌లోని తన ఇంటికి తిరిగి వెళ్లనున్నాడని ఆ అధికారి తెలిపాడు. బుమ్రాపై వర్క్‌లోడ్‌ను తగ్గించాలనే ఉద్దేశ్యంతో బిసిసిఐ ఆ నిర్ణయానికి వచ్చినట్లు, నాల్గోటెస్ట్ ముగిసిన తర్వాత మహ్మద్ సిరాజ్‌కు కూడా విశ్రాంతినిచ్చే అవకాశమున్నట్లు ఆయన తెలిపాడు. ఇక ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2–1ఆధిక్యతలో ఉన్న సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68